# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

## సంపుటి - 1

### గేయకావ్యం - భాగం - 1



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాదు

# బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటం - 1

గేయకావ్యం

## రాభీలు

ప్రధాన సంపాదకులు

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

సంపాదకులు

ఆచార్య కె. ఆనందన్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం
సంపుటం-1 గేయకావ్యం - రాభీలు

**Boyi Bhimanna Samagra Sahityam**
**Volume - 1 Geyakaavyam - Raabheelu**
*Padmabhushan Dr. Boyi Bhimanna Sahitya Peetham*
Potti Sreeramulu Telugu University
Hyderabad - 500 004

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ : సెప్టెంబర్, 2008
ప్రతుల సంఖ్య : 1000
ప్రచురణల సంఖ్య : 323

మూల్యం : రూ॥ 75/-

ముఖచిత్ర రచన: ఆర్. మురళి

ప్రతులకు:
డైరెక్టర్,
ప్రచురణల విభాగం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి,
హైదరాబాద్ - 500 004

డిటిపి: జి.ఎస్.ఎన్. మూర్తి

ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్,
విద్యానగర్, హైదరాబాద్ - 500 044

**ISBN: 81-860-73-195-7**

Grams: "TELVERS"
Phone: Off: 040-23234815
Gele Fax : 040-23236911
E-mail: info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం, పబ్లిక్ గార్డన్స్,
హైదరాబాద్ - 500 004

## డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్.రాజశేఖర రెడ్డిగారు ప్రకటించారు. దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే ఈ కింది కార్యక్రమాలకు రూపకల్పన చేసింది:

1. డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం,గేయం -వచన కవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ బోయి భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
3. డా॥ బోయి భీమన్న రచనలపై వివిధ ప్రాంతాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
4. (ఎ) భీమన్న రచనలపై విస్తృత పరిశోధనలు చేయడం.
   (బి) భీమన్న రచనలపైన వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
5. డా॥ బోయి భీమన్న జీవితం-రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటుచేయడం.

6. డా॥ బోయి భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
7. డా॥ బోయి భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
8. డా॥ బోయి భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.
9. డా॥ బోయి భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి నిర్వహిస్తోంది. ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న రచనలపై విస్తృత పరిశోధనలు చేయించటానికి లబ్ధప్రతిష్ఠులైన సాహితీ వేత్తలను ఎంపికచేసి ఒక్కొక్కరికి, ఒక్కొక్క గ్రంథాన్ని అప్పగించటం జరిగింది. డా॥ భీమన్న రచనలను ఇంగ్లీషులోకి అనువదించడానికి ప్రసిద్ధులైన అనువాదకులకు పని అప్పగించి పూర్తిచేయించటం జరిగింది.

డా॥ బోయి భీమన్న గారి గేయకావ్యాలను సేకరించి, రెండు సంపుటాలుగా ప్రచురించడమవుతోంది. ఇందులో మొదటి సంపుటం, భాగం-1లో 'రాభీలు' గేయకావ్యం మాత్రం పొందుపరచడం జరిగింది. భాగం-2లో బొమ్మ, పాటలతోట, అకాండ తాండవం, పాటలలో అంబేడ్కర్ కావ్యాలను ప్రచురించడం జరుగుతుంది. తెలుగు వారి భాషా సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలుకల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. ప్రథమ ముద్రణ వరకు (2008) పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయనికి హక్కులు ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి, హైదరాబాద్ వారికి ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం ఉంటుందని ఆశిస్తున్నాం.

హైదరాబాద్

తేది: **16-9-08** (అనుమాండ్ల భూమయ్య)

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్యపీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500 004

ఆచార్య కె. ఆనందన్
కన్వీనర్

ఫోన్ నెం. 23230435,
23230641
Ext.336 / 323
Fax - 040 23236045

# మనవి

సాహిత్యప్రస్థానంలో గేయం మొదట పుట్టింది. తర్వాత మిగిలిన ప్రక్రియలు ప్రచారంలోకి వచ్చాయి. పాట మనిషి అంతరింద్రియాల్ని మేల్కొలిపి చైతన్యవంతం చేస్తుంది. భీమన్న గారి తల్లి నాగమ్మ గారు శ్రమ జీవన వేదం నుండి ఎన్నో నాదాలు, ఎన్నో గీతికలు వెలువడ్డాయి. పాటను ఉగ్గుపాలతో కలిపి భీమన్నను ఆ పథగామిగా చేసింది. భీమన్న చిన్నతనంలో ఆలమందల కడనేర్చిన, పాడిన పాటలెన్నో ఉన్నాయి. భీమన్న పాటలు జనంలోకి చొచ్చుకొనిపోయి వారిని స్పందింపచేసాయి. గేయాలు, ప్రచార ప్రబోధాలకు అత్యుత్తమ సాధనం. తన మనసులో మెదిలే భావాభివ్యక్తికి, సామాన్య జనహృదయ స్పందనను కల్గించి, ఉత్సాహాన్ని రేకెత్తించటంలో దీనికి మించిన సాధనం మరొకటి లేదు. విశ్వకవి రవీంద్రనాథ ఠాగూర్ ఓ పర్యాయం "ప్రజలు నా పద్యాలను మరచినా పాటలు మాత్రం పాడుకుంటూనే ఉంటారు" అని అన్నారు. భీమన్నగారు తన భావాభివ్యక్తికి ఇతర ప్రక్రియలతో పాటు గేయాన్నీ ఎంచుకొన్నారు. వీరి 'గేయాలు జనం మనసుపై మత్తుచల్లి, నాలుకపై నెలవు చేసుకొంటాయి. దీనికి కారణం జీవి మానవుడుగా మోసులెత్తడంతో పాటే గానం కూడా తానాలు సాగడమే గానం, గేయం మానవ జాతి ప్రాదుర్భావంతో పెనవేసుకున్నవి కనుకనే ప్రాగైతిహాసిక పరిజ్ఞానానికి పరమ ప్రమాణం' అన్నారు.

బోయి భీమన్న గారు తన సాహితీ క్షేత్రంలో పండించిన ఫలభరిత కావ్యాలలో గేయకావ్యాలు చాలా ప్రాధాన్యాన్ని సంతరించుకొని ఉన్నాయి. ఆయా సందర్భాలలో పాడుకొన్న, లేదా రాసిన పాటల్ని సంకలనం చేసి 'పాటలతోట', 'రాభీలు' అనే సంపుటాలుగా ప్రకటించారు. ఇవిగాక 'బొమ్మ' కావ్యం ఓ చక్కని మధురానిభూతిని మిగిల్చే గేయకావ్యం. అంబేడ్కర్ భావాజాలాన్ని, వారి బోధనల్ని పాటల రూపంలో

కూర్చి 'పాటలలో అంబేడ్కర్' పేరుతో ప్రకటించారు. అవి సుప్త దళితచేతనను తట్టిలేపుతున్నాయి. ప్రణయరంజితాలై, దుఃఖిత హృదయాలకు ఓదార్పునిచ్చే ఔషధంగా, అభయప్రదాతగా, విరహ తప్తులకు చందన తరులతా నికుంజాలైనాయి. భీమన్న తన గేయాలనుగూర్చి

ప్రతి ఇంటికి దీపములై
ప్రతి గుండెకు రూపములై
జీవిత పరమార్థములై,
శ్రీ నిలయములైన ఇవి
చీకటులను తొలగించే
జీవితమధుమాసములవి
జీవికి సఫలతకూర్చే
సిద్ధామృతరస నిధులివి – అన్నారు.

భీమన్నగారి శ్రీమతి హైమవతీ భీమన్నగారి మధురస్వర ఆలాపనతో పరవసించిన భీమన్న కలం ఎన్నో గేయాలను జనహృదయ ఆహ్లాదకరంగా వెలువరించింది. ఈ గేయ సంపుటిని రెండు భాగాలుగా ప్రచురిస్తున్నాం. వీటిలో ఏవైనా దోషాలుంటే వాటిని సహృదయులు తెలియజేస్తే మలి ముద్రణలో సవరించుకోగలం.

బోయి భీమన్నగారి మొత్తం కావ్యాల్ని సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతీ భీమన్నగారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మా మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మ గారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన. వారి పుత్రిక శ్రీమతి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు. కావ్యాల్ని చక్కగా డి.టి.పి. చేసిన జి.యస్.యన్. మూర్తి గారికి, లే అవుట్ చేసిన శ్రీమతి చేరాల పుష్పలతకు, ప్రూఫులు దిద్ది సహకరించిన డా॥ మాదిరాజు కనకదుర్గ, శ్రీమతి కంచర్ల మాధవి, డా॥ డి. నల్లన్న, శ్రీ టి. నాగరాజశెట్టి, శ్రీమతి రమాంజనీకుమారి గార్లకు ముఖచిత్ర రచన చేసిన ఆర్. మురళిగారికి, అందంగా ముద్రించిన కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్ వారికి ... అందరికీ కృతజ్ఞతలు.

హైదరాబాద్
తేది: 16-9-08

(కె. ఆనందన్)



ప్రథమ ముద్రణ
1971

సన్మాన సంఘ ప్రచురణ

లలితా ప్రెస్సు
ఖైరతాబాద్

హక్కులు రచయితవి
వెల: 15/-

ప్రతులకు:
సుఖేలానికేతనం
ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాదు - 4

# రాఖీలు

## ఉన్మీలన

Devotees whose lives are marked by intense faith in and dedication to God will remain absolutely unruffled even in the midst of grave adversity - like a mountain that stands unaffected by torrential rain. To them, divine bliss alone is worth striving for, and to achieve it they will sacrifice anything. The only agony they cannot endure is separation from the Lord. The relationship of Gopis with Sri Krishna was characterised by a flawless love that transcended the common place physical considerations.

It was basically wrong to judge the acts of God by the standards set for ordinary human beings. As the Almighty, His powers and capabilities are far beyond those of man.

Particularly in the Krishna Avatara, God revealed His superhuman nature in practically everything He did. Amorous dance with the Gopis should be interpreted keeping in mind that He was the Supreme Being and the indwelling spirit in every creature of the Universe. The Rasa Lila signified the mingling of the individual soul with the Supreme Soul.

(భగవంతుడిలో ప్రగాఢమైన విశ్వాసమూ, ఆత్మార్పణమూ కల భక్తుడు ఎంతటి తీవ్ర కష్టానికైనా – కుంభవృష్టికి మహాపర్వతం వలె చలించడు. అట్టి భక్తులకు భగవదానంద మొకటే యత్నించదగింది. దాని సిద్ధికై వారు ఎట్టి త్యాగాలనైనా చెయ్యగలరు. వారు ఓర్చుకోలేని దొకటే. అది తమ ప్రభువు నుంచి ఎడబాటు. శ్రీకృష్ణుడితో గోపికలకు కల సంబంధం అమలినమైనట్టిది, మామూలు శారీరక విషయాలకు అతీతమైనట్టిది.

సామాన్య మానవ జీవులకు నిర్దేశించబడ్డ ప్రమాణాలతో భగవంతుని చర్యలను పరిశీలించడం తప్పు. భగవంతుడు సర్వశక్తి మంతుడు కనుక అతడి శక్తులు, సామర్థ్యాలు మానవాతీతమైనట్టివి. ముఖ్యంగా కృష్ణావతారంలో, భగవంతుడు తాను చేసిన ప్రతి పనిలోనూ కూడ తన అతి మానుష శక్తుల్ని ప్రదర్శించాడు. గోపికలతో అతడు చేసిన ప్రణయ నృత్యానికి అర్థం చెప్పేటప్పుడు – అతడు సర్వేశ్వరుడనీ, విశ్వంలోని ప్రతి జీవిలోను ఆత్మగా నివసిస్తున్న పరమాత్మ అనీ మనం గుర్తుంచుకోవాలి. వైయక్తి కాత్మ పరమాత్మతో కలిసి పోవడమే రాసలీల యొక్క సంకేతం.)

* * *

ఒక రోజున రాభీల ప్రూఫులు దిద్దుకొంటూ నేను లలితా ప్రెస్‌లో కూర్చుని ఉన్నప్పుడు, ఆనాటి (డిసెంబరు 7, 1970) హిందూ పత్రికనా కంటపడింది. అందులో శ్రీరామ దీక్షితార్ అనే ఆయన చేసిన భాగవతోపన్యాసానికి చెందిన ఒక వార్త ఉంది. అదే నేను పైని క్లుప్తంగా ఇచ్చిన ఆంగ్ల ఉద్ధాటిక. (బ్రాకెట్లలో ఇచ్చింది దాని అర్థం.)

ఆ ఉపన్యాస భాగాన్ని నేను పైకి చదివి, "చూశారా, ఈనాడు కూడ రాసలీలకు పండితులు చెపుతున్న అర్థం?" అన్నాను. దానితో ప్రెస్ అధిపతి అయిన శ్రీ చర్ల గణపతి శాస్త్రిగారు రంగంలోకి దిగారు. ఆయన జ్ఞానేంద్రియాలకు కర్మేంద్రియా లను, పంచ భూతాలను చేర్చి, వాటికి మనస్సును కూడ చేర్చి, వెరసి పదహారు చేసి, దానికి మూడు సున్నాలు చేర్చి, మొత్తం పదహారు వేలు చేశారు. ఆ పదహారు వేలూ 16,000 మంది గోపికలు అన్నారు. కాగా, గోపిక లంటే వ్యక్తులు కాదు కనుక, శరీర ప్రసక్తే లేదన్నారు.

బాగుంది, నిజమే. పైగా, గణపతి శాస్త్రిగారు గొప్ప విద్వాంసులు. బహుగ్రంథ కర్తలు. పరిశోధకులు, తాత్త్వికులు. ఆయన చెప్పిన దానిని సరదాకు కూడ కాదనడానికి వీలు లేదు.

పైగా – మన జాతీయ వాఙ్మయంలో వేదాల నుంచి పురాణాల వరకు, గాథల నుంచి ఆచారాల వరకు అన్నీ సంకేతాలే కదా? ఆత్మ పరమాత్మ సమైక్యానికి రాసలీల సంకేత మంటే – నిజమే మరి.

* * *

అయితే – ఇక్కడ ఒక చిన్న సందేహం.

ఈ ఇంద్రియాలు వగైరా కేవలం స్త్రీలవేనా? పురుషులవి కూడానా? వైయక్తి కాత్మ అంటే అది స్త్రీలదేనా? పురుషులది కూడానా? వ్రేపల్లెలో ఉన్న వాళ్లు వట్టి గోపిక లేనా? గోప కుమారులు కూడా ఉన్నారా? మరి – పరమాత్మ లీలకు ఆడవాళ్లే ఎందుకు కావలసి వచ్చినట్టు? రమారమి అదే సంఖ్యలో ఉండే మగవాళ్లు ఎందుకు అక్కరలేక పోయారు? స్త్రీ పురుష భేదం లేని, శారీరక వాసనలు లేని భగవంతుడు తన రాసలీల నుంచి పురుషుల్ని వెలివేశాడేమి?

పోనీ – ఆయన ఎత్తింది పురుషావతారం కదా అంటే – ఆయన స్త్రీగా అవత రించిందెప్పుడూ! పరబ్రహ్మ స్త్రీ పురుషాతీతమైన ఒక మహాశక్తి కదా? బహుస్త్రీ లోలుప మైన కృష్ణావతారం లాంటి, బహు పురుష లోలుపమైన ఒక ఏదో రంభావతారాన్ని ఆయన ఎందుకు ఎత్తలేదు? ఇది అసలు తత్వంలోని లోపమా? గ్రంథకర్తలైన పురుషుల పక్షపాతమా?

''రసోవైసః'' భగవంతుడు ఆనందస్వరూపుడు. రసం హ్యేవాయం లబ్ధానందీ భవతి'' ఇతడు రసమునే పొంది ఆనందము కలవాడగును. ఇది శ్రుతి వాక్యం.

భగవంతుడు రసస్వరూపుడు. సరే. రసానికి స్త్రీ పురుష భేదం ఉన్నదా? అట్టి రసం జీవ భూతమయి, శరీరం తాల్చినప్పుడు అది పురుష మూర్తి కావడానికి ఎంత అవకాశమున్నదో, స్త్రీ మూర్తి కావడానికి కూడా అంతే అవకాశం ఉంది కదా? రసస్వరూ పుడైన భగవంతుడు రసాన్నే అనుభవిస్తూ ఆనందిస్తున్నాడంటే – తనకు తానే అను భవిస్తూ, తనలో తానే లీనమవుతున్నాడని కదా అర్థం? అయితే – ఎంత భగవంతుడైతే మాత్రం, తనను తానే ఎలా అనుభవించగలడు? ఒకవేళ అనుభవించగలిగినా, ఆనందం ఎలా పొందగలడు?

అందుకే స్త్రీ పురుష భిన్నత్వం కావలసి వచ్చింది. భగవంతుడు అంటే మూల బ్రహ్మ యొక్క రసతత్వం, రెండు శాఖలై పురుషుడుగాను, స్త్రీగాను ఆవిర్భవించవలసి వచ్చింది. ఈ ఉభయ మూర్తులలోను ఉన్న జీవశక్తి ఒక్కటే. సృష్టిస్థితి లయాత్మకమైన ఆనందానుభవం కోసమే భిన్నత్వం అవసరమైంది.

* * *

ఈ దృష్టితో చూస్తే, స్త్రీ పురుషులు సమానులే. ఉభయులూ బ్రహ్మస్వరూపులే. ఆనందానుభవానికి పురుషుడికి స్త్రీ ఎంత అవసరమో, స్త్రీకి పురుషుడూ అంతే అవసరం. ఈ సత్యం మానవులలో కంటె ఇతర వర్గాల జీవులలో ఎక్కువ స్పష్టంగా కనిపిస్తుంది. మానవులలో పురుషుడికి స్త్రీని అపరుద్ధంగా చేసినట్టిది ఒక్క ఆర్థిక పరిస్థితే - అనేక రూపాలలో.

వ్రేపల్లెలో మగవాడు ఒక్క శ్రీకృష్ణుడే కాదు. బలరాముడు, తదితర గోపకుమారులు వేలకొలదీ ఉన్నారు. అందరి కంటె కృష్ణుడు బలవంతుడు కావచ్చు. భగవచ్ఛక్తి ఎక్కువ మోతాదులో ఆయనలో వ్యక్తీ భూతమై ఉండవచ్చు. శక్తి తక్కువగా ఉన్నంత మాత్రం చేత తక్కిన కుర్రవాళ్లు భగవద్రూపాలు కాకపోరు కదా? ఒక మహానదిలో నీరు చాల ఎక్కువగా ఉండవచ్చు. చిన్న సెలయేటిలోది కూడ నీరే కదా? శ్రీకృష్ణుడు ఒక మహానది అయినప్పుడు, ఆయనకు ఒక ప్రక్క నుంచి వచ్చే సెలయేళ్లు గోపికలు, మరో ప్రక్క నుంచి వచ్చే సెలయేళ్లు గోపకులు కావాలి. ఆయనలో కలిసిపోయే అర్హత ఆ ఉభయ తరహాలకూ ఉంది. కాగా, రాసలీలలకు ఆత్మ పరమాత్మ పరంగా అర్థం చెప్పడం సత్యదూరమవుతుంది. మహాశక్తిమంతుడైన ఒక పురుషుడు అనేక మంది స్త్రీలతో శృంగార క్రీడలు జరపడం కంటె రాసలీలకు మరో విశేషార్థం లేదు.

అయితే – ఇన్ని శతాబ్దాలుగా పెంచుకొంటూ వస్తున్న మధుర భక్తి తత్త్వం ఇలా పోవలసిందేనా?

## రసాద్వైతం

పురుష మూర్తి అయిన శ్రీకృష్ణుణ్ని స్త్రీ లెంతమంది అయినా ప్రేమించవచ్చు. తరించవచ్చు. అది సహజ ధర్మమే. మరి పురుషుని సంగతేమిటి? అతడు తరించాలిగా? అందుకు మనవాళ్లు చెప్పిందేమిటి? తాను స్త్రీగా (రాధగా) ఊహించుకొని భగవంతుణ్ని (కృష్ణుణ్ని) పొందాలనడం. అదే మధుర భక్తి అంటే అట్టిది పురుషుడికి సహజమేనా? సాధ్యమేనా? స్త్రీ రూప ప్రకృతిని తరింపజేయడానికి ఒక శృంగార పురుషావతారం ఎలా వచ్చిందో, అలానే పురుష రూప ప్రకృతిని తరింపజేయ

డానికి ఒక శృంగార స్త్రీ అవతారం ఉండవలసి లేదా? స్త్రీ మూర్తిని పురుషుడు, పురుష మూర్తిని స్త్రీ ఆరాధించి ఆత్మార్పణ చేసుకొన్నప్పుడే కదా ఆ భిన్న రూపాలకు ఏకత్వ సిద్ధి? బ్రహ్మత్వ సిద్ధి?

"ప్రకృతి-పురుషుడు" అన్నప్పుడు, పురుషుడంటే అర్థం పరబ్రహ్మ అని మాత్రమే. మగవాడు అని కాదు. మనలోని ఆడ, మగ అందరూ ప్రకృతిలోని అంతర్భాగాలే. పరబ్రహ్మలోని రసతత్వం రెండు స్త్రీ పురుష భిన్న ప్రవృత్తులు కల ప్రకృతిగా పరిణమించినప్పుడు – ఆ రెండు ప్రవృత్తులూ తిరిగి మూల బ్రహ్మలో లీనం కావాలంటే – అవి ఒకదాని నొకటి పొంది అనుభవించక తప్పదు. అదే రసస్వరూపుడైన భగవంతుడు రసాన్నే పొంది ఆనందిస్తున్నాడన్న శ్రుతి వాక్యాని కర్థం. ఈ అర్థం అవగాహన కాక, పురుషుడంటే తానే అనుకొన్న మగవాడు అహంకరించి, అసలు శ్రుతినే తప్పుదారి పట్టించాడు. ఏకపక్షమైన రాసలీలల్ని సృష్టించి, ప్రకృతి పురుష తత్వాన్నే తగలేశాడు.

ఆడ, మగ కలిసి ఉన్న – సగుణ బ్రహ్మ అయిన – ప్రకృతిలో నేనొక మగవాణ్ని. నాలాంటి మగవాడే అయిన శ్రీకృష్ణుణ్ని నేను ఆత్మైక్యం కోసం ఆరాధించలేను. ఏవో ఇహ పర సంబంధాలైన ప్రయోజనాల కోసం పూజలు, భజనలు చేయవచ్చు. అది వేరు. నేను రాధగా ఊహించుకోలేను. అది నా స్వభావానికే విరుద్ధం. పురుషుడు పురుషునితో, స్త్రీ స్త్రీతో ఆత్మైక్యం పొందలేరు. ఆత్మను ద్రవింపజేసుకొని, సమర్పించుకోవడం ద్వారా స్త్రీ జనం శ్రీకృష్ణుడితో ఆత్మైక్యం పొందగలరేమో కాని, ఏ కొద్దిమందికో సాధ్యమయ్యే భక్తి జ్ఞాన యోగాలను మినహాయిస్తే, పురుషులకు మాత్రం మోక్షం పొందే దొక్కేదీ కనిపించదు. శ్రీకృష్ణుడైనా తన దారి తాను చూచుకున్నాడే కాని, తక్కిన మగ వాళ్ల సంగతి ఆలోచించలేదు. పోనీ – గీత చెప్పాడు కదా అంటే – సాక్షాత్తు అర్జునుడికే మోక్షం ఇవ్వలేక పోయిన గీత సామాన్య మానవుడికి ఏం ఉపయోగపడుతుంది?

* * *

నేను అద్వైతంలో పుట్టి పెరిగిన వాణ్ని. మా నాన్న ఒక గొప్ప వేదాంతి. మా గ్రామంలోనే జంగం కులానికి చెందిన శ్రీ జంగం వెంకన్నగారు ఆయనకు గురువు. వెంకన్న గారిని నేనెరగను. మా నాన్న మాత్రం గోదావరి తీరంలోని అనేక మంది ముముక్షువులకు అచల తత్వాన్ని ఉపదేశించి, చివరకు సమాధిలోకి పోయి, సహస్రార

ద్వారం గుండా శివసాయుజ్యం పొందాడు. ఈ విషయం నేను "అశోక వనిలో రాముడు" కావ్యం పీఠికలో వివరంగా చెప్పి ఉన్నాను.

మా నాన్నలోని క్రమశిక్షణ, నిష్ఠా గరిష్ఠత, సుగుణ సంపద ఏదీ అబ్బలేదు నాకు. వేదాంతం కొంత అబ్బింది. అది యౌగిక శక్తిని వికసింపజేయడానికి బదులు, నాలో కవితను రేకెత్తించింది. తాత్త్విక కవితను కాదు. ప్రణయ కవితను!

నా చిన్నప్పుడు నేను వ్రాసినదంతా ప్రణయ కవితే. అయితే ప్రణయం ఎవరి పట్ల? ప్రియురాలు ఎవరు? అద్వైతం నాకు ఉపయోగ పడిందక్కడే. అది నాకు వ్యంగ్య ద్వారమై నిల్చి, సృష్టిలోని అనేక అంతఃపురాలను తెరిచింది. అందాలను ఆవిష్కరించింది. దానితో ప్రకృతిలోని ప్రతి సౌందర్య లవమూ నాకు ప్రియురాలే అయి కూర్చుంది. అద్వైతం నన్ను పురుషుడి స్థానంలో నిలిపినందువల్ల, నాకు ప్రకృతి ప్రియురాలయింది. ఈ ప్రియురాలి ద్వారా నేను రసానుభూతిని పొంది, తదానంద పారవశ్యంలో మూల బ్రహ్మనే అవుతున్నాను కనుక, ఈ మార్గం నాకు రసాద్వైతమయింది.

బ్రహ్మచైతన్య స్పందనే విశ్వ కామన. అనంతత్వ మహాపారమ్యం నుంచి, అది తన ఏకత్వాన్ని భంగపరుచుకొంటూ, అనేకత్వంగా అభివ్యక్తమవుతుంది. అలా వ్యక్త మైన రెండు శక్తులు పరస్పరాకర్షణతో దగ్గరై, చుంబించుకొని, ఆత్మలు కలుపుకుంటే - వెన్నకు వేడి తగిలినట్లు - ఆనందంగా కరిగి, తిరిగి ఆ మూల చైతన్యంతో ఏకమై పోతాయి. ఒక వ్యక్తికి మరో వ్యక్తితో కలిగే ఆత్మైక్యమే రసం. అదే ఆనందం.

* * *

రసాద్వైతం అనేది నా సొంత ఆధ్యాత్మిక సిద్ధాంతానికి నేను పెట్టుకొన్న పేరు.

ఆధ్యాత్మిక సిద్ధాంతాలు అనేకం. జీవుడు దేవుణ్ని పొందడానికి ఆయా కాలా లలో, ఆయా దేశాలలో, ఆయా ఋషులూ, ప్రవక్తలూ ఎన్నెన్నో మార్గాలు సూచించారు. అందులో అద్వితీయమైనట్టిదిగా ఈనాటికీ సర్వ ప్రపంచం చేతా గుర్తించబడినట్టిది అద్వైతం. మనం వేదాంతం అనేది దీన్నే. వేద లతాంతాలైన ఉపనిషత్తుల మధువు ఇది. అందుకే దీనికి మధువిద్య అని కూడ పేరు. మధువు అంటే పరబ్రహ్మ.

అద్వైతం అంటే ఏమిటి? ఏమిటో అందరికీ తెలిసిందే. తత్త్వమసి అనేది దీనికి మూలసూత్రం. అది నీవు అయి ఉన్నావు. తత్ త్వం అసి. అది అంటే పరబ్రహ్మ. అహం బ్రహ్మాస్మి. నేను బ్రహ్మను అయి ఉన్నాను. అంటే – దేవుడికీ, జీవుడికీ భేదమే లేదు అన్నమాట.

దేవుడిలో జీవుడు లయమైపోవడం, అంటే పరమాత్మలో ఆత్మ లయమైపోవడమే మోక్షం. ఈ లయమైపోయే ప్రక్రియను చెప్పేదే అద్వైతం.

ఒకడు ఇంటి నుంచి బైలుదేరి, ఏమేమో కార్యక్రమాలు నిర్వహించుకొని, తిరిగి ఇంటికి చేరతాడు. ఇల్లే నిర్గుణ బ్రహ్మ. ఇంటి నుంచి బైలుదేరడం – అది సగుణం కావడం. అది సృష్టి. బైట కార్యక్రమాల నిర్వహణే జీవ ప్రకృతి. తిరిగి ఇల్లు చేరడం మోక్షం. అమలులో ఇదే అద్వైతం. ఇది జీవుని నిత్య వ్యాపారం. సిద్ధాంతాలూ, మతాలూ, కొట్లాటలూ అక్కరలేని నిత్యసత్య ప్రవర్తనం ఇది. ఇది సహజ చేతనావర్తం. ధర్మ చక్ర ప్రగతి.

ఈ అద్వైతం ఎలా సాధ్యం?

ఎవరెన్ని చెప్పినా – ఈ అద్వైతం ఒక్క రసం ద్వారానే సాధ్యమని నా సిద్ధాంతం. గుణశక్తీ, ఋణ శక్తీ కలిసినప్పుడే అది సంపూర్ణ శక్తి అవుతుంది. ప్రకృతిలోని స్త్రీ శక్తీ, పురుష శక్తీ కలిసినప్పుడే అది ప్రకృతికి మూలమైన భగవచ్ఛక్తి, అంటే పరబ్రహ్మ అవుతుంది. మరో విధంగా కాదు.

అయితే – కర్మ జ్ఞాన భక్తి యోగాల మాట ఏమిటి అంటే – ఆ యోగాలు పరమాత్మను దర్శించగలవే కాని, పొందలేవు. ఎవరో కొందరు మహాయోగులూ, పరమ భక్తులూ పొందగలిగారంటే – వారు తమ ప్రకృతినే వదల్చుకొని, స్త్రీ పురుష భావాతీతమైన నిర్గుణ స్థితిని అందుకున్నా రన్నమాట. అది ఎందరికి సాధ్యం? నా వంటి సామాన్యుడి మాట ఏమిటి?

* * *

నా సిద్ధాంతం – రసాద్వైతం – ఈ సమస్యను సుళువుగా పరిష్కరిస్తుంది. అది పురుషాత్మ కావచ్చు. స్త్రీ ఆత్మ కావచ్చు – జీవాత్మకు పరమాత్మతో సంలీనత కలిగిస్తుంది. ప్రేమించగల ప్రతి వ్యక్తికీ మోక్షమిస్తుంది.

ఆహారం, నిద్ర, మైథునం, భయం అనే ఈ నాలుగూ జీవికి నైజ గుణాలు. (ఈనాడు మానవుణ్ని పట్టి, అతడిచేత నానా దుష్కార్యాలూ చేయిస్తున్నది పట్టి భయమే అనుకోండి. దాని విషయం మరొకప్పుడు.) జీవి యొక్క ఈ నాలుగు ప్రవృత్తులకూ అతీతమైన మరొక ప్రవృత్తి మానవుడికి ఉంది. అది ప్రేమించడం, ఆర్థిక, రాజకీయ, సాంఘిక ప్రయోజనాలకూ, శారీరక వ్యామోహాలకూ అతీతమైన ఒక రకం ఆత్మాకర్షణే ప్రేమ. ఒక పురుషుడికీ, ఒక స్త్రీకీ నడుమ అవ్యాజంగా ఏర్పడ్డ అట్టి ప్రేమే ఆ ఇద్దరినీ కలిపి ఒక రసాత్మగా చేస్తుంది. అట్టి రసాత్మకే పరమాత్మ కాగల గుణం ఉంది.

అంటే ఏమిటి? ఈ చర్చ కంతకూ సారాంశం ఏమిటి? ఒక స్త్రీని పురుషుడో, పురుషుణ్ని స్త్రీయో అకారణంగా, అవ్యాజంగా, ఎందుకో తెలియకుండా, ఏ ప్రయోజనాన్నీ ఆశించకుండా గాఢంగా ప్రేమించి ఆత్మార్పణ చేసుకుంటే చాలు. అదే రసాద్వైతం. అవతలి వ్యక్తి ప్రేమతో ప్రసక్తి లేదు. ప్రేమించేది సెలయేరు. ప్రేమించబడేది మహానది. మహానది స్వీకరిస్తుందా లేదా అనే ప్రశ్నే లేదు. సెలయేరు వెళ్ళి మహానదిలో పడటమే ముఖ్యం. సాగర సంగమం దానంతట అదే జరిగిపోతుంది.

* * *

"నీవు ప్రేమించు. నీవు స్త్రీవైతే నీ ప్రియుణ్ని, పురుషుడివైతే నీ ప్రియురాల్ని ప్రేమించు. అవ్యాజంగా ప్రేమించు. ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రేమించు. ఎన్ని కష్టనష్టాలు కలిగినా, నీ ప్రేమను చలించనివ్వకు. ఆత్మార్పణ చేసుకో. దానివల్ల కలిగే ఆనందమే రసానందం. దాని ద్వారా నీకు కలిగేదే మోక్షం."

ఇదీ నేను రసాద్వైతం ద్వారా మానవ జీవికి ప్రస్ఫుటీకరిస్తున్న ఆనందమార్గం.

అట్టి ప్రేమ వివాహానికి దారితీయవచ్చు. లేక, వివాహమే అట్టి ప్రేమకు దోహదకారి కావచ్చు. సాంఘిక వైరస్యాలవల్ల భౌతికమైన ఏ సంబంధానికీ వీలు లేకపోవచ్చు. ఫర్వాలేదు. ఆత్మానుబంధం మాత్రం తెగిపోకూడదు. ప్రవాహం ఆగిపోకూడదు. వర్షాభావం వల్ల సెలయేరు తాత్కాలికంగా ఎండిపోవచ్చు. గతి మాత్రం మారగూడదు. ఏకాత్మకమైన ప్రేమే రసాత్మ. పరమాత్మతో దాని ఏకీకరణమే మోక్షం. దాన్ని సాధించే మార్గమే రసాద్వైతం.

* * *

ఈ రసాద్వైతం ఎంత సులభ సాధ్యమో, నేటి మానవుడి ఆత్మోద్ధరణకు అంత అవసరం అని కూడ నా ఉద్దేశం. ప్రేమ అనేది మానవుడికి ప్రత్యేకమైన ఒక సహజ ప్రవృత్తి. కేవలం ఆహారం, నిద్ర, సెక్సు, సంసారం – వీటితో తృప్తి పడదు మానవాత్మ. ఎవరినో ప్రేమించాలి, ప్రేమించబడాలి. ప్రేమించబడడం తన చేతులలో ఉన్న విషయం కాదు కనుక, తాను ప్రేమించడమైనా జరగాలి. అప్పుడు గాని జీవితం పూర్ణత్వం పొందదు. ప్రేమించడం అనే వాంఛ తీర్చుకోవడం కోసం స్త్రీత్వం కృష్ణుణ్నీ, పురుషత్వం రాధనూ ఆరాధించడం వల్ల ఏమైనా లాభం ఉంటుందా అంటే, ఏమీ ఉండదు. ఇక్కడ భాగ్యనగరం కొండల్లో పుట్టిన సెలయేరు ప్రక్కనున్న మూసీ నదిలో కలవగలదే కాని, ఎంత గాఢంగా వాంఛించినా, యమునా నదిని చేరజాలదు. ఇక్కడి నేటి చిరువాగు (జీవి) కొన్ని వేల మైళ్ళ దూరంలో మాత్రమే కాక – కొన్ని వేల సంవత్సరాల గతంలోని ఒక మహా నదిని (రాధనో, కృష్ణుణ్నో) కలవాలనుకోవడం వట్టి పిచ్చి.

రాధాకృష్ణుల ప్రేమ అతిలోక మధుర మైనట్టిదే. జీవబ్రహ్మైక్య సిద్ధ మైనట్టిదే. అయితే, అది రాధాకృష్ణులిద్దరికి మాత్రమే సంబంధించినట్టిది. దానిని ఆదర్శంగా తీసుకొని, స్త్రీ పురుషులు తమ జీవితాలలో తమ ప్రేమలను పండించుకోవాలి. పురుషుడు తన ప్రియురాలిలో, స్త్రీ తన ప్రియునిలో ప్రత్యక్షంగా, అపరోక్షంగా ఆత్మార్పణ చేసుకోవాలి. రాధా కృష్ణులు ఎప్పుడో పుట్టి, పెరిగి, మరణించిన వ్యక్తులు. కృష్ణ నిర్యాణం తర్వాత కృష్ణుడు లేడు. పరమాత్మ ఉన్నదంటే, అది ఇప్పుడు కృష్ణ రూపంలో లేదు. ఎదుట ఉన్న వెంకయ్య రూపంలో ఉంది. వెంకయ్యను ప్రేమించడమే తరణోపాయం. వెంకయ్యను వదలి, ఎప్పుడో తనువు చాలించిన కృష్ణుణ్ని ప్రేమించడం ఆత్మ వంచన.

మధుర భక్తి పేరిట జరుగుతున్న వంచనను, ఆత్మ వంచనను తొలగించి, మానవ ప్రేమను సరైన మార్గానికి మళ్లించడానికి ఈ రసాద్వైతం ఉపకరిస్తుందని నా భావం.

## రాభీల ఉదంతం

నేను వ్రాసే ప్రేమ గేయాలకు నేను పెట్టుకొన్న పేరు రాభీలు. రాభీ అంటే భీమన్న వ్రాసిన ప్రేమ గేయం అని అర్థం. రసాద్వైతం వలెనే, రాభీ కూడ నా గేయాల కోసం నేను సృష్టించుకొన్న కొత్త పదం.

ప్రకృతి రెండు ప్రధాన ప్రవృత్తులతో, గుణాలతో కూడినట్టిది. అందులో ఒకటి, స్త్రీ సహజమైన రామము. రెండోది పురుష సహజమైన భీమము. ఈ రెండు శక్తుల సంసార విన్యాసమే పూర్ణ ప్రకృతి. వాటి సంయోగ వియోగాలే సుఖదుఃఖాదులు. వాటి ఆత్మ సమైక్యమే రసాద్వైతం. రామత్వ భీమత్వ సహధార్మిక మైనదే ప్రకృతి కనుక, ప్రకృతిని పూర్ణంగా అనుభవించేవే ఈ గేయాలు కనుక, ఈ గేయాలకు రాభీలు అని పేరు పెట్టాను.

ఈ రాభీలకు ఆలంబనం ప్రేయసీ ప్రియులు.

"ప్రతి పురుషుడు బ్రహ్మయె, ప్రతి
సతియు సరస్వతియె.........."

అని చాల సంవత్సరాల క్రితమే నేను దీపసభ కావ్యంలో వ్రాశాను. ఈ రాభీల లోని గేయాలు కొన్ని స్త్రీ పరంగాను, కొన్ని పురుష పరంగాను ఉన్నై. రచనా సౌలభ్యం కోసం, ప్రేయసీ ప్రియుల సంకేతం కోసం రూఢి అయిన కొన్ని ప్రబంధ నామాలను వాడక తప్పలేదు. సరస్వతి - బ్రహ్మ, హైమవతి - శివుడు, లక్ష్మి - విష్ణువు, రాధ - కృష్ణుడు, వైశాఖి - వసంతుడు, రమ - రాజేశ్వరుడు, ప్రభ - ప్రభాకరుడు, రత్న - రత్నాకరుడు, కళ - కళాధరుడు, జ్యోతి - జ్యోతిర్మయుడు వంటి జంటల ప్రస్తావన వాచ్యంగానో, వ్యంగ్యంగానో ఇందులో వస్తుంది. ఈ జంటలు కేవలం ప్రేయసీ ప్రియులకు, ఈ రాభీల లోని నాయికా నాయకులకు సంకేతాలు మాత్రమే. ఈ గేయ గాయనీ గాయకులంతా, ఈ కావ్య పాఠకీ పాఠకులంతా కూడ నాయికా నాయకులే.

ప్రేమించి, అది వికసించి, అది స్వచ్ఛమైన ప్రేమేననీ, వట్టి వ్యామోహం కాదనీ స్థిరపడిన తర్వాత - అట్టి ప్రేమించిన వ్యక్తి ఆడుది అయితే ప్రకృతికీ, మగవాడైతే పురుషుడికీ సమరూపులవుతారు. అప్పుడు ఆమె ఎన్ని రూపాలైతే అతడు అన్ని అనుకూల రూపాలతోను, అతడు ఎన్ని అవతారాలు తాల్చితే ఆమె అన్ని అనురూప ఆకారాలతోను పొంది రసమయులవుతారు. అందుకే అతడు బ్రహ్మ అయితే ఆమె సరస్వతి. ఆమె రాధ అయితే అతడు కృష్ణుడు. అలా.

రమ అనే పదం ఇందులో ఎక్కువగా కనిపిస్తుంది. కారణం అది కుండలినీ శక్తికి పర్యాయపదం కావడమే. "రోహిణీ రాజ్యదా రేవా రమా రాజీవలోచనా" అంటూ కుండలినిని అగ్ని బీజాక్షరాదిని జేసి, ప్రాణభూతానికే ఆదిశక్తిని జేసి ఆరాధించారు ఋషులు. శివ సరస్వతీ తత్వం, రమా రాజేశ్వర తత్వం ఈవిధంగా ప్రాణాధార భూత మైనట్టివి.

* * *

ఆలోచించే వారికి ఆలోచనామృతాన్ని అందివ్వడం కోసమే నేనిదంతా చెపుతు న్నాను. కేవలం రసాస్వాదనను మాత్రమే కోరే రసాద్వైతులకు ఇదంతా ఏమీ అక్కర లేదు. అట్టివారే ఈ రాభీలకు నాయికా నాయకులు. ఒక మీన, ఒక హనుమంతు ప్రేమించు కొని ఆత్మార్పణం చేసికొంటే – ఏ రాధాకృష్ణుల మధ్యవర్తిత్వమూ అక్కరలేకుండానే – వారు భౌతికమ్మైన సంబంధం ఉన్నా, లేకపోయినా, ఆత్మికంగా రసానుభూతిని పొంది పరమాత్మలో లయం కాగలరు. ప్రేమకూ, శరీర వాంఛకూ తేడా తెలియక, ప్రేమ పేరుతో పూర్వం జరిగిన – ఇప్పుడు జరుగుతున్న అనేక కష్ట నష్టాలకు, జీవిత వైఫల్యాలకు, ఈర్ష్యలకు, హింసలకు, దుఃఖాలకు ఈ నా రసాద్వైత సిద్ధాంతమే పరిష్కార మార్గం. సుఖంగా జీవించి, ఆనందంగా కరిగిపోవడానికి పరమ ద్వారం.

అందుకు తగిన ఆత్మీయమ్మైన ప్రేమ ఎలా ఏర్పడుతుందీ అంటే – దాని కోసం ఎవరూ ప్రయత్నించ నక్కరలేదు. ప్రతి వ్యక్తికి అట్టి ప్రేమ దానంతట అదే కలుగుతుంది. అది నిరంతరంగా ఆ వ్యక్తిని ఆకర్షించి ఉంటుంది. దేశ కాల పాత్రానుబద్ధమ్మైన అవరోధాల కారణంగా అట్టి ప్రేమ సూత్రాన్ని త్రెంచి వేసుకోకుండా ఉంటే చాలు. ఒక స్థితి దాటిన తర్వాత త్రెంచివేసుకోవాలనుకున్నా అది తెగిపోదు. తెగిపోయినట్టు కన్పించినా అది సరస్వతి వలె అంతర్వాహినిగా నిలిచే ఉంటుంది. స్వచ్ఛమ్మైన ప్రేమ సాంఘిక, సాంసారిక ధర్మాల నిర్వహణకు ఏ మాత్రమూ అడ్డు రాదని గుర్తుంచుకోవాలి.

* * *

కాగా–

ఈ రాభీలకు వీటిని స్పృశించినవారందరూ నాయికా నాయకులే. ఆత్మ పర మాత్మలే.

రాభీ అంటే భీమన్న వ్రాసిన ఒక ప్రేమ గేయం. ఈ సంపుటిలో ఇవి 310 ఉన్నాయి. రాగోదయం అనే పేరుతో చాల ఏండ్ల క్రితం నేను ప్రకటించిన ఒక 42 గేయాలు కూడ దీనికి అనుబంధమై ఉన్నాయి. ఇవి మొత్తం 352 ఇప్పటికి.

ఔత్సుక్యంతో ఆంతర్యం చూడగలిగిన వారికి ఈ రాభీలలో అంతర్వాహినిగా ఒక క్రమం, ఒక కథ కనిపించవచ్చు. ప్రేమ, దాని దాగుడు మూతలు, దాని స్థిరత్వం, సాఫల్యం, అసూయాదుల విజృంభణ, కర్తవ్యగతమైన వియోగం, సాంఘిక నిర్బంధాల పీడ, స్థిత ప్రజ్ఞత యొక్క ప్రాభవం, భౌతికావరోధాల పరాజయం, ఆత్మ పొందిన విజయం – ఈ క్రమం ఇందులో కనిపిస్తుంది. ప్రాణప్రదంగా ప్రేమించి ఆత్మార్పణ చేసుకొన్న సామాన్య స్త్రీ పురుషుల జీవిత గాథ సుమారుగా ఇదే కదా?

ప్రేమించి పెళ్ళి చేసుకోవడం, పెళ్ళి చేసుకొని ప్రేమించడం – అదొక తీరు. ప్రేమించి పెళ్ళి చేసుకోలేక పోవడం, పెళ్ళి చేసుకొని ప్రేమించలేకపోవడం – అదొక తీరు. ఏ తీరు అయినా ఒకటే – ప్రాపంచికమైన సుఖ దుఃఖాలలో కొద్దిపాటి తేడాతో. సంయోగంలో కంటే వియోగంలోనే ఆత్మైక్యం గాఢతర మవుతుందనేది లోకానుభవం. సుఖ దుఃఖాలు రెండూ ఆనంద స్థాయి నందుకోవడమే రసమయత. అప్పుడే రసా ద్వైత సిద్ధి.

ప్రేయసి ప్రియుణ్నో, ప్రియుడు ప్రేయసినో ఉద్దేశించి పలికేవే ఈ గేయాలన్నీ – అది ప్రేమ కానీ, అసూయ కానీ, భక్తి కానీ, దేశ భక్తి కానీ. రాభీలు మూడవ భాగంలో నాయకుడు దేశ మాత పిలుపు నాకర్షించి రణరంగానికి పోవడం కనిపిస్తుంది. ఆ సందర్భంలోని గేయాలు రకరకాలుగా ఉన్నై. భక్తిగేయాలూ ఉన్నై. ఒక్కొక్క క్షేత్రానికి ఒక్కొక్క ప్రత్యేకత ఉంటుంది. (దీని విషయమైన చర్చ నా రాగవైశాఖి కావ్యం 111వ అధ్యాయంలో చూడవచ్చు.)

* * *

కర్ణాటక సంగీతాన్ని సర్వజనీకరించి ఈ రాభీలకు ప్రత్యేకంగా ఒక రాభీ సంగీత బాణీని కల్పించాలన్న కోరిక ఉంది నాకు. స్వర కల్పనతో జోడించి ఈ రాభీలను ప్రక టించాలని కూడా అనుకొన్నాను. కొన్ని కారణాల వల్ల అది సాధ్యపడలేదు.

'అకాండతాండవం', 'బొమ్మ' కావ్యాలలో మాత్రా ఛందస్సులో ఒకే రకమైన వృత్తాలు వాడాను. ''మానవుని మరొక మజిలీ'' ''పైరు పాట'' కావ్యాలలో మాత్రల లోనే వివిధ ఛందస్సులను వాడాను. ఈ రాభీలలో కూడ వీలైనన్ని గతులు వాడాను. భావానుగుణమైన రాగానికి మేళవించుకొని చక్కగా పాడుకోవచ్చు వీటిని.

అందుకే పేజీ కొక పాటగా ప్రకటిస్తున్నాను వీటిని. రాగోదయం గేయాలు కొన్ని మరీ దీర్ఘంగా ఉండి, ఒకొక పేజీలో ఇమడనందువల్ల వాటిని రెండేసి పంక్తులు ఒకొక పంక్తిగా సర్దడమో, చివరి భాగాలు కుదించడమో, తొలగించడమో చెయ్యవలసి వచ్చింది. ఈ గేయాలు ఇప్పటికే చాల ప్రచారంలో ఉన్నందువల్ల దిద్దుబాట్లు మాత్రం ఎక్కువగా చెయ్యలేదు.

## రామచంద్ర ప్రత్యూషం

ఈ రాభీలకు 5వ భాగంలో అనుబంధంగా రాగోదయం గేయాలు ఇస్తున్నాను. ప్రభకు ప్రేమోపాయనంగా మద్రాసులో వ్రాసిన గేయాలవి. ఆనాడు మిత్రులు శ్రీ తిరుమల రామచంద్రగారు ప్రత్యూషమనే పేరుతో వ్రాసిన మాటలు (ఉదాహరణలు తీసివేసి) క్రింద ఇస్తున్నాను.

''ప్రజలు నా పద్యాలు మరచినా పాటలు మాత్రం పాడుకుంటూనే ఉంటారు'' అని రవీంద్ర కవీంద్రు డన్నాడు.

గేయాలలోని గారడీ అలాంటిది. గేయాలు జనం మనసుపై మచ్చు చల్లి, నాలుకపై నెలవు చేసుకుంటాయి. దీనికి కారణం జీవి మానవుడుగా మోసులెత్తడంతో పాటే గానం కూడ తానాలు సాగడమే. గానం, గేయం మానవ జాతి ప్రాదుర్భావంతో పెనవేసుకున్నవి కనుకనే ప్రాగైతిహాసిక దశా పరిజ్ఞానానికి పరమ ప్రమాణమన్నారు చరిత్ర కారులు. జాతి జీవం, జవం, మతం కన్నా, జానపద గేయాల నుంచే మేలుగా తెలుసుకోవచ్చునన్నాడు గోర్కీ.

గాథాసప్తశతి గ్రథితమైన తెలుగు నాట జానపద గేయాలకు, పదాలకు జాతకం కట్టడం సాహసమే. మన గేయ వాఙ్మయపు మల్లె తీగ పలుతీరుల పాంపిరి వోయింది.

స్త్రీని వలపుల అచ్చులో పోసిన కులుకుమిటారి బొమ్మగా కాక ఉదాత్తంగాను, శృంగారాన్ని కేవలం కామక్రీడగా కాక ఉన్నత ప్రేమగాను అందించే సాహిత్య శాఖ ఈ మల్లెతీవ వేసిన కొత్త కొమ్మ. వస్తు ప్రధానమైన కవితలో కవితా రామణీయక స్ఫోరకాలైన ప్రత్యేక పదాలు చెదరుగా మాత్రమే కనిపించేవి. పూర్తిగా కుదించిన ఒక్కొక్క అతిమాత్ర భావనకు కవితా రూపాన్ని కల్పించే లిరికిజం ఈ కొత్త కొమ్మ తొడిగిన కెంజిగురు. కవి ఎక్కడో దాగివుండి ఏ నాయికా నాయకులతోనో మాట్లాడించడం కాక, స్వయంగా తన హృదయాన్ని విప్పి చూపడం – ఆత్మాశ్రయత – ఈ కొత్త కొమ్మ ఇంపు సొంపులు. కల్లకపట మెరుగని జనపద హృదయం వెలువరించే రసధుని వెల్లువలై పారిన ప్రాకృత గాథలను పూర్తిగా మరచిన మన వారికి కనువిప్పార జేసే "యెంకి పాటలు" వంటివి ఈ కొత్త కొమ్మ పూచిన తొలి పసిడి పూలు.

జనపద సాహిత్యం తర్వాత, ఆ పద్ధతిలో, యెంకి పాటల కాలం నుంచి గేయ కవిత్వం ప్రచురమైందనవచ్చు. అందులోను ఆత్మాశ్రయత ప్రధాన లక్షణంగా గల భావ కవిత్వ యుగం గేయమయమే. ప్రేయసిని గురించి మరీ మిక్కుటం. ఈ యుగంలోని ప్రేమ కేవలం ఒక్కరిది. ఏక మాత్రనిష్ఠమైన ప్రేమను వర్ణించడం. ప్రాచీనాలంకారికు లైతే, రసాభాస భేదమని తోసివేస్తారు. కాని ఈ భావ కవితలో కానవచ్చే ప్రేమ అలాంటిది కాదు. దీనికీ, మధుర భక్తికీ అతి సన్నిహితత్వం ఉందన్న వాదం సత్యదూరం కాదేమో!

మనసులో పొంగిన ఆవేశమో, ఆవేదనో ఆలంబనంగా అవతరించిన కవిత ప్రతి భాషలోనూ హెచ్చే. ఇది వైయక్తిక భావోల్బణంగా మాత్రమే పొడగట్టినా, ఏదో ప్రేమ కోసం, పరిపూర్ణత కోసం ఆరాటపడే మానసిక స్థితికి రూపకల్పన అనుకోవచ్చు.

ఈ రూపకల్పన పడమటి సీమలకు కొత్త కావచ్చునేమో కాని, తూర్పు దేశా లకు కొత్తది కాదు. అది మానవ జాతి భావుకతా భండారాన్ని వేదంగా వింగడించుకున్న భారత వర్షానికి, గాథలు వీధి పాటలుగా వెలసిన తెలుగువారికి ఇవేమీ కొత్త కాదు. "గూటిలో చిలకేదిరా? ఈ గూడు చిన్నబోయెరా!" "ఆరు రేకుల పువ్వు తుమ్మెదా! అది, మీరిన వాసననే తుమ్మెదా!" అనే జానపద తత్త్వాలలో ఉన్నది రూపకల్పనే. వాచ్యం

కన్న వ్యంజనకు గల విలువను గుర్తించిన కవి తను చెప్పదలచింది వ్యంజితం చేసి శాశ్వ తత్వం సంతరించుకుంటాడు.

భావుక సహజమైన ఈ రూపకల్పన వేదోపనిషత్తులను తొంగిచూచి, వైష్ణవ మధుర భక్తితో మిళితమై, సూఫీమతం సొబగులు దిద్దుకొని, పడమటి పాలాలలో అలి గొరీ, సింబాలిజం అన్న మారుపేరులతో మన దేశానికి మరలివచ్చి, ఆధునిక హిందీ, బాంగ్లా సాహిత్యాలలో ఛాయావాద రహస్యవాదాలనే నినాదం పొంది, తిరిగి మన సాహిత్యపు టంచులు తాకింది. కనుకనే దీనిలో మానవ సహజమైన భావ శబలత భాసిస్తుంది, ఎవరు చదివినా రసం వ్యంజితమై రస్యమాన మౌతుంది.

దేశంలో ఉన్న ఆశలను, ఆవేదనలను ప్రతిబింబించడమే ప్రధాన లక్షణంగా కానవచ్చే ఈనాటి కవితలో శృంగార రస వర్ణన కొంత విడ్డూరమనిపించవచ్చు. కాని, ఏ కవినీ ఎవరూ నిర్బంధించలేరు. ఏ యుగంలో నైనా ప్రతిదీ మూసలో పోసినట్టు ఒకే ప్రతిమ కానక్కరలేదు. అంతేకాక ఒక్కొక్క కవి ఒక్కొక్క వస్తువునే గానం చేయడం కూడా సహజం కాదు. ఏ కవైనా జీవి సహజమైన శృంగార రస రాజ్యాన్ని ఆరాధించడం అసహజమెలా అవుతుంది?

మా భీమన్నగారి "రాగోదయం" ఛాయావాద రహస్య వాదాల సువాసనలు గుబాళించే కావ్యఖండికల కదంబం. మా భీమన్న గారు బాధామయ జగత్తులోని వేద నకు, ఆవేదనకు పరితపించి, పరిదేవన చేసినవారే. కరుణ కావ్యాలు, శోకగీతాలు ఆల పించిన వారే. కాని, ఈ 'రాగోదయం'లో రాగానికి మాత్రమే రంగులు దిద్దారు – అందు లోను విప్రలంభ శృంగారాన్ని ప్రధానంగా వెల్లివిరియ జేశారు.

చిన్ని చిన్ని మల్లె మొగ్గల లాంటి మాటలు గుస్తరించి వెఱ్ఱులెత్తించే ఈ పంక్తులు చాతురికే కాంతులు–

'నీ తొలకరి మెరుపుల ప్రాయం
నా తృష్ణకు తోడిన తోయం'

..............................

* * *

రామచంద్రగారి ఈ మాటలు ఇక్కడ ఎందుకు ఉదాహరించానంటే – అవి సార్వకాలికమైనవి కాబట్టి, అవి మొత్తం ఈ రాభీలన్నిటికీ కూడ వర్తిస్తాయి కాబట్టి. రాగోదయం గేయాలు 42 కూడ ఈ రాభీలతో కలిపి వేయవలసి ఉంది. ఇక ముందు వ్రాయగల గేయాలను కూడ చేర్చి రాభీల ద్వితీయ ముద్రణను వెలువరించేటప్పుడు ఆ పని చేస్తాను. ప్రస్తుతానికవి అనుబంధం గానే ఉంటాయి.

## కళాప్రపూర్ణత

కళాప్రపూర్ణుడు ఒక్క శివుడే. అతడి కళే సరస్వతి. ఈ సమస్త చరాచర ప్రకృతీ ఆమే. అతడు పరమాత్మ. వెలుగు చీకటి నుంచి పుట్టి చీకటిలో లయమైపోయేటట్టే, ఆమె పరమాత్మలో పుట్టి, పరమాత్మలోనే లయమైపోతుంది. కళా ప్రపూర్ణత అతడిది. ప్రకృతిలో భాగమైన ఏ వస్తువుకూ, ఏ జీవికీ, ఏ వ్యక్తికీ కళాప్రపూర్ణత లేదు. సకల కళా సంపూర్ణ ప్రకృతే సరస్వతి కనుక, ఆమె కూడ కళాప్రపూర్ణే అనవచ్చు.

ఈ రాభీల అచ్చు పూర్తవుతున్న సమయంలో – ఆంధ్ర యూనివర్సిటీ వారు నాకు "కళాప్రపూర్ణ" అనే గౌరవ డాక్టరేటును ఇస్తున్నట్టు తెలిసింది. నేను చాల ఆశ్చర్య పడ్డాను.

అప్పుడే నేను "కళా ప్రపూర్ణుడవు నీవె కదరా!" అనే గేయాన్నీ (306), "శారదా! సకల కళా విశారదా!" అన్న గేయాన్నీ (307) వ్రాశాను. "ఎందు కమ్మ నా కింతటి ఎత్తైన పీఠం?" అంటూ శిరస్సు వంచాను. సముద్రానికి ప్రపూర్ణత్వం ఉన్నప్పుడు, అందులోని ప్రతి అలకూ దాని గుణం ఉంటుందిలే అని తృప్తి పడ్డాను. అయినా నాకు వచ్చే బిరుదులు, గౌరవాలు, సన్మానాలు – అన్నీ ఆ శివ సరస్వతీ రసాద్వైత పరమాత్మకే అర్పించేస్తూ ఉంటాను కనక, దీనిని కూడ అలానే చేసి అంజలి ఘటించాను.

* * *

రసాద్వైతాన్ని శృంగారాద్వైతం అనవచ్చునా అంటే – సమస్త రసాలూ శృంగారంలోని వివిధ అవస్థలే అన్న సత్యాన్ని గుర్తిస్తే – అనవచ్చు. నానా రుచులూ భోజనంలోని అంతర్భాగాలే. అయితే, నానాత్వం ఏక భావమై, రస్యమాన మైనప్పుడే అది ఆనంద వర్ధనుడి ఆత్మగాను, శ్రుతి కారుడి పరమాత్మగాను భాసిస్తుంది.

నీరు ఎప్పుడైనా, ఎక్కడైనా, పల్లానికే ప్రవహిస్తుంది. పల్లం సముద్రం కేసే పయనిస్తుంది. ఆత్మ కూడ అంతే. అది రసానుభూతిని కోరుతుంది. అట్టి అనుభూతిని పరిపూర్తి చేసుకొని, శాశ్వతీకరించుకోవడమే రసమయుడైన పరమాత్మతో సమైక్యం కావడం.

''ఆత్మ ఆత్మతో కలిసి రసమై, రసం రసంతో కలిసి ఆనందమై మోక్షం అవుతుంది కదా! అహం బ్రహ్మాస్మి అంటున్న నీవు, రసానందం ద్వారా పరబ్రహ్మవే అవుతున్న నీవు - మరి, అంజలి ఎవరికి ఘటించావు?'' అని ఎవరైనా అడిగితే - వారికి నా సమాధానం, ''నాకు నేనే'' అని!

## కృతజ్ఞతలు

ఈ రాభీలలో అనేక గేయాలు ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయి. ఎంతోమంది సంగీత విశారదులు, శారదలు వీటిలో ఎన్నో గేయాలకు స్వరకల్పన చేసి ఉన్నారు. ఆకాశవాణి లోను, సంగీత కచేరీల లోను పాడుతున్నారు. వారిలో నేను విన్నంత వరకు శ్రీయుతులు ఎస్. రాజేశ్వరరావు, మల్లిక్, మంచాల జగన్నాథ రావు, పాలగుమ్మి విశ్వనాథం, షేక్ మహబూబ్, చిత్తరంజన్, మోదుకూరి జాన్సను, మోహనరాజు, ఎమ్. వెంకట గోపాలం, గోపాలకృష్ణమూర్తి, శ్రీమతులు రామలక్ష్మి, వింజమూరి లక్ష్మి, బాలసరస్వతి, సుబ్బలక్ష్మి, వై. శారద, ఏ. వి. సావిత్రి, పుష్పలతా సామ్యూల్, కె. శాంత, ఎమ్. శాంత, లలిత, వీరమణి, డాక్టర్ కనకవల్లి మున్నగువారు. ఈ అందరికీ నా కైమోడ్పులు.

నాకు షష్టిపూర్తి కానుకగా ఈ గ్రంథాన్ని ముద్రించి ఇస్తున్న ''భీమన్న సన్మాన సంఘం'' వారికి, ముఖ్యంగా సంఘం కార్యదర్శి ప్రగతి కవిభాస్కర శ్రీ జె. బాపురెడ్డి గారికి నమోవాకా లర్పిస్తున్నాను. ఈ గ్రంథ ముద్రణకు చాలా ఖర్చయింది. శ్రీ బాపురెడ్డి గారు పూనుకోకపోతే, ఈ పని జరిగుండేది కాదు. ఈ ఖర్చులో కొంత భాగాన్ని తమ భూరి విరాళం ద్వారా భరించిన ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ వారికి, ముఖ్యంగా దాని అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి గారికి, కార్యదర్శి శ్రీ దేవులపల్లి రామానుజరావు గారికి నేను ఎంతో కృతజ్ఞుణ్ని.

మధుర హృదయులు, మానవతా రాజయోగులు, సౌమ్యమూర్తులు, సాహితీ వేత్తలు, నవకవితా స్రష్టలు, నా పట్ల అత్యంతమైన సహానుభూతి కలవారు అయిన శ్రీ ఎమ్.ఆర్. అప్పారావు గారికి ఈ గ్రంథాన్ని అంకితమిస్తున్నాను.

లలితా ప్రెస్ వర్కర్లకు, ముఖ్యంగా శ్రీయుతులు డి. రాజారెడ్డి, పి. నారాయణ, పి. నరసింహులు, పినపాటి జేసుదాస్ మున్నగువారికీ, ప్రెస్ యజమాని శ్రీ గణపతి శాస్త్రి గారికీ నా హృదయ పూర్వక నమస్సులు. ముఖపత్రం వ్రాసిపెట్టిన మా అబ్బాయి శ్రీ బోయి దత్తాత్రేయ శర్మకు శుభాకాంక్షలు. ఈ గేయాలను ఇప్పుడు పాడుతున్నవారికీ, ముందు పాడుకొనే వారికీ, చదివి ఆనందించే వారికీ అందరికీ నా అభినతులు.

– బోయి భీమన్న

17–01–71

## అంకితము

# శ్రీ ఎమ్.ఆర్. అప్పారావు గారికీ

శ్రీ మేకా రంగయ్యప్పారావు !
మానవతా రాజయోగి ఉద్రూవు !

ఆంధ్ర నాటక కళా పరిష న్నటికి
అధినాధుడు సూత్రధారి ఎవరు ?
భరతకళా పునరుజ్జీవన కములకు
ప్రభాతమును తెచ్చిన రవి ఎవరు ? ॥శ్రీ॥

నవాంధ్రమును ఇంద్ర సభగ తీర్చి
నాట్యకళను పోషించిన ఇంద్రుడెవరు ?
నటరాజుల, నటరాణుల సౌందర్యం
నరులకు మళ్లీ చూపిన ఋషి యెవరు ? ॥శ్రీ॥

సమగ్ర ఆంధ్రప్రదేశ్ రాజ్యములో
సంస్కృతికి అమాత్యుడైన కాలములో
నాట్యానికి, సంగీతానికి తోడు
నవ కవితను పోషించిన ప్రభు వెవరు ? ॥శ్రీ॥

సౌహార్దం, సంస్కారం మూర్తి గొన్న
సౌమ్యమూర్తి అమృత హృదయు డెవరు ?
కవియై, కవితా హృదయం చూరగొన్న
కల్యాణ గుణాలంకృతు డెవరు ? ॥శ్రీ॥

ఎల్ల దేశముల, భాషల సాహితిని
దనలోన ఇముడ్చుకొన్న గుణి ఎవరు ?
తల్లి భాష కెల్ల భాషలును చెలులై
మల్లెలు గుచ్చా లన్న మణి ఎవరు ? ॥శ్రీ॥

సిరి సంపద లందు పుట్టి పెరిగి,
నిరుపేదలె తనవా రను ధని ఎవరు ?
నా కావ్యకుమారి కంకితము తానై
నను మాన్యుని చేసిన రసధుని ఎవరు ? ॥శ్రీ॥

మిత భాషణు, డనవరత
స్మిత భూషణు డెవరు ?
విద్యా వికసన దీక్షా
విశ్వాత్ముకు డెవరు ? ॥శ్రీ॥

– భీమన్న

❋ ❋ ❋

భీమన్న

# రాభీలు

## నమస్తే

నమస్తే శరత్పూర్ణ చంద్రద్యుతీ !
నమస్తే ! నమస్తే ! సరస్వతీ !
అమృత స్వరూపిణీ ! ఆనంద మోహినీ !
అభి కళా రస వాహినీ !

యశస్తే జగద్విజయ సంకేతనీ !
యశస్తే ! యశస్తే ! శివానీ!
సూర్యేందు లోచనా ! సౌందర్య దర్శనా !
శుభ శోభనా జీవనా !

శ్రియస్తే అదృష్ట ప్రదీపాలయా !
శ్రియస్తే ! శ్రియస్తే ! హరిప్రియా !
విజ్ఞాన శారదా ! ప్రజ్ఞాన సౌఖ్యదా !
సుజ్ఞాన లక్ష్మీ ప్రదా !

# ఎంత అందమైనది

ఎంత అందమైనది
ఈ విశ్వ సరస్వతి !

ఏదో వసంత మొకటేనా ?
ఎల్ల ఋతువులును తానై
నా ఆరామము నిండా
నవ రుచులతో వికసించుచు ॥ ఎంత ॥

ఆకలి కొక దాని కేన ?
అభిలాషల కన్నిటి కిని
ఫల పుష్ప కలశములతో
పరమ మధువులను పంచుచు ॥ ఎంత ॥

ఒక భౌతిక జగతి నేన ?
సకల దివ్య లోకాలను
ఆత్మాలయ మంటపమున
అలరు దండలుగ అల్లుచు ॥ ఎంత ॥

# మనసు లోని

మనసు లోని కోరికలకు
మచ్చుతునక లీ మల్లెలు,
రోజు కెన్ని విరిసెనో !
మోజు లెన్ని తీరెనో !

బ్రతుకు లోని వేదనలకు
ప్రతి రవాలు పిక రవాలు,
రాగ మెంత రగిలేనో !
మూగవోయి ముగిసేనో !

ఆత్మ లోని అందాలకు
ఆదర్శము లీ అళులు,
ఎంత మధువు గ్రోలేనో !
ఎంత జగతి కొసగేనో !

# నా కోసం

నా కోసం
ఈ జగమే నా కోసం !

ఈ విరిసే విరు లన్నీ
ఆ మెరిసే ఝురు లన్నీ
ఈ తోటలు, ఈ పాటలు
ఆ కోనలు, ఈ తేనెలు !

ఆ నగుమోములు అన్నీ
ఈ ఎల వలపులు అన్నీ
ఆ ప్రేమలు, ఈ కోర్కెలు
ఈ సంయోగ సుఖాలు !

ఆ ఈ కళలూ, కవితలు
ఈ సకలం నా కోసం !
ఈ సంపద లన్నిటి తో
నేను నేను నీ కోసం !

# గుండె నెవరో

గుండె నెవరో ఉండి ఉండీ
పండు వెన్నెల కాతురు !
          పండు వెన్నెల పరువు మీద
          పారిజాతము లుంతురు !

పారిజాత పరీమళములకు
ప్రణయ తంత్రులు కూర్తురు !
          ప్రణయ తంత్రుల నాద లయలకు
          పాటలను రచియింతురు !

పాట కొక రాగమును మార్చి
పాడు మని వేధింతురు !
          పాడి పాడి పాటనగు నను
          పాడుకొనుచెటొ పోదురు !

# ఎవరదీ ?

ఎవ రదీ ? ఎవ రదీ ?
ఇంతగ నను వెంటాడే దెవ రదీ ?

ఎలమావుల కొమ్మలలో
వలపు చిలికి పిలిచేదీ,
కారు మొయిలు నడుమ కూడ
కన్ను కొట్టి నిలిపేదీ ॥ ఎ ॥

వైశాఖపు టెండలలో
పైరుగాలి విసిరేదీ,
శీతు నరక యాతనలో
చేదోడై నిలిచేదీ ॥ ఎ ॥

దిక్కు, లేని పేద యింట
దీపము వెలిగించేదీ,
మ్రోడుకు గిలిగింత పెట్టి
మొగ్గలు తొడిగించేదీ ॥ ఎ ॥

# నీ వా ?

నీవా ?
నా ఎదలో దాగున్నది – నీవా ?

పుట్టుక నుంచే నాతో
పుట్టి పెరుగు తున్నదీ,
పెరిగిన కొలదీ నాలో
విరబూరు తున్నదీ ॥ నీ ॥

అందాలను కనినప్పుడు
అలలు వేయు చున్నదీ,
అలల పాట వినినప్పుడు
ఆత్మ కలచుచున్నదీ ॥ నీ ॥

ఏ పేరున పిలిచినా
ఇదిగో అంటున్నదీ,
ఏ రూపున తలచినా
ఎదుటకు వస్తున్నదీ ॥ నీ ॥

# వసంత మొకటే

వసంత మొకటే ఇలలో
రసమయ మనుకొంటి
మయూరములు నర్తించక
మబ్బు కోస మున్టి

వాన కాల మొకటే జీ
వన ఘన మనుకొంటి
అమృత మొసగు వెన్నెలకై
ఆకలి గొని యుంటి

శారద సౌందర్యానికి
నీరాజన మిడితి
మంచు కురిసి, మధువు లేక
మతి చెడి కూర్చుంటి

విరులో, ఎండలో, వానలో
వెన్నెలో, పగలో, రేయో
నిర్లోపము కాదేదీ !
నీవు లేక లే దేదీ !

# ఎచటిదో వెలుగు

ఎచటిదో వెలుగు నా
యెల ప్రాయమును సోకె,
ఎవరిదో నీడ నా
ఎద మీద ప్రాకె !

పాట యేదో బ్రతుకు
వాకిటిలో విన నాయె,
గుమ్మాన పసుపు కుం
కుమలు కన నాయె !

క్రొన్ననలు నిప్పులై -
వెన్నెలలు మంటలై -
ఆరామ రామ యే
ఆరాట పరిచె !

మనసేదొ నా పైకి
మలయానిలము విసిరె,
ఎవరిదో కరుణ నా
ఎద నిండ కురిసె !

# గాలి వీచె

గాలి వీచె, ధూళి రేగె,
నీలి మబ్బు తోచె !
చినుకు రాలె, చెలక నానె,
చిత్తము లలరె !

ధూళితో మధూళి కణము
ద్వ్యే మండల మంటె !
చినుకు తోడ జీవ లవము
క్షేత్ర మెల్ల విరిసె !

మబ్బు లోని మహిమ యేదొ
మనసు లోకి దూకె !
చినుకు లోని చిన్నె యేదొ
చిరునవ్వులు నవ్వుకొనె !

# ఆ పోయే దెవరే

ఆ పోయే దెవరే, తిమిరం ?
ఈ వచ్చే దెవరు, ప్రభాతం ?
ఈ పోకడ రాకడ నడుమ
ఈ బ్రతుకొక ఆరని కాష్ఠం !

ఆ ఏడ్చే దెవరె, చకోరం ?
ఈ నవ్వే దెవరు, సరోజం ?
ఈ ఏడ్పుల నవ్వుల తోడ
ఈ బ్రతుకొక కోరని తీరం !

ఆ పాడే దెవరే, పికం ?
ఆ ఆడే దెవరు, మయూరం ?
ఈ పాటల ఆటల కోసం
ఈ బ్రతుకొక తీరని దాహం !

# నాద కన్యవే

నాద కన్యవే !
నా వేణు వినోదినివే !

పద్మాసన సంస్థితవే !
ప్రాణ సుధారస ధారవె !
పరమ నాద వేదాంతర
పరా వాక్కువే !

నా జీవిత రంగస్థల
నర్తన లీలా బాలవె !
సుచల స్మణి మోహన రవ
చుంబిత సుఖ జీవనవే !

స్వర లహరీ మరాళివే !
శర దైందవ వరాళివే !
నా వాఙ్మయ దీపమవే !
నా చిన్మయ రూపమవే !

# అమృత రస కలశి

అమృ - త రస కలశి తావులు నీ
తావులు తెలిపె !
కను - పాపకు మణిదీపము నీ
రూపము చూపె !

శత - కోటి కోటి కలువలు నా
గుండెను విరిసె !
నా - తెన్ను వెంట అడుగడుగున
వెన్నెల కురిసె !

మా - ర్గము విరిసే కొలది రాగ
రంజిత మాయె!
అది - చనిచని మోహన రసాల
వనమున నిలిచె !

స్వ - ర్ణదియు, సూర్య సుతయును నీ
పదములు కొలిచె !
నం - దన బృందావనములె నీ
నగవున గలిసె !

గౌ - తమీ తీర లక్ష్మి కి నీ
దర్శన మబ్బె !
ఆ - నంద సుధా కలశి తుదకు
నాకె లభించె !

# చూశానులే

చూశానులే !
చూశానులే నిన్ను, చూశానులే !

మల్లెపూ మొగ్గలో
మందార మధువులో
భ్రామరీ రుతములో
పద్మినీ వ్రతములో !

జలదాల తెరలలో
జల నిధుల అలలలో
చంచలా నాట్య చే
లాంచల ద్యుతులలో !

ఆర్ద్ర నయనాలలో
అమృత హృదయాలలో
కల్యాణ రాగిణీ
కమనీయ కళలలో !

చీకట్ల వెలుగులో
వెలుగు చీకట్లలో
రమ్యసంధ్యారాగ
రాగోదయమ్ములో !

# హారతి కర్పూర దీప రశ్మి

హారతి కర్పూర దీప రశ్మి
నీ రూప లక్ష్మి !
మందార లతా కరమున
సుందర మణి పళ్ళెరమున ॥ హా ॥

లోల లోచనముల తోడ
లోకమెల్ల నిను జూచి
కరము లెత్తి పోటీ పడి
కనుల కద్దుకొను నట్టి ॥ హా ॥

నిను బోలిన దివ్వె లెన్నో
నీ చుట్టును చేరి కొలువ
చీకటి నగు నా నిండా
శ్రీ కాంతులు వెలిగించిన ॥ హా ॥

# సంగీత సరస్వతీ

సంగీత సరస్వతీ !
సకల కళా హృదయేశ్వరి !

మలయ మారుతము విసిరి
మామిడులను పూయించే,
మేఘరంజనిగ మారి
మెరకలనే పండించే ॥ సం ॥

భూపాలను కూడి జీవ
దీపాలను వెలిగించే,
కరుణ సుధను పంచ దేవ
గాంధారిని నియమించే ॥ సం ॥

నాద లతిక నొక దానిని
నాటి, కోటిగతుల పెంచు
కొని, కోటీశ్వరిపై కో
టీశ్వరునే ఆడించే ॥ సం ॥

# ముద్దు ముద్దుగ

ముద్దు ముద్దుగ మొగ్గ దొడిగిన
ప్రొద్దు తిరుగుడు పూల తీగ
అన్ని మొగముల విరియుట
నిన్ను చూచుటకే కద ?

మావి కొమ్మల నడుమ కోకిల
మధుర మోహన వీణ తానై
అన్ని మెట్లను కట్టుకొనుట
నిన్ను చేరుటకే కద ?

నిమిషమున కొక చీర మార్చుచు
సమయమున కొక రసము గ్రోలుచు
నింగి బొంగర మట్లు తిరుగుట
నిన్ను పొందుటకే కద ?

# నీ మాటలు వినాలని

నీ మాటలు వినా లనీ,
నీ పాటలు పాడా లనీ,
నిత్యము నిను చూడా లనీ,
నీ తోనే ఉండా లనీ
మనసు కెంతొ కోరిక
తనువు కెపుడొ ఊరిక !

నీ మానస తీరాలకు
నేల గడిచి రావాలని,
నీ చిత్త వియ త్సీమల
నీతో విహరించా లని
మనసు కెంతొ కోరిక
తనువు కెపుడొ ఊరిక !

నీ తలపున విరియా లని,
నీ వలపున మురియా లని,
నీ కోసం బ్రతకా లని,
నీ లోనే కలియా లని
మనసు కెంతొ కోరిక
తనువు కెపుడొ ఊరిక !

# పాడుచుంటిని ఎందుకో

పాడుచుంటిని ఎందుకో ! ఈ
పాట లన్నీ -
ఎన్ని పాటలు పాడినా, నీ
వన్నె విరియని తోట నిండా -

మధుపమో, సెలయేరో, పికమో
మధుర నాదము చేయుచుండ,
నేను ఎవరో గాన మనుకొని -
నీవు ఎవరో గీత మనుకొని -

విశ్వ సింహాసనముపై ఏ
వీణకో సరిగములు పలుకుచు,
మోహనోద్యానములలో ఏ
మురళికో దాసోహ మనుచు -

నాది నాకే వినపడని నా
పేద గొంతుక సెంత యెత్తిన,
ఎత్తు లన్నిటి యెత్తుపై నీ
చిత్త మందే ఆశ లేక !

# పాడేవా రుంటే

పాడే వారుంటే
పాటలకే కొదవా ?
పస గల పా టుంటే
పాడే వారే కొదవా ?

ఎల మావులె చిగురి స్తే
కల కంఠములే కొదవా ?
పిక లోకమె గొంతెత్తితె
ప్రియ మధువే కొదవా ?

వీణియలే ఉంటే
వాణులకే కొదవా ?
వాణియె కరుణి స్తే
వేణువులే కొదవా ?

# రాధే నా

రాధే నా ?
రసము లొలుక పాడే దది ?

వంశీధరు చేతి నుండి
వంశిని తా నందు కొని,
వసుధ నిండ ప్రేమాంకుర
రస దాళులు పెంచే దది ?

ఆనంద పయోనిధిలో
అలలు నాట్యమాడు ననగ
కర కమల దళాలు కదల
మురళిని వాయించే దది ?

మురళీ నాదము నిండా
చిరునవ్వులు పరిమళించి
రాకా రోదసులు పండ
రస రాజ్యము లేలే దది ?

తన చుట్టును వేణువు, వే
ణువు చుట్టును తన స్వామి,
స్వామి చుట్టు తాసై, వి
శ్వ స్వామ్యము నడిపే దది ?

# ధన్యవే యమునా నదీ

ధన్యవే యమునా నదీ ! నీ
గణ్య తెవ్వరి కున్నదీ ?
డెంద మందరి సొత్తె, కానీ
బృంద ఎందరి కున్నదీ ?

నాటి నీవే నేటి నీవా ?
నంద నందను గంటివా ?
వేణు చారణ చరణ రాధిక
విశ్వ శింజిని వింటివా ?

రాస లీలా నంద బృందా
రామ రమణీ రాగ హృదిలో
ఉంటి వటవే నీవు కృష్ణుడు
ఉద్భవించని ముందు కూడా ?

# ఎంత ఏడ్చినానో

ఎంత ఏడ్చినానో
బృందావని నిను గానక !

ఎద లోపల నున్న మూర్తి
ఎట్ట ఎదుట కనిపించక,
కనిపించని మూర్తి కొరకు
కన్నులు కాయలు కాయ ॥ ఎం ॥

పగలు పగలు నిను వెదకుచు
పలవించీ, పలవించీ
రేయి రేయి నీ కోసము
రెప్ప పడని నిప్పులలో ॥ ఎం ॥

మధురములై ఏ స్మృతులో
మరల మరల వేధించుచు
అడు గడుగున చితిని పేర్చి
ఆత్మ కగ్ని దరి కొల్పగ ॥ ఎం ॥

ఏడ్చి ఏడ్చి, నీకై నా
ఎదయే ఒక కడలి కాగ,
నన్ను నేనె పరచుకొని
కన్ను మిన్ను చేసుకొని ॥ ఎం ॥

# ఎందుకు నన్నిటు ఏడిపింతువో

ఎందుకు నన్నిటు ఏడిపింతువో ?
ఏమి నేర మొనరించితిరా ?
నిను ప్రేమించుటె నేర మైనచో
నిష్కృతి ఇక ఏమున్నదిరా ?

కన్నులు తొలకరి మిన్నులు కాక
కాంక్ష లెడారులె నటరా ?
వాన కురిసి వెలిసిన వెలుగే నీ
మానస మధు వటరా ?

ఎంత కాల మని యమున తరగలను
ఈ నా బుగ్గలు మోయుగలవురా ?
నీవు శ్యామ సుందరుడ వగుటకై
నీలోత్పలములు ఎన్ని లేవురా ?

లోక రచనలో నా కన్నీరే
నీకు మషీరస మటరా ?
కన్నీటితొ నను నింపుటయే నీ
కరుణారస పోషణ మటరా ?

# ఉండలేనురా

ఉండ లేనురా,
శిల్పకళా లవమై పడి !

ఏ చీకటి కొండ నుండి
ఈ వెలుగుకు తెచ్చితివో,
వెలుగును గని కూడ రెప్ప
వేయలేని బ్రతు కాయెర !

చూడలేని కనులు మహా
సుందరములె అయిన నేమి ?
పాడలేని కంఠ మెట్టి
పాలరాతి దైన నేమి ?

ఆర్ద్ర దృక్కు లెన్నెన్నో
అమృత కరము లెంతెంతో
గిలిగింతలు ఇడిన గాని
పులకింపని తను వేలర ?

స్పందన గల గుండె లేక
ఎందుకురా ఈ అందము ?
అందము నొసగిన శిల్పివి
డెంద మీయలే వటరా ?

# నిను ఆరాధింతునురా

నిను ఆరాధింతునురా !
నీ రాధికనై బ్రతుకుదురా !

నా అనురాగమె ధూపముగా,
నా తను రాగమె దీపముగా,
నా అధర సుధయె నైవేద్యముగా,
నా వలపే పవళింపు సేవగా !

గీత గాన రూపాత్మక వాణీ
మాతృ పయోరస పాయిని నై ,
మధురమైన ప్రతి శోభను గొని నా
మనసున గల నిను తనుపుదురా !

సుఖము దుఃఖమును లేని మోక్ష మది
సుందర మగునో కాదో కనుక
సుందర శోభా మందిర మగు నా
డెందమునే నిను నిల్పు కొందురా !

సర్వ దేవతలు, సర్వ మంత్రములు,
సర్వ సిద్ధులును నీవే కదరా ?
నీ ఆరాధనె నీ సాన్నిధ్యము !
నీ సాన్నిధ్యమె ఆనందమురా !

# జీవన వీణావాదినీ

జీవన వీణా వాదినీ ! నా
జీవిత లీలా గాయనీ !
నను లేపే ఉదయారుణ కిరణీ !
నను తనిపే రస వాహినీ !

జీవిత విపిన వినోదినీ ! నా
యౌవన రాకా రోహిణీ !
నా పద పదమున నవ రుచు లీనుచు
నను నడిపే మధు కింకిణీ !

యౌవన మోహన రాగిణీ ! నా
జీవన కృతి కల్యాణీ !
నా సుఖదుఃఖము లన్నియు నీపై
నను మనిపే ప్రియ దర్శనీ !

# నీ యెదలో మెరిసిన

నీ – యెదలో మెరిసిన దేదో
నా – పెదవిని విరిసినది !
నీ – కంఠము నొరసిన దేదో
నా – కన్నుల నిండినది !

నీ – ఆత్మ లోని ప్రతి మాట
పా – టగుచున్నది నా నోట !
నీ – గళమున గల ప్రతి పాట
రా – గోదయమే నా తోట !

నే – పుట్టిన దెందుకొ తెలిసె,
నీ – పూజకె చిత్తము విరిసె !
నే – నిక నీ కొక చిరు పాటై
నీ – నోటను కరగుదు నీపై !

# మనసే మధుమాసము

మనసే మధుమాసము !
నిను వలచే ఎవరికైన –

ప్రేమ గాన కోకిలవు,
కామ వర్ధనీ రమవు,
ఆమ్ర లతా శోభితవై
అను నిత్యము వికసించే –

అరుణోదయ రాగకళవు,
అరవింద పరాగ రుచివి,
అమృత మధుర మోహనవై
అనవరతము క్రీడించే –

సంతత సంతోషాత్మవు,
సంఫుల్ల వసంతమువు,
ఆనంద తరంగమువై
అను నిమిషము స్పందించే –

# నీ పాదములు

నీ పాదములు
నీ రేజములు !
　　నీ కురుల సిరులు
　　నీ లాభ్రములు !

నీ రేజముల నుండి
నీ లాభ్రముల దాక
　　ప్రతి దళము, ప్రతి కణము
　　ప్రణయ మధురములు !

నీ పాదములు
నా పెదవి మధు నిధులు !
　　నీ కురుల సిరులు
　　నా కావ్య రస ధునులు !

# మేఘ రంజని

మేఘ రంజని నీ సమక్షము
మేదినియె నా వక్షము !
రాగ రంజని నీ పరోక్షము
రస రమయె నా పక్షము !

రాగ మేఘము కురిసి నాలో
రసములను విరియించునే ?
రంజనీ రమణీయ రుచితో
రమయె నా దరి చేరునే ?

ఎది సమక్షము ? ఎది పరోక్షము ?
హృదిని నీ వున్నప్పుడు ?
సర్వరస రాగములకును నే
స్వామినై మనునప్పుడు ?

# మెరుపు తీగవే

మెరుపు తీగవే !
నా వలపుల తొలకరివే !

వేసవి రవి మూస నుంచి
తీసిన బంగరు తీగవె !
తీగ సాగి విరిసిన నా
భాగధేయ మవే !

దివిని పుట్టి, మబ్బులలో
దివ్య నాట్యములు చేసి,
నా కోసము భువికి దిగిన
శ్రీ కల్పక సుమలతవే ?

నా హృదయ క్షేత్రములో
నవ రసముల పంటవే !
పంట నడుమ మంచె మీద
కంటిపాప జంటవే !

# దేవీ నీ దర్శనమే

దేవీ ! నీ దర్శనమే
దివ్య దర్శనమే !

ఓం కార ద్విరేఫకోటి
ఝుంకారముతో రేగి,
నీ ముఖ పద్మము చుట్టూ
నిత్య భ్రమణము చేసే ॥ దే ॥

నీ చిరునవ్వులను తడిసి
నీ పరాగమున మెరిసే
అళులే రవి తారకలై
అహర్నిశలు నిను గొలిచే ॥ దే ॥

ఉడులను రాశులు పోసి
ఒడిసెలులకు ప్రాణ మొసగి,
చీకటులను పారద్రోలి
లోకములను పాలించే ॥ దే ॥

వసుధైక మహాప్రాభవ
రస రాజ్యము లేలు దేవి !
చెలిమిని నా చిత్తములో
కొలువు తీరి యున్న దేవి ॥ దే ॥

# మధు కలశివి నీవు

మధు కలశివి నీవు !
మధు మాధవ కల్యాణీ !

నీ వదనమె నా సదనము,
నా సదనమె నీ సదస్సు !
నీ ఆచరణ సమస్తము
నా ఆత్మ సమాహారము !

నాకు గమ్య రమ్య మెదో
నీకు రమ్య గమ్య మదే !
ఎపుడు నన్ను చేరుదువో
అపుడె నాకు ఆనందము !

నన్ను నీవు క్రోలుదువో ?
నిన్ను నేను క్రోలుదునో ?
ఒకరి నొకరు గ్రోలుటయే
ఉర్వికి ఓజో విభవము !

# పూజింతును నిన్ను

పూజింతును నిన్ను
నేనే నీ ఆలయమై ! -

ప్రతి ఉదయము నీ పదములు
పసుపు నీట కడిగి
ఆరామ రజో రాశుల
పారాణి రచించి ! -

మాటలు, చేతలు, ఊహలు,
పాటలు - నా సర్వస్వము
పువ్వులు ఫలములుగా నీ
పూజా వేదిక నుంచి ! -

నా ప్రణయపు పళ్లెరమున
నా ప్రాణము వెలిగించి,
నిత్యస్మిత రశ్మలతో
నీరాజన మందించి !

# నిను ప్రేమించుటే

నిను ప్రేమించుటే దోషమటరా ?
నిను కోరగ తగ నటరా ?

కమలినీ ముఖాస్వాదన
కామి కాడె భాస్కరుడు ?
క్షణ యౌవని కమలినికై
శర్వరినే గెల్చి రాడె ?

సంతత నవ నదీ వధూ
స్వామి కాడె సముద్రుడు ?
పరమ వృద్ధు డతని కొరకు
ప్రతి వాగును పడి రాదే ?

కృతకమ్మైన మానవ క
ల్పిత నియమము మన కేలర !
ప్రకృతి పురుష ధర్మమె మన
ప్రణయ తత్త్వమౌ కదరా ?

ఈ నా జీవిత పద్మము
ఏ నీకై విరిసినదో
ఆ నీ పెదవుల బిగువే
ఈ నా జీవిత మధుపుర !

# ఏ ముహూర్తమున

ఏ ముహూర్తమున భావించితివో
ఈ నా మోహన రూపం ?
ఏ లక్ష్యముతో రచియించితివో
ఈ నా త్రివర్ణ చిత్రం ?
ఉంచు కొందువో ?
చించి వేతువో ?

ఏ స్వర్ణముతో నిర్మించితివో
ఈ నా మృదు హృత్కలశం ?
ఏ మధువులతో నింపితివో ఈ
ప్రేమ మయీ చిత్కమలం ?
ఆస్వాదింతువో ?
ఆవల ద్రోతువో ?

ఏ కళా తపస్సున మలచితివో
ఈ నా జీవన శిల్పం ?
ఏ యే తేజస్సులు కలిపితివో
ఈ నా పూర్ణత కోసం ?
ధాత్రి కిత్తువో ?
దాచు కొందువో ?

# ఆవలి కొస వికసించిన

ఆవలి కొస వికసించిన
అనురాగ సుధాకరా !
ఈవలి కొస విరిసి నేను
ఎదురు చూచు చుంటిరా !

విశ్వమెల్ల విడిచి నన్నె
వేధించును వేణు రవము !
నా ఉనికినె చూడలేక
నల్లనయ్యె నలుదిక్కులు !

ఈవలి దని, ఆవలి దని
ఎంత కాల మీ కొసలు ?
నా గుండెనె నీ వుండి
రాగ మురళి పలికించర !

రెండు కొసల ముడిలోన
వెండి కొండ ఒడిలోన
నీ రాగము, నా రాగము
నిశ్రేయస భోగమురా !

# రవి కర లాలిత

రవి కర లాలిత గాక
రాజీవము విరియునే ?
మలయజు కౌగిట గాక
మల్లె మొగ్గ కరుగునే ?

చంద్రుని ముద్దులు సోకక
చెందొవ కన్నులు తెరచునె ?
కోకిల గానము లేక
లోకము కుసుమించునే ?

నీ పదములు వినబడక
నా హృదయము స్పందించునె ?
నీ కరములు స్పర్శ లేక
నాకు స్ఫూర్తి కలుగునే ?

## నీ వను కొన్నప్పుడే

నీ వనుకొన్నప్పుడే
నే నను కొన్నానులే !
నా మదిలో, నీ మదిలో
నవ్వుం దొక పువ్వేలే !

నీ ఎదలో మెదిలిందే
నా యెదలో కదిలెలే !
పరవశమై మన ఎదలలొ
పాడిం దొక పికమేలే !

నిను నడిపించిన దేదో
నను నడిపించిందిలే !
దారులు తెలియని పైనా
చేరిందొక తోటేలే !

# దీపము చూపుమురా

దీపము చూపుమురా ! నీ
రూపము చూపుమురా !
నీ రూపమె నా చూపుల నిండా
శ్రీ దీపము కానీరా !

బృందావనిలో సుందర గోపీ
బృందము చూచిన రూపము !
రాసక్రీడా రమణీయతలో
రాధకు చూపిన దీపము !

మన్ను తిన్న నీ చిన్ని నోటిలో
మాతకు చూపిన రూపము !
భరత మహా రణరంగము నడుమ
నరుదికి చూపిన దీపము !

భ్రమర గీతలను విసిరిన చెలులకు
భ్రమ తొలగించిన రూపము !
నాటికి నేటికి ఎల్ల ప్రాణులను
నడిపించే రస దీపము !

# ఎందు కిలా చూచెదనో

ఎందు కిలా చూచెదనో
అందరి ముఖముల లోకి ?

వెర్రిచూపు మాత్రమేనో ?
వెదకుదునో దేని నైన ?
చూపు లోని దీపమునకు
రూపము గన గోరితినో ?

నాకు ముఖాముఖిగ నిల్పి
నా చూపున చూపు నిలిపి
మనసు నిచ్చి పుచ్చుకొనే
మాధురి నన్వేషింతునొ ?

ముఖము లెల్ల ముక్తీశ్వరు
ముఖ్య ద్వారములె కావె ?
ఏ రహస్య నిధి కొరకో
ఈ నా చిర పరిశోధన ?

# అవకాశము ఈయరా

అవకాశము ఈయరా !
ఆత్మ బలము ఉన్నదిరా !

వేకువనే లేచి పోయి
లోకాలకు వెలుగు నొసగి
విశ్రమించ వచ్చిన నిను
వెన్నెలనై సేవించే – ॥ అ ॥

ప్రతి అణువున విశ్వమెల్ల
పర్యటించి, ప్రగతి చూసి,
బడలి వెడలి వచ్చిన నీ
అడుగు దామరల నొత్తే – ॥ అ ॥

రగిలే నీ నాడులపై
రాగ రసములను చింది,
తరిగిన మేరకు నిను నా
తపో మధువుతో నింపే – ॥ అ ॥

# మబ్బులలో చందమామా

మబ్బులలో చందమామా !
నా మధుర మనో రథమా !

తారల కడ నుండి నిన్ను
వారిద కన్యలు దొంగిలి,
తములో తాము నీ కొరకు
తగవు లాడు కొందు రటే ?

మహా శివుని జట జారిన
మల్లెపూల చెండు వని
నిన్ను కోరి అప్సరసలు
మిన్ను నిండ మూగి రటే ?

పాల్కడలిని తేలియాడు
పసిమి మిసిమి ముద్ద వనీ
కాల భూతములె నీకై
కత్తులు దూసుకొని రటే ?

దేవతలకు దొరికినచో
త్రావి త్రేన్చెదరు నిన్ను !
మబ్బు విడిచి, మలుపు గడిచి,
దబ్బున నా యొడి జేరవె !

# వస్తావా

వస్తావా ?
నిజముగ నా కొరకు నీవు ?

అందని ఆకాశములో
చందమామ వగు నీవు
ఎరుగని ఈ మారుమూల
విరిసిన నా తావులు గని ? ॥ వ ॥

చీకటి పొలములు దున్ని
శ్రీకాంతులు పండించే
లోక కృషీశ్వరుడ వీవు
ఈ కలువకు విలువ గట్టి ? ॥ వ ॥

నీ భావమె నా తనువుగ
నీ కోసము వికసించి
నిన్నే సేవించు నన్ను
నీ లోనికి చేర్చు కొనగ ? ॥ వ ॥

# మోహన రాగ రాగిణీ

మోహన  రాగ రాగిణీ !
మోహ వాహినీ ! స్నేహ మోహినీ !

కుసుమ శరుని శరములు నా
గుండె నాటి విరిసెనే !
విరిసిన పూదోటగ నీ
చరణ సీమ చేరితినే !

పూవు లెన్ని యున్న గాని
నీవు లేక వసంతమా ?
నీ మోహన లోని మోహి
నికి నా కింత దూరమా ?

దవ్వులలో నీ రుచులు
కవ్వించును క్షణము క్షణము !
క్షణమే యుగ మయ్యె, నిరీ
క్షణమే బ్రతు కయ్యె గదే !

# నా నిత్యారుణ తారుణ్యం

నా నిత్యారుణ తారుణ్యం
నీ నిరంతర ధ్యానం !
నా రసమయ జీవన గమనం
నీ రాగ సుధా స్వాదనం !

నా అనంత లీలానందం
నీ అవ్యాజ ప్రణయం !
నా కళా విభవ సామ్రాజ్యం
నీ కృషీ ఫలాభ్యుదయం !

నా అజేయ బల సామర్థ్యం
నీ అపరా వ్రత మహిమం !
నా అశ్రాంత మహా భోగం
నీ ఆత్మాశ్రయ భాగ్యం!

# నను చూచి నెమలి

నను చూచి నెమలి పిం
ఛము విప్పి నర్తించు !
వనములో నిను చూచి
వచ్చినది కాబోలునే, చెలీ !

నను చేరి పికము కం
ఠము సాచి పాడేను !
వనములో నీ పాట
విని వచ్చె కాబోలునే, చెలీ !

నను పట్టి మలయ పవ
నము కౌగిటను గ్రుచ్చు !
వనములో నిను తాకి
వచ్చినది కాబోలునే, చెలీ !

# ఆశాలత కొస కొమ్మ

ఆశాలత కొస కొమ్మను
అమృత ఫలము వ్రేలాడు,
పర్ణశాల వాకిటిలో
పసిడి లేడి తారాడు,
ప్రాయములో పొందేనా ?
ప్రాణముతో పట్టేనా ?

పాల కడలి మీగడపై
హాల హలము బుస గొట్టు,
నందన సరసీ తటమున
నవ మోహిని కను గొట్టు
శివుని కరుణ కలిగేనా ?
అవహేళన మిగిలేనా ?

అరుణోదయ కలశములో
అను రాగము వెల్లి విరియు,
మానస మండలము నుండి
ఆనందము కురియు,
కరవు తీర గ్రోలేనా ?
కచ్ఛపినై పాడేనా ?

# నిన్ను నేను ప్రేమించన

నిన్ను నేను ప్రేమించన ?
నన్ను నేనె ఎరుగనా ?
నా కున్న సమస్త మందు
నీకు కాని దుండెనా ?

కొండ రాతి బొమ్మనా ?
గుండె లేని దాననా ?
చిరు వాగునె అయిన గాని
గిరి బాలనె కానా ?

చరణమ్ములు కడిగి, చీర
చెరగున తడు లొత్తనా ?
బ్రతుకు నిండ నీ కోసము
బంగారము పండనా ?

# అనురాగ సాగరా

అనురాగ సాగరా !
నను అందు కొనుమురా !
అలసి వచ్చే నాకు
ఆశ్రయమ వగుమురా !

చిరు సరసు లెన్నెన్నొ
చిన్న కొలకులు నన్ను
బాట పొడవున పట్టి
బంధించ నెంచెరా !

అంతంత మాత్రమౌ
అలస వాపిక లందు
బ్రతుకెల్ల జడమునై
పడి యుండ లేనురా !

నీ వనంత మహా న
దీ విభుడవే యైన,
నీ గుండె నా కింత
రాగ సుధ నొసగరా !

పుట్టితిని నీ కొరకె
పూర్ణ రస ధారగా,
నిను చేరకే యెడా
రినొ ఇంక లేనురా !

# పుట్టితివటె నా కోసము

పుట్టితి వటె నా కోసము
నా పుణ్యపు ప్రోవ ?
వచ్చితి వటె నా తోటకు
నా వలపుల తీవ ?

కోకిల కంఠము లోనే
నీ కోరిక వినిపించి,
రాధా పూర్ణిమ నాడే
నీ రాకను మెరిపించి !

కావ్యా మృతమును పంచే
కవి మాత్రుడ నగు నన్ను
మధుపూర్ణుని జేయుటకై
మధుర గాన రస రమవై !

స్పందన మెదొ రూపొంది,
డెందము నెదొ కదిలించి,
ఏ తీరము లధిగమించొ
ఏ పుణ్యము ఫలియించో !

# ఎటు ఎచటికి

ఎటు, ఎచటికి, ఎందు కనుచు
ఎవరిని ప్రశ్నింతువే ?
ప్రశ్నలకు జవా బెరిగిన
పరమజ్ఞులు కలరటే ?

ఎటో, ఎచటికో, ఎందులకో
ఎరుగ బడని యాత్ర లివి !
ఎటు కేసో పో గోరుచు
ఇందాగితి నీ కొరకు !

తెలియదు గమ్యము నాకును
తెలిసిన దొక గమన మేనె !
నిత్య పురోగామితయే
నిఖిలేశ్వరతయొా కదే !

# ఏమిటి వెదకేవే

ఏమిటి వెదకేవే ? బాలా !
ఏ మున్నది నా వదన సీమలో ?

వెన్నెల కురిసే కన్నులు కావా ?
కన్నులలో నీ బొమ్మలు లేవా ?
బొమ్మ లెన్ని యైనను నీ ప్రతి రూ
పమ్ములు మాత్రమె కావా ?

ప్రియములు పలికే పెదవులు కావా ?
పెదవులపై నీ పారణి లేదా ?
పారాణికి శత పదము లుండినా
పసుపు కుంకుమలు నీవే కావా ?

నా ముఖ రాగ మదే దైనను నీ
ప్రేమ రాగరంజితమే కాదా ?
చూచు కొలది నాలో కనిపించే
శోభ లెల్ల నీ ఊప్సలె కావా ?

# నీ వటరా

నీ వటరా !
నా పూజా ఫల మూర్తివి ?

పండు గేదొ వచ్చిన దని
పిండి వంట లెన్నొ చేసి
దైవ పీఠమున నుంచగ
దేవుడవై వచ్చినది ?

గౌరిని నే సేవించి
గౌరీశుని గొల్వ బోవ
గాలి గోపురము కడనే
కే లందిచ్చిన స్వామివి ?

స్త్వైర శిల్పముల నొరసి
వైర శక్తులకు జడిసి
అలసిన నా హృదయానికి
అమృత పూర్ణ కలశానివి ?

ఎదలో నుండిన స్వామివి
ఎదుట కెట్లు వచ్చితి వో
సకల దేవ దేవీ మయ
సర్వాంతర్యామివి రా !

# నిను కనుగొంటిని లే

నిను కనుగొంటిని లే !
నేటికి నా హృదయాలయ వాటి !

నా కలలకు బంగారు రెక్కలు
నా పెదవులపై మధుర హాసములు
నా బుగ్గల నును సిగ్గులు నీవు !
నా కన్నులలో కాంతులు నీవు !

పవలు రేయి పని పాటులలో, నా
పదము లంటి నడిచేది నీవు !
వైరోక్తులను తొలగించుచు నా
దారి వెంట విరిసేది నీవు ?

అలసిన తనువుకు మలయ పవనమై
ఆత్మకు వైశాఖీ చంద్రికవై
నిరతము నా చుట్టును విహరించుచు
నిండు గుండెపై యున్నది నీవు !

ఎట ఏ సౌఖ్యము నను వరించినా
ఎట ఏ కిరణము దారి చూపినా
ఎట ఏ త్యాగము నన్ను పిల్చినా
అట అది అంతయు నీవే నీవు !

# నాకు నిన్ను నీవే

నాకు నిన్ను నీవే శ్రుతి చేసుకొని
నా గుండెను మీటి యుండ వేని
నా కంఠము నాకు వినబడేదా ?
నా రూపమె నాకు కనబడేదా ?

తీగలు తాకే వ్రేళులె లేక
రాగ భోగములకు నోచు కోక
మూల నెందొ పడియుండిన వీణకు
మోక్షము లభించిన దిన్నాళ్లకు !

ఆలస్యము అయితే అయినదిలే !
ఆశించిన అమృతము అందెనులే !
నిండదె అనుకొను చుండిన పాత్ర
నింగి దాక పొంగెను నీ స్పర్శ !

# ఏ మున్నదిరా

ఏ మున్నదిరా చెప్పడానికి ?
ఏ మున్నది నీ వెరుగనిది ?
నా కున్నది ఒక ప్రేమ మాత్రమే !
రాకున్నది అది పెదవికి !

ప్రేమ అనుచు నే పలుక బోవగా
మైమర పేదో ముంచు చున్నదిర !
మధుర మూర్తి నిను చూచే కొలదీ
మధువే యగు చుంటినిరా !

కమలము కమలాప్తుని కేమనును ?
కలుక కలువరేని నేమి కోరును ?
అంత కంటె నే నేమి పలతురా ?
అంతరంగమున తావీగదరా !

# నీ కన్నులలో

నీ – కన్నులలో నా కనులు
కాటుక కను లయ్యె !
నీ – చూపులలో నా చూపులు
దీపము లయ్యె ?

దీప తోరణముల లోన
దివి తారాపథ మయ్యె !
పథాంతమే ప్రఫుల్లమై
పద్మిని అయ్యె !

పద్మినిలో నా హృదయము
పరమ సరస్వతి అయ్యె !
ఆమె చుట్టూ నీ రూపము
అమృతమె అయ్యె !

అమృతముతో కళ లన్నీ
ఆనంద ప్రభ లయ్యె !
ఏ ప్రభ యైనను అది నీ
ఊపే అయ్యె !

# అనంగ మోహినీ

అనంగ మోహినీ !
త్రిభంగి రూపిణీ !
రసాలినీ వనీ వసంత
రాగ వాహినీ !

ఉషో తమస్వినీ !
తమో ఉషస్వినీ !
మదీయ హృదయ సూర్యకళా
మంగ ళాఢ్యనీ !

అనాది వాసినీ !
అనంత రసధునీ !
ప్రపూర్ణ జీవనేందు రమా
ప్రణయ గాయనీ !

కళా మనస్వినీ !
ఇలా యశస్వినీ !
సదా శిరస్సరోజ దివ్య
సద్విహారిణీ !

సుఖ ప్రకాశనీ !
శుభ ప్రదాయినీ !
త్రికాల నిత్య యౌవనీ ! త్రి
ధా లసద్గుణీ !

# రంగు రంగుల రంగవల్లుల

రంగు రంగుల రంగవల్లుల
రమ్య రాజీవముల నడుమ
వెలసి విరిసిన పద్మమందు
నిలిచి పిలిచే నిన్ను చూచి
లక్ష్మి వను కొన్నానులే ! నా
లక్ష్మి వేలే !

రంగవల్లుల పొదలలో, సా
రంగ రాగ రవాలలో,
కాల కంఠుని కదలికలకు
కంఠ మొసగిన నిన్ను చూచి
లక్ష్మి వను కొన్నానులే ! నా
లక్ష్మి వేలే !

పసుపు బొమ్మకు ప్రాణ మొసగి
బాల గౌరికి డోల లూపి
ప్రణవ మూర్తికి ప్రాణమైన
పరమ సుందరి నిన్ను చూచి
లక్ష్మి వను కొన్నానులే ! నా
లక్ష్మి వేలే !

# ఏ అరుణోదయ రశ్మి

ఏ అరుణోదయ రశ్మితొ
ఏ తరుణోదయ రజముతొ
చిత్రించినదో ఈ నీ
శ్రీ రమ్య కళారూపము !
నా కోసము తీర్చి దిద్ది
నా రెవరో !

ఏ కిన్నెర విన్యాసము
ఏ నూపుర నిశ్వాసము
ప్రేయ స్సయి విరిసినదో
నీ యీ శ్రేయోగానము !
నా కోసము మేళవించి
నా రెవరో !

ఏ హర్షావేశములో
ఏ వర్షా తోషములో
రసపూరిత మైనదొ ఈ
రాగ కలశి నీ హృదయము !
నా కోసము నింపి పంపి
నా రెవరో !

# నిన్ను మించి ఏమున్నవి

నిన్ను మించి ఏమున్నవి అందాలు ?
నిన్ను విడిచి రాకున్నవి నా కనులు !

నీ చరణాబ్జముల నుండి
నేత్రోత్పలముల దాకా
సుందర శివ చిన్మోహన ఉమ వీవు !
బృందా అరవిందాలయ రమ వీవు !

కనులకు కనిపించనివి
మనసునకే అందనివి
అజరామర రుచు లెన్నిటికో నీవు
అమృతానంద బ్రాహ్మీ రూపమువు !

నిను చూచిన నా చూపులు
కన నెంచవు ఇతరములు !
కన్ను లెందు కున్నవి అను జగము
నిన్ను కనక ఎటు పొందును సుఖము ?

# తిలక ముంచవే

తిలక ముంచవే !
అలసిన నా నుదుట ప్రేమ –

చీక టింటి గుమ్మములో
శ్రీ దీపము రీతి !
మబ్బుక్రింది తమ్మికి దిన
మణి కిరణము భాతి !

కోర్కెల పండువుగ వచ్చి,
గుండె బరిణె నుండి తీసి,
నిద్దవు నీ కనీనికల
అద్దపు బొమ్మ ముడి నడుమ !

ప్రణయ కుంకుమిత మౌ నీ
ప్రజ్ఞాన కర స్పర్శలో,
ఆనందము వెల్లి విరిసి
అమృతమూర్తినై వెలయ !

నీకై పుట్టిన నేను
నాకై వచ్చిన నిన్ను
కలుసుకొన్న శుభ వేళకు
కల కాలపు చిహ్నముగా !

# ప్రణయముతో నా ఒడిలో

ప్రణయముతో నా ఒడిలో
పాడుకొనుచు నీ వుండగ,
ప్రతి పాటను నా హృదయము
ప్రకృతి నెల్ల విరియా లని
కోరు కొనుట దోష మటే ?
కోరిక తీర్చలే వటే ?

వివశతతో నీ ఒడిలో
విశ్రమించి నే నుండగ,
కామ వర్ధనిపై నన్ను
కల కాలము పాడా లని
కోరుకొనుట దోష మటే ?
కోరిక తీర్చలే వటే ?

పరమానందమున పాట
పరమ తార నందు కొనగ,
పాటలోన లయమ్మై నా
ప్రాణములు తరించా లని
కోరుకొనుట దోష మటే ?
కోరిక తీర్చలే వటే ?

# ఎన్నాళ్లకు చేరితిరా

ఎన్నాళ్లకు చేరితిరా,
ఈ నీ హృదయ పయోధికి !
ఎన్నాళ్లకు పొందితిరా
ఈ నీ కౌగిటి సుఖము ! ॥ ఎ ॥

మంటలలో మసలి మసలి,
మబ్బులలో వేచి వేచి,
కొండ కొలకులకు దూకి,
నిండు వాగుగా ప్రాకి ! ॥ ఎ ॥

సరసుల సంగతుల లోన
చిరకాలము మైమరచి,
స్నేహ స్ఫూర్తిని పొంగి
వాహినినై ప్రవహించి ! ॥ ఎ ॥

ఎంత కాలము గతించిన,
ఎన్ని భంగములు పొందిన,
నీ వస్తువు నిను చేరక
నిలువ దన్న సత్యముతో ! ॥ ఎ ॥

# ఎంత ధన్యత

ఎంత ధన్యత ! నీ
హృదయేశ్వరి నగుట !

వెలుగులలో, నీడలలో,
వెన్నెల తీరముల వెంట,
వెదకి వెదకి వేసారియు
తుదకు నిన్ను పొందుట ! ॥ ఎం ॥

కన్నుల కలువల జంట
వెన్నెల కాసే మింట
విధు పూర్ణుడ వైన నిన్ను
వీణా రమ నా కొసగుట ! ॥ ఎం ॥

ప్రతి రే యొక గేయముగా,
బ్రతుకే ఒక కావ్యముగా
పాడుకొనుచు నీ కౌగిట
పరవశమై పోవుట ! ॥ ఎం ॥

# కలిసిపోతిని

కలిసి పోతిని !
కరిగి పోతిని ! నీలో –

పాల పొంగులో
పంచదార వలె !
చెరకు విల్లులో
శీధు కణము వలె !

మేఘ వనములో
మెరుపు తీగ వలె !
జలధి హస్త మున
సెలయేరు వలె !

అరుణార్కునిలో
యామిని వోలె !
యామిని కౌగిట
అర్కుని వోలె !

కౌముది ఎదలో
కలువ కన్నె వలె !
గీతములో సం
గీతము వోలె !

# ఇసుక తిన్నెల మీద

ఇసుక తిన్నెల మీద వెన్నెల
పసిడి పాదా లాడెనే !
కలువ పువ్వుల కంఠములలో
ఖర హర ప్రియ విరిసెనే !

కొండ వాగుల గుండియలపై
కోటి వీణలు మ్రోగెనే !
తీరముందున నెమరు వేసెడి
ధేనువులు తల లూచెనే !

ఈల చెట్టులు ఎదిగి నింగికి
ఈః పసందులు మోసెనే !
బాల చంద్రుడు విరగ బడగా
బాల నా యొడి వ్రాలెనే !

# మనసున గలవేనే

మనసున గలవేనే !
మహిలో గల మాధురు లన్నీ, మన -

స్వర్గంగా తీరములో కాని
స్వర్ణ కమలములు పుట్ట వటే ?
అమృత హృదయ మున్నప్పుడు తనువే
అమరారామము కాదే ?

అల వైకుంఠ వనాలనె కాని
అమృత సరస్సులు వెలయ వటే ?
మధుర హృదయ మున్నప్పుడు బ్రతుకే
మందార మరందము కాదే ?

యమునా తటి నొక బృందావనమే
అమృత ప్రేమకు నిలయ మటే ?
రాగ హృదయ మున్నప్పుడు నీవే
రాధా రమణివి కాదే !

# నా మనసున నీవు

నా మనసున నీవు
నీ మనసున నేను
రాగ సుధార్ధులము !
రాధా కృష్ణులము !

నా యెదుటను నీవు
నీ యెదుటను నేను
రతి మన్మథులము !
రవి చంద్రికలము !

నా పెదవికి నీవు
నీ పెదవికి నేను
ఆమని మధువులము !
అమృత భాండములము !

నా కౌగిట నీవు
నీ కౌగిట నేను
కంటికి రెప్పలము !
కామ పూర్ణిమలము !

నా కోసము నీవు
నీ కోసము నేను
చందన చర్చలము !
చక్కెర బొమ్మలము !

# నాకు వసంతమే

నాకు వసంతమే !
లోకమున కదేదైనా -

కోకిల గానముల తోడ
లోకోత్తరముగ విరిసిన
మామిడి వలె నిరతము నను
మధురించే నీ మ్రోల !

కోయిళులకు ప్రతి పలుకుచు
లోయలలో మధు వొసగుచు
కొండలపై నను కొలిచే
గుండెలు గల నీ మ్రోల !

పాల నుండి వెన్న వలే
పాల్కడలిని పొడము శశిని
దిన దినమును తినివేసెడు
దేవతవౌ నీ మ్రోల !

# రాధ వటే ?

రాధ వటే
రస రాజ్యము లేలెద వటె ?

నాకు నీవు రాధ వైన
లోక జీవ గాధవు కదె ?
ప్రతి ప్రాణికి ప్రాణి లోని
రాణివి నీవె కాదటే ?

నృత్య కళవు, రసమయ సా
హిత్య కళవు, చిత్ర కళవు,
గాన కళవు – సర్వకళా
మానస మధు మంజూషవు !

అరుణోదయ రాగమవు,
తరుణోదయ కామనవు,
ఆశల కానందాలకు
ఆత్మాశ్రయ దేవతవు !

మన సిచ్చిన చెందొవవు,
మనసు గొన్న చంద్రికవు,
నాకు ప్రేయసివె యైన
లోక శ్రేయసివి కదే !

# ఆడుకోర కృష్ణా

ఆడుకోర, కృష్ణా !
ఆశ తీర నా యెదపై -

కెందామర చిరు మొగ్గలె
కేళీ కందుకములుగా,
ఎఱ్ఱ గులాబీ రేకలె
ఎల నోటికి విందులుగా !

అమృత వేణువున మెరిసే
ఆర్ద్రా రోహిణులను నీ
రెండు చేతులను గొని, నా
గుండెలపై చిందులతో !

చైత్రీ వైశాఖీ మధు
సార పూర పూర్ణిమలే
వెన్న ముద్దలై నీకు
విశ్వ లీలె ఒక హేలగ !

నీ కరచాలితము లైన
నెల వంకల తరగలతో
నేనే ఒక పాలవెల్లి
నై నింగికి పొంగి పోవ !

# గమత్తు చేసితివే

గమ్మత్తు చేసితివే !
గారడి చేసితివే !
నీవు చేసిన దంతా
నిజమని పించితివే !

కోకిల కంఠముతో
గొంతెత్తి పిలిచితివే !
మధువులు గ్రోలించి
మై మరపించితివే !

సుమ వనిగా విరిసి
అమృతముగా కురిసి
శారద లక్ష్మివిగా
స్వాంతము తనిపితివే !

చండకర బింబమవై
ఎండలు మండించి,
చందన చర్చలతో
చాంద్రీ సుఖ రమవై !

నిశవై నా యెడదను
నీలో ముంచుకొని,
అహమై నాలో నీ
ఆత్మనె తేల్చితివే !

# మానస కాసారము లో

మానస కాసారము లో
భానూదయ రాగము లో
పసుపు నీట జలక మాడు
పసిడి తమ్మి మొగ్గలతో
    విరిసిన హేమాబ్జ సుందరీ ! నీ
    దరిసెనమే రసలహరి !

స్వర్ణ సుధా మధూళి లో
స్వ ర్మధు పావళి రొద లో
మొన గోటను ముజ్జగాలు
ముట్టడించు తడి కురులతొ
    వీణ నందుకొను సరస్వతీ ! నీ
    గానమె నా జీవన గతి !

తడు లారే సాంబ్రాణికి
ఒడలే శ్రావణి కాగా,
మెరుపు తీగ మైకములో
తరుణ వయో వైఖరితో
    నను రక్తుని చేయ రసాత్మా ! నీ
    అనురాగమె నా ఆత్మ !

# దేవీ నీకంటె నాకు

దేవీ ! నీ కంటె నాకు
దైవ మెవ్వరే ?

నా గుండెను కూర్చుండి
నా భావములను మీటి
నవ నవ రాగములు కూర్చి
నను నిత్యము పాడు కొనే –

పూవు తేనియతొ ఉగ్గిడి
మావి పండ్ల భోజన మిడి
సంతత మధురమపై నా
స్వాంతమ్మును పోషించే –

రాగ ద్వేషముల నడుమ
భోగ త్యాగముల నొరసి,
అపరాబ్ధిని గ్రుంకే నను
అరుణోదయము కెత్తే –

వసంతాంత మందు పూల
వలె జగములు ముగిసి పోవ,
శిశిరాంతము వరకును నీ
సిగ పూవుగ మనుచు కొనే –

# మానకురా మురళి

మానకురా మురళి !
మధు గాన పయో మంథన కేళి !

క్షీరోదధిలో శ్రీ కూర్మము పై
గిర గిర గిర మంథరమే తిరుగ
రస నిధు లన్నీ బుస బుస పొంగ
అసమ విషమ్ములు అంతము కాగ –

బుగ్గలు, బుడగలు, నిగ్గులు, నురగలు
సుభగములై నీ చుట్టు నటింప
కడలి లోతులే కమలి తెములగా –
విశ్వ కమలమే వికసింప –

ఒక్కొక కళపై నొక్కి ఊది నీ
తరుణ వేణువే తాండవించగా
నాదము కరిగిన నవ శీధువులో
తన్మయమై ఈ తనువే కరగ –

జగ దాధార నిజాత్మ కమలమున
రాగ చేతనా రమ మేల్కొనగా
ప్రణయము కురిసే, ప్రాణము విరిసే
ప్రణవము మురుసే మోహన మురళి –

# రేయో పగలో

రేయో, పగలో – రేపో, మాపో
నీవో, నేనో – పూవో, ఫలమో
గుర్తే పోయిన వివశనురా !
గుచ్చి గుచ్చి నను లేపకురా !

అందము లంటే – డెందములే
డెందము లంటే – బృందా క్రీడలె
మురళిని విరిసిన స్వరమునురా !
మోహము లో నను ముంచకురా !

రాలు నన్నదే – పూలకు విలువ
పోవు నన్నదే – తావుల విలువ
విలువలె మరచిన కలువనురా !
తెలివికి నను మేల్కొలుపకురా !

వంశిని మలచిన – వంపులు, సొంపులు
వలపుల జిలుగులు – వయ్యారములు
నీలో విడిచిన బాలనురా !
నాలో నన్నిటు మన నీరా !

# అందాల తోటవే

అందాల తోటవే
ఆనంద సుందరివే !
　　నా దారి పొడవునా
　　నందన వన మవే !

రాజీవ చరణవే
రంభోరు రమ్యవే
　　మనసైన నిమిషమే
　　మందార మధువువే !

సికతా శ్రోణీవే
చెంగల్వ కొలనివే
　　కనక గిరి సానువుల
　　నన నీటి జాలువే !

ఉదయ రవి చంద్రిక వే
ఉద్యాన కోకిలవే
　　సహకార శాఖివే
　　సాధు వైశాఖివే !

ముద్దుల మాటవే
ముద్ద గులాబివే
　　శత పత్ర శోభలో
　　సౌందర్య లక్ష్మివే !

# మరచి పోతి వటే

మరచి పోతి వటే ?
నా ఒడిలో , నా మాటే -

నా పెదవిని మధువు గ్రోలి
నా యెదపై కొలు వుండి
నను కృష్ణ నిశీధి జేసి
నవ విభాత మైతి వటే ?

నా వెలుగును మై దాల్చి
నను మనసున దాచుకొని
ప్రాణి కోటి కెల్ల నీవె
ప్రాణ భూత మైతి వటే ?

కలువ పూల తోటలలో
వలపు తేనె పాటలతో
చాంద్రీ రమపై నీవే
సర్వేశ్వరీ వైతి వటే ?

ఒక సగమును మురిపించి
ఒక సగమును కరిగించి
నను పూర్తిగా లోగొని నా
ఉనికినె మరచితి వటే ?

# చూచే కొలదీ సుందరము

చూచే కొలదీ సుందరము
సుందరము, రస బంధురము !
చందన శీతల మార్దవము ! నీ
చరణాబ్జ శ్రీ మందిరము !

మాటే రసమయ మానసము ! నీ
పాటే ప్రణయోపాసనము !
ఆటే నట రాజేశ్వరము !
ఆత్మే ముక్తీశ్వరము !

దర్శనమే నయనోజ్జ్వలము ! నీ
స్పర్శనమే తను వల్లభము !
ఆస్వాదనమే అనుభవము !
అనుభవమే నీ ఆకారము !

# ఆడుకొందము హాయిగా

ఆడు కొందము హాయిగా
పాడుకొందము తీయగా
మేలుకొనవే, ఓ చెలీ !
మేను తెలియవె, నా చెలీ !

జంట పూవుల గుత్తిగా
జమిలి వాగుల వేణిగా
విరుల సీమలలో, చెలీ !
వెల్లి విరిసెదమే, చెలీ !

వచ్చినందుకు ఫలముగా
ముచ్చటకు లక్షణముగా
తనువు లొకటై, ఓ చెలీ !
తన్మయింతమె, నా చెలీ !

# ఎన్నో ఎన్నో పూలు

ఎన్నో ఎన్నో పూలు పూచెనే !
ఈ తోట నిండ -

జాజులు, రోజాలు, సరో
జాలు, బంతి చేమంతులు,
మల్లెలు, మందారాలు
మధుపులతో కొల్లలుగా -

పూచిన పువ్వెల్ల విశ్వ
మోహన సుందర మేనే !
సుందర మౌ ప్రతి పువ్వున
శోభా రమ వీవేనే !

నీవే వసంతముగ తోట
నీ అడుగులు కొలుచునే !
నీవె మధువుగ వసంతము
నీ చుట్టును విరిసెనే !

# ఆడవే నా రాణీ

ఆడవే ! నా రాణీ !
అవనీ మోహనముగ ఈ ఆమని –

నా పాటయె నీ రూపము నొంద
పద పదమున నీ హృదయము విరియ
అక్షరములె నీ అడుగులు కాగా
నా భావాలయ నర్తన రమవై !

కుంకుమ మోమును పంకజ మొసరుప
కాటుక నిశలకు కాంతత్వ మొసగ
తను లతతో సౌదామిను లొరయ
అంగ హారములె ఆశల మెరయ !

నీలో లయమై నెమళులు, సుమములు,
అలలు, శిలలు నాట్యార్చత నాడ
ఆడ సాగు తారాంబరములతో
అభవుడె తడబడి అడుగులు వేయ !

# నను చిత్రించితి వటే

నను చిత్రించితి వటే ?
నాకే రంగులు పూసినా వటే ?

నా తలపులలో వలపులు కలిపి,
నవరస లేఖినితో నిను వ్రాసి,
ప్రాణము పోసిన బ్రహ్మను నేను !
బ్రహ్మకె నీవు అమ్మ వైతి వటె ?

నాకు లేని రూపము నీ కొసగి,
నా కోర్కెలతో నిను నింపుకొని,
నీలో కలిసి, నిదురించిన నను
నీడకు వెలుగుకు వదలినా వటె ?

నా బొమ్మవు, నన్నే బొమ్మగ గొని
నవనవ రేఖల జీవ మయూఖల
రాగములకు, రసములకు మలచుకొని
రామా రమపై వెలసినా వటే ?

ప్రతి దివసము, ప్రతి నిమిషము నాకు
ప్రణయ మధూదయమే కాగా –
అద్దిన రంగులు అద్దకుండ, నను
అమృత రూపముగ విరియించితి వటె ?

# ప్రియా ప్రియా

ప్రియా ! ప్రియా !
ప్రేమ రసోదయ మధు హృదయా !

లలిత మధుర శృంగార కళాలయ !
లబ్ధ కామ కమనీయా !
ఆనందింపుము అవని నిండ నీ
మానసమే మధువై కురియ !

అరుణ తరుణ సౌందర్యము లెట నెట
అలరు చున్నను అవెల్లను నీపై
విహరింపుము ఈ విశ్వమెల్ల నీ
వృత్తాంతముగా విరియ !

అనురాగముతో వెల్లి విరిసి, నా
అణు వణువున నీ ఆత్మ రమింప,
రాజిల్లుము రాగామ్నాయమె నీ
రాభీ రమ య్యై మెరయ !

# మన గుండెలు రెండూ

మన గుండెలు రెండూ, ఒక
గుండెగ స్పందించె !
మన మేనులు రెండూ, ఒక
మేనై ద్రవించె !

మన మనసులు మహి నిండా
మధువులు వర్షించె !
మన వలపులు ప్రతి తలపున
మల్లెలు పూచె !

మన అనురాగపు కలలు
మలయ మారుతములు !
మన ఆనందపు అలలు
మధు జీవన రమలు !

మన జీవిత గాథయే
రాధా మాధవము !
మన వాంఛా పూర్ణిమమే
రాభీ శోభనము !

భీమన్న

# రాభీలు

రెండవ భాగం

## అందాలెన్నో నన్ను

అందా లెన్నో నన్ను
ఆకర్షిస్తున్నవి,
ఆకర్షణ లెన్నెన్నో
ఆమను లవుతున్నవి !

అందం ఒక గేయంగా
ఆమని ఒక కావ్యంగా
నవ్య నవ్య రూపాలకు
నను కరగిస్తున్నవి !

ఏ అందం అయినా
ఏ ఆకర్షణ అయినా
నీ నిజ సౌందర్య సుఖా
నికి ద్వారం మాత్రమె కద ?

# నీ వొక పరి కరుణించిన

నీ వొక పరి కరుణించిన చాలదా
ఈ విశ్వమునే యేలగ ?

పశు బలమున అడవి నెల్ల
పాలించును మృగరాజు,
మృగరాజే వాహన మగు
జగదీశ్వరి దీవెన గొని ! ॥ నీ ॥

చీకటి సంద్రములో ఈ
లోకము ఒక మాణిక్యము,
మాణిక్య విపంచి మీటు
మధుశాలిని దీవెన గొని ! ॥ నీ ॥

ప్రతి మానస చేతనకు
ప్రాణాధారము పద్మము,
పద్మమె తన ఆలయ మగు
పరమలక్ష్మి దీవెన గొని ! ॥ నీ ॥

# తిరిగి తిరిగి తిరిగి

తిరిగి తిరిగి తిరిగి, ఈ
తీరము చేరితిమి !
　　విశ్వమెల్ల తిరిగి, ఈ
　　వీటిని విరిసితిమి !

లోకము కన్నులు ముద్దిడి
చీకట్లను తొలగించుచు,
　　గుండెల చెందొవల నిండ
　　పండు వెన్నెలలు కాయుచు -

అంభోధులు మధించుచు,
హాల హలము భరించుచు,
　　అందాలను అందుకొనుచు,
　　అమృతరసము గ్రోలుచు -

ఎట తిరిగిన, ఎది చూచిన,
ఎదురు బొదురు మనమే యై
　　నీకు నేను, నాకు నీవు
　　నిశ్రేణులు కట్టు కొనుచు -

# నీ కంటే నా కెవరున్నారు

నీ కంటే నా కెవ రున్నారు
నీ వెరుగని దే మున్నదిరా ?
నీ ప్రేమామృత రుచిలో కాక
నా ప్రాణము లాడే నటరా ?

వేయి దీపముల వెలుగు లైన నా
విలువలు పెంచే నటరా ?
ఎల్ల విలువలకు వెలుగువైన నీ
హృదయ మొకటె చాలునురా !

ఎన్ని కోరికలు నీకు ఉన్నవో,
అన్ని ఆత్మలును నా కున్నవిరా !
కోర్కె కొక్క రూపము ధరించి, నీ
కోర్కె లెల్ల తీర్తునురా !

# మధు రసములు వలసిన

మధు రసములు వలసిన, నీ
మాటలు వినవలెరా !
ప్రణయ సుధలు వలసిన, నీ
పాటలు కనవలెరా !

సుఖములు వలసినచో, నీ
ముఖమును గన వలెరా !
సంతోషము వలసిన, నీ
స్వాంతము గొనవలెరా !

ఆనందము వలసినచో,
నీ నెలవుకు రావలెరా !
అమృత పదవె వలసిన, నీ
యందె నిలిచి పోవలెరా !

# అద్దములో

అద్దములో ప్రతి ముఖమూ
అందమైన దేరా !
అందములో ప్రతి అద్దము
ఆత్మ రూపమేరా !

నా కంటికి నా ముఖమే
లోకోత్తర సుందరము,
లోకోత్తర సుందరుడవు
నీ కంటికి ఎట్లుందునో ?

ఆత్మను చూచుకొనకుండ
అద్దము చూచుకొను చుంటి,
అద్దము వలె ఆత్మ యున్న
అద్దము వేరే యేలర ?

# రగులు తున్న

రగులు తున్న ప్రతి మోడూ
రవి అవుతుం దటే ?
కల మూనిన ప్రతి వాడూ
కవి అవుతా డటే ?

తోట లోని ప్రతి అరవ్వూ
పా టవుతుం దటే ?
ఆమనిలో ప్రతి తీగా
మామిడి అగు నటే ?

తీవ మీది ప్రతి మెరువ్వూ
వ్వూవే అగు నటే ?
అందమైన ప్రతి లవమూ
ఆకలి తీర్చునటె ?

# మూగవోయినది వీణ

మూగ వోయినది వీణ !
తీగ తెగిన దేమోనే !
క్రొత్త తీగను బిగించి
శ్రుతి చేయగదే, లలనా !

పాడవలసినవి ఇంకా
పాట లెన్నొ కలవు కదే !
నీ కరముల వీణ లేక
నా కంఠము పలుకు నటే ?

నీ కౌగిటిలో వీణ
నా కౌగిటిలో నీవు
దివ్య రాగ రుచులలోకి
తేలి పోవ వలె కాదే ?

# నీవే నా కొక గేయం

నీవే నా కొక గేయం,
నిను పాడుటయే నా ధ్యేయం !

హంస నడకతో, లేడి పరుగుతో
సింహ ధాటితో, శరవేగముతో
వివిధ లయల, చందముల, రీతుల
విరిసే వాణీ వీణా హృదయం !

ఎట వినగల్గిన అటనే వినబడి
ఎట కనగల్గిన అటనే కనబడి
ఎట కాలసిన అటనే దొరికే
నట దీశ్వర పద నాద తరంగం !

రస పిపాసువుల రాగోద్యానం
జిజ్ఞాసువుల జ్ఞాన సాగరం
శ్రమ సమాలసుల శాంతి మందిరం
జగతి కెల్ల శాంతి నందనం !

# ఎందుకు పాడేను నేను

ఎందుకు పాడేను నేను
ఇంతగ నీ పాటలు ?
రమ్యము లని పాడేను
రస్యము లని పాడేను !

కోకిల గొంతును మలచిన
కుసుమము లని పాడేను !
రాభీ రమణుని పెదవుల
రాధిక లని పాడేను !

మనమున విరిసిన ఊహల
మాధురు లని పాడేను !
శివ చరణోత్పల జీవన
శీధువు లని పాడేను !

# చెప్పా లటురా

చెప్పా లటురా ?
చేత చేయి వేసి, గిల్లి -

నీవే నా దేవుడ వని,
జీవిత పరమేశుడ వని,
నీలోనే తప్ప నాకు
నిశ్శ్రేయసమే లే దని !                || చె ||

నా శరీరమును పుణ్య
శ్రీశైలము గా తీర్చిన
సుందర శివుడవు నీ వని,
సుఖ జీవన నాథుడ వని !                || చె ||

మానస మెల్లను నాకు
మల్లె తోటగా విరియ,
సారాంగము పైన నిన్ను
క్షణ మైనను విడలే నని !                || చె ||

# ఎందుకు నవ్వేదనే

ఎందుకు నవ్వేదనే, బాల ?
ఎవ్వరి గని నవ్వేదనే, బేల ?
నవ్వున నవ్వున జీవన లీల
పువ్వులు పూచే నీ మ్రోల ?

పరమేశుని గని నవ్వుదునే, ఈ
బాధా లోకపు గాధలు చూపి ?
స్వర్గమునే గని నవ్వుదునే, నీ
సన్నిధి సుఖ శాంతులు చూపి ?

మనుజుని గని నవ్వుదునే, ఆతని
మనుగడ చెరకు గడయు కాదని ?
విద్య మాన విద్యావతి గని, న
వ్వెదనే, నీ వలె రాధ కాదని ?

నీ హృదయ చిత్ర ఫలకము పై నా
నిజ రూపము కని నవ్వుదునే ?
ముసుగు లోని ధన మోహము లన్నిటి
పస ఇంతే నని నవ్వేదనే ?

# బాట ఒకటి ఉన్నప్పుడె

బాట ఒకటి ఉన్నప్పుడె
ఆటంకములు,
పాట ఒకటి ఉన్నప్పుడె
ఆట వెలదులు !

తోట ఒకటి ఉన్నప్పుడె
తుమ్మ కంచెలు,
పువ్వు ఒకటి ఉన్నప్పుడె
పుడక బుద్ధులు !

మాట ఒకటి ఉన్నప్పుడె
మౌన వ్రతములు,
మనసు ఒకటి ఉన్నప్పుడె
మంచి చెడ్డలు !

# నా వీణవు నీవు

నా వీణవు నీవు !
నా ఒడిలో నవరసముల-

నా పొడవున విరబారి
నా ఎదలో నినదించి
నా గొంతున అక్షరమౌ
నవ గాయని నీవు !

వేయి తీగ తల్లుల యొడి
విరిసిన పద్మినిలో రమ
ఆడే అడుగుల లయలకు
పాడే రస లక్ష్మి వీవు !

ప్రణయమ్మును ప్రణవముతో
ప్రతి మెట్టున మేళవించి
నాకే శ్రుతి చేసుకొన్న
నాద బ్రాహ్మివి నీవు !

# క్రొత్త పాట పాడుదునా

క్రొత్త పాట పాడుదునా, చెలీ ?
కోర్కె విరిసి కొనలు సాగ-

వేద వన వసంతాలలో
వినిపించిన పాట కంటె
కొత్త యేమి టన్న గాని !
కోకిల అను కొన్న గాని !

కోకిల పాడుట కేనే !
కేకియు ఆడుట కేనే !
ఆటను పాటను కలిపి
ఆనందమునకు మలిపి !

ఏ విరి కా విరి కొత్త
ఏ రుచి కా రుచి కొత్త
ఎప్పటి కప్పుడు కొత్త
ఎవరికి వారే కొత్త !

సత్యము వలె, పులు కడిగిన
ముత్యము వలె అనాదిగా
వాడని సరి కొత్త పాట !
వయ సెరుగని వలపు పాట !

# రాగ రంజిత లోచనా

రాగ రంజిత లోచనా ! ఏ
రాగ మేదో తెలుపవే !
ఎల్ల రాగము లేకమై నా
ఎదను మూగుట నిలుపవే !

ఏది భావము, ఏది రసమో,
ఏది కేవల సదప గరియో,
ఏ మలుపు ఏ కలకు తలుపో,
ఎరుగకే నిను కొలుచు టెటులే ?

రాగ మోహన భోగ తల్పక
రాజ్ఞివై నను మలుచుకోవే !
నన్ను నీ స్వరలయకు మలిచి
నాద రుచు లొలికించు కోవే !

సరస జీవన రాగ వీణా !
సకల రాగ సుధా ప్రవీణా !
నాకు నీలో స్థాన మీవే !
నన్ను నీవై పలుక నీవే !

# నీవు సరస్వతి వైన

నీవు సరస్వతి వైన సమయమున
నీ ఆస్థాన కవిని నేను !
నేను బ్రహ్మనై నప్పుడు నా ఆ
స్థాన గాయనివి నీవు !

కవిగ నేను, గాయనిగా నీవు
భువిని వసించే శుభ ముహూర్తమున
నా కవితా కలశీ సుధ నీవు !
నీ గాన కళా శిల్పిని నేను !

నేను బ్రహ్మగా, నీవు బ్రాహ్మిగా
నిత్య నూత్న పురుష ప్రకృతులమై,
కాలా రూఢులమై విహరించే
వేళ, ఒకటె ఆనందము మనము !

# కోకిలా కోకిలా

కోకిలా ! కోకిలా ! పాడవే !
కోకిలా ! పాడవే ! పాడవే !
నీవు పాడినంత సేపేనే
జీవితం వసంతమౌ నాకు !

ఎండకు ఎండీ, వానకు నానీ
మంచున మాడీ – వాడి కూడా
నిశ్చింతగ బ్రతుకు చుంటి నెటులనే ?
నీ గాన సుధను గ్రోలి కాదే ?

ఒక్క సారి నీ పాటను వినీ
ఉర్వి నెల్ల ఏలవచ్చు స్వేచ్ఛగా !
వేయి భోగములకు నెలవు నా యెద,
విలయ మౌను నీవు కంఠ మెత్తక !

# శంకరా భరణమును

శంక రాభరణమును, నిను
శంకరుని జేసేను -
నాద కన్యతో వేయి పడగల
నాట్య మాడించేను !

ఆహతమును అనాహతమునై
ఆగతమును అనాగతమునై
కాల, కేల, ఇనేందు కందుక
కేళి నడిపించేను

అందముల సంద్రమ్ములో, ఆ
నంద గంగ పదాబ్జ సేవను
ఆత్మ కలశము అంచు మోవగ
అమృత మూరించేను !

# నీ కోసమె ఈ గానం

నీ కోసమె ఈ గానం
నీ కోసమె ఈ గీతం
నీ కోసమె ఈ నా కమ
నీయ కళా సర్వస్వం !

ని న్నారాధించుటకే
ఇన్ని కళల ఆరాధన !
నీ ఆత్మను పొందుటకే
నా ఈ జీవిత తపన !

నీ కరుణ లభించి నపుడు
నా కెందుకు ఈ విద్యలు ?
నీవే నను గొన్న వెనుక
నే నెవ్వరు ప్రత్యేకం ?

# కలువ పూల చెలుల జంట

కలువ పూల చెలుల జంట
కంఠ మెత్తెనే !
వెన్నెలగా పాట విరిసి
మిన్ను లంటెనే !

చల్లని వెన్నెల పాట
ఉల్లము నిండిన పాట
పూర్ణ సుధలు వర్షించి
భువిని తనిపెనే !

రాగ మొలుకు చెందొవలా ?
వాగీశ్వరి కందొవ లవి !
కను సన్నలె సరిగమలై
గాన లక్ష్మి వెలసెనే !

# రోజు రోజు నీ రూపము

రోజు రోజు నీ రూపము
రోజా వలె వికసించు,
రోజాలో నా హృదయము
మోజు తీరక చరించు !

అను నిమిషము నీ గానము
అమృతముగా ప్రవహించు,
అమృతములో నా హృదయము
అంతే లేక క్రీడించు !

ప్రతి నిత్యము నీ అందము
ప్రణయ రుచుల భాసించు,
ప్రణయములో నా హృదయము
పరవశమున సుఖియించు !

# అందమె నా ఆరాధన

అందమె నా ఆరాధన
అందమె నా స్పందన !
అందమె నా శివ భావన
అందమె నా చేతన !

అందమునే గాని నేను
అన్యము గుర్తించను,
అమృత కరుని లోని మచ్చ
అంద హీన మనను ?

బాధలు, బెంగలు, జీవుని
గాథలు, వేదన లన్నీ
అందానికి నీడలె ! నీ
అందమె నా జీవన !

# నవ్వుకొనుచు నీల కమల

నవ్వుకొనుచు నీల కమల
నన్ను చేరినది –
కనులకు తన కనులు కలిపి
కాటుక తీర్చినది !

సుమ జగములు తిరిగి వచ్చి
భ్రమరి పల్కరించినది,
వదనములో వదన ముంచి
వర తిలకము దిద్దినది !

చల్లని చిరు పాటలతో
అల్లరి విరిగాలి పిల్ల
కరముల కరములు గ్రహించి
కమల గంధ మలదినది !

ప్రేమ పందిరే తానై
బింబా లత విరిసినది,
మోవికి తన మోవి గ్రుచ్చి
నీ వేషము తాల్చినది !

# మనం నలుగురం

మనం నలుగురం !
మనం నలుగురం, దేవీ !
సత్య సుందర శివ త్రయి నీతో,
నిత్యానంద సముద్రుడు నాతో !

లక్ష్మి గాత్రమున, వాణి వీణలో,
లలితా మోహను తాండవ మందు
తేజో మహితోపనిష ద్దేవీ
దివ్యహాస ఝరులం, మాధురులం !

భూత భవిష్య ద్వర్తమానములు
మూడు రూపముల నను ప్రేమించే
అమవో, ఉమవో, రమవో నీతో
అన్ని కాలముల విభుడో నాతో !

శివ చరణ చల చ్చంద్ర తారాది
నవ నవోన్మేష నిక్వాణములకు
శ్రుతి రాగ తాళ వాద్య సంగతుల
గతులం, మతులం, రతులం, వ్రతులం !

# సజల జలజ నేత్రా

సజల జలజ నేత్రా !
సంగ తేమిటే ?
మెచ్చిన నీ చేతి గాజె
గుచ్చుకొన్న బాధటే ?

పెంచు కొన్న తోట లోనె
పీడించెనె బంభరము ?
విరిసిన రోజా దరినే
విరిగిన దటె కంటకము ?

కుంద రదన వనుచు నిన్ను
కువలయములె పొగడు చుండ,
రదనము పదవిని పొంది
పెదవి కరుచు కొన్న దటే ?

# సంధ్యా సుందరి

సంధ్యా సుందరి !
శ్యామా జట విరి !
నా జీవన పాత్రకు
నవ కాదంబరి !

అలసిన సూర్యునికి
అరుణోత్పల తల్పం
రాగార్కుని ఒడిలో
రక్తాంబుజ శిల్పం !

తెల్లని సరస్వతి
నల్లని పార్వతి
వరముగ నా కొసగిన
పరమానంద ఝరి !

ఉదయము, సాయంత్రము
ఉజ్వల రస రమయై
నభసీ రంగములో
నాకై నర్తించే -

# ఎవరు ఈ చెలి

ఎవరు ఈ చెలి ? ఎవరు ఆ చెలి ?
ఎవరి కొరకీ అంజలి ?
నేనె ఈ చెలి, నేనె ఆ చెలి,
నీ కొరకె ఈ అంజలి !

ఎవరు ఈ విరి ? ఎవరు ఆ అళి
ఎవరి కొరకీ సుమ వని ?
నేనె ఈ విరి, నేనె ఆ అళి,
నీ కొరకె ఈ సుమ వని !

ఎవరు ఈ మడి ? ఎవరు ఆ గుడి ?
ఎవరి కొరకీ అర్చన ?
నేనె ఈ మడి, నేనె ఆ గుడి,
నీ కొరకె ఈ అర్చన !

# నను లోకానికి బ్రహ్మను చేసిన

నను లోకానికి బ్రహ్మను చేసిన
నా ప్రియ వాణివి నీవు !
నీ గురించియే పాడకున్నచో
రాగము లెందుకు నాకు ?

అవనికి నను నటరాజును జేసిన
హైమ వతివి నీవు !
నీ నీరాజనమునకు కానిచో
ప్రాణము లెందుకు నాకు ?

రత్న గర్భకే రమణుని జేసిన
రాగలక్ష్మి నీవు !
నీ ఆనందము కొరకు కానిచో
ఈ ఉనికే ఎందుకు నాకు ?

# కనుగొన గల వటే

కనుగొన గల వటే ?
కన్ను మూసి తెరచి నన్ను -

నీ వెట నున్నను
నే నట నుందును,
నే నెట నుందునో
నీ వట నుందు వే ?

నేను కలుగు చోట
నిజము పరిమళించు,
పరిమళమును బట్టి
విరిని పట్టగలవే ?

ముళ్లు ఎన్ని ఉంటే
మొగ్గ కంత చలువ,
మొగ్గ లెన్ని ఉంటె
మొక్క కంత విలువ -

వనము నిండ ననలు
ననల నిండ తేనె,
తేనె లోని నన్ను
తెలిసి కొందు వటే ?

# ఎంత వెదకితి

ఎంత వెదకితిని !
ఎంత దవ్వు నడిచితిని !

కనిపించిన ప్రతి కంటా
కన్ను గ్రుచ్చి వెదకితిని !
వినిపించిన ప్రతి గొంతుకు
వీను విచ్చి నడిచితిని !

కువలయ మంతయు వెదకి
గోళాంతరములు నడిచి
ఎందును నీ వగుపించక
ఎంత ఎంత ఏడ్చితిని !

విడిపోయిన క్షణము నుంచి
విశ్వాంచలముల దాకా
గుండెను దోసిట గొని, ప్రతి
గుండె లోకి తొంగి చూచి -

ఇహ మంతా వెదకితిని
పరము దాక నడిచితిని
నన్నెపుడును విడువని నీ
నైజమునే మరచితిని !

# సుఖ మేదీ కష్ట మేది

సుఖ మేదీ, కష్ట మేది ?
సుందర మేదీ ?
పవటికి రేయే లేక
అవతలి దరి యేది ?

కరగ కుండ, కాల కుండ
కాంతి లభించునె ?
కాంతి వెనుక నీడ లేక
శాంతి బ్రతుక గలదే ?

నలుపు తెలుపు గళ్లు లేక
నడుచునె లోక క్రీడ ?
దాగుడు మూతలనే కద
సాగును నీ జాడ !

# సూర్యుని చూచిన కంటికి

సూర్యుని చూచిన కంటికి
చుక్కలు కనబడు నటరా ?
చంద్రుని కౌగిటి ఒడలికి
చందన సుఖ మేమిటిరా ?

పాల సముద్రము మ్రుంగిట
పంట చెరువు లెందుకురా ?
మెరుపు తీగ తోటలలో
మిణుగురు లకు తావటరా ?

నీ కృప కల్గిన నాకు
లోకేశ్వరతయె ఏలర ?
నీ ఆత్మనె గల నేను
నిన్ను పట్టలే నటరా ?

# ఎందు పోతినే

ఎందు పోతినే ?
ఈ నీ సరసనె లేనటె ?

పూచే ప్రతి పువ్వు లోన
పొడిచే ప్రతి ప్రొద్దు లోన
నీవై, నీ తిలకమునై,
నిన్నంటే లేనటే ?

వెన్నెల వెలుగులు ఒలిచి,
వేకువ వలువలు తొడిగి,
వ్యక్తా వ్య క్తముల నడుమ
ఆనందము నీయ నటే ?

విరతి లేక వికసించే
విశ్వ కమలమున నిన్ను
కమలాలయ జేసి, చుట్టు
భ్రమరము నై తిరగ నటే ?

శుభములు, సౌందర్యములు
సుఖములు, సంతోషములు
ఎందెందున విలసిల్లునొ
అందందున నే లే నటె ?

# రోజున కొక సారైనను

రోజున కొక సారైనను నీ ముఖ
రాజము చూడగ నోచుకోనా ?
బ్రతుకున కొక సారైనను నీ యొడి
పరవశ మందగ లేనా ?

రోజున కొక క్షణమైన నీ హృదయ
రాజీవముపై వ్రాలగ లేనా ?
బ్రతుకున కొక పూటైన నీ ప్రణయ
రచనకు మూర్తిని కాలేనా ?

రో జంతా నీ జాజుల తోటల
బ్రతు కంతా నీ గజ్జెల రవళుల
ఆడుచు పాడుచు మసలేనా ?
ఆనందము గొనలేనా ?

# ఎదురు చూచి ఎదురు చూచి

ఎదురు చూచి, ఎదురు చూచి
ఇక రా వనుకొంటిని !
కన్ను లుండగనే నిన్ను
కనలే ననుకొంటిని !

అరవిందముగా విరిసిన
అరుణోదయ మందు నీవు
బైలు దేరితి వని విని
ప్రాణముతో నుంటిని !

మార్గములో చూచితి మను
మలయా నిలముల వార్తలు
కాయజు వహ్నులె కాగా
కాలిపోవు చుంటిని !

జీవిత మంతా నీకై
జీర్ణమైన కానుంటిని !
క్రుంకి పోవకుండగ రవి
గుండెలు పట్టు కొంటిని !

# ఏమ్మై పోతి ననీ

ఏమ్మై పోతి ననీ
ఇంతటి బాధ ?
    ఇంకదు కన్నీరు
    ఎందుకె రాధ ?

నిను విడనాడీ
నిమిషము మనలే నని
    ఎరుగని దాన వటే ?
    పెరుగని దాన వటే ?

పగలూ, రేయీ
పనిలో, తీరికలో
    నిను నడిపించ నటే ?
    నీతో నడవ నటే ?

రూపము కనపడ దని
తాపము తగు నటే ?
    ప్రణయమె విశ్వమునకు
    ప్రాణము కాదటే ?

# ఇద్దరమే

ఇద్దరమే !
మన మిద్దరమే !

సంయోగము, వియోగమో,
సంతోషము, విషాదమో,
పరిరంభము, విరహాగ్నియొ
బ్రతుకే విధి నున్న గాని –

మనసు కున్న స్వేచ్ఛా రతి
తనువుకు లేకున్న గాని,
తనువు కున్న మేర లెంత
దాట రాని వైన గాని –

విరహాగ్నులలో తనువులు
వెలిబూది యె య్యైన గాని,
మనబూది యె విబూదిగా
మహియె శైవ మ్మైన గాని –

మన మనసులు జోడు కట్టి
మబ్బులు మెరుపులు కాగా,
మన తనువులు కలిసి పోయి
మాహేశ్వరమ్మై విరియ –

# కన్నీరు నించితినా

కన్నీరు నించితినా ?
కాదు, కాదు - కృష్ణా
కన్నీ రే మున్నీరై
నన్ను ముంచెరా, కృష్ణా !

ఎవరు నేను ? కేవల మొక
పువు దీవను కాదటరా ?
నాకై కంటక పథములు
దూకి వచ్చు నిను జూచి ? ॥ క ॥

జల బిందువు నగు నన్ను
జలదముగా కౌగిట గొన
చిత్ర విశాఖల క్రింద
చెమ టోడ్చు నిను జూచి ? ॥ క ॥

ఘనత లెల్ల నా కోసము
తృణ మాత్రములుగ వదలి,
గోలోకమె వదలి, నన్ను
కూడి యాడు నిను జూచి ? ॥ క ॥

# తెలుసు కొంటిరా

తెలుసు కొంటిరా !
తెలుసు కొంటిరా, నిజము !

నీవు నాకు ప్రాణమ వని,
నేను నిన్ను విడలే నని,
నీవు నన్ను విడిచినచో
నిమిష మైన మనలే నని !

తోయజ విభు కిరణము లటు
నా యంశలు పదివే లని
ప్రతి అంశా వాహిని కిని
పరమాబ్ధివి నీవే నని !

పాత కొత్త లనునట్టివి
పాథో నిధికి లే వని,
సకల సరస్వతీ హృదయ
చతు రాస్యుడ వీవే నని !

కొండలు గుండెలు తొలిచి,
కొలకుల వలపులు గడిచి,
నిను చేరే ప్రతి బిందువు
తనను తానె చేరుట యని !

# ప్రేమించ గదే

ప్రేమించగదే, తుమ్మెదా !
ప్రేమ మయము విశ్వము సదా !

వనముల పువు లున్నంత కాలము,
మనసుల మధు వున్నంత కాలము,
గోదావరికో, యమునా తటికో
గుండెను తా వున్నంత కాలము !

ఏ సరసున వికసించిన దైనా
హృదయంగమ మేనే – కమల !
ఏ దేశముపై కాసే దైనా
హ్లాదాత్మక మేనే – వెన్నెల !

రోజా పువ్వే గులాబి పువ్వమౌ
రోము నగరమున, ఢిల్లీ తోటల !
మనసు లవేనే ! మమత లవేనే !
మంగళ గౌరీ వ్రతము లవేనే !

కంటకముల గని బెదిరెదవో, లో
కపు మంటలు గని చెదరెదవో ?
ప్రేమ యజ్ఞమున పుడకలె అన్నీ !
నీ మనసే నీ మధు మార్గముగా –

# వలదు వలదు ప్రియతమా

వలదు వలదు ప్రియతమా !
నలుగురిలో ప్రేమ చూప –

నలుగురు నాలుగు తెరగుల
నవ్వుకొందు రేమో మరి !
ఎవరి కంట నిప్పున్నదొ ?
ఎవరి నోట ముప్పున్నదొ ?

నిప్పే కన్నయిన వాడు,
ముప్పును గెల్చిన వాడు,
హైమవతీశ్వరుడు మనకు
ఆప్తు డున్న కారణమున –

ఎంత ప్రేమ యున్న గాని
ఎదలోనె దాచు కొనుము !
ఎద లోతులు, అను భూతులు
ఎరుగని వారుందురు సుమ !

# అందమైన మేఘమాల

అందమైన మేఘమాల
ఆగ్రహించెనా ?
కాళిక వలె నింగి నిండ
కదం త్రొక్కి ఆడెనా ?

శిఖలు రేగి, దిఙ్ముఖముల
ఫెళ్లు ఫెళ్లు మనిపించెన ?
చూపులు రవిశాణము పై
చుర కత్తులు నూరెనా ?

ఉర్వరనే కబళించగ
ఉగ్రముగా గర్జించెన ?
ప్రేమ పూల తోటలపై
పిడుగులతో మొత్తెనా ?

## ఆశ తీర నీ అందము గ్రోలి

ఆశ తీర నీ అందము గ్రోలి
ఆ నందించే వేళ –
అందమేదొ తెలియని లోకము నను
అంధు డన్నదే, బాల !

మమత తీర నీ మనసును గ్రోలి
మైమరచిన వేళ –
మన సెట్టిదొ తెలియని లోకము నను
మత్తు డన్నదే, బాల !

తనివి తీర ప్రేమను గ్రోలి
కను మూసిన వేళ –
ప్రేమ యేమొ తెలియని లోకము నను
పిచ్చివా డనెనె, బాల !

# గుడి నిండా గుడి చుట్టూ

గుడి నిండా గుడి చుట్టూ
గొప్ప గొప్ప దీపాలు !
దివ్యమైన దీపాలు !
దివిని చూపు దీపాలు !

కలువ కంటి ఒక దీపం,
కమల వదన ఒక దీపం,
మెరుపు తీగ ఒక దీపం
మిణుకు తార ఒక దీపం !

లోన అగరు వత్తు లయ్యు
పైన సూర్య దీపాలు !
బైట భోగి మంట లయ్యు
ఇంట గ్రుడ్డి దీపాలు !

దీపాలకు దీప మెవరో
తెలియ లేని దీపాలు !
తెలిసిన కొలదీ నీలో
కలిసి పోవు దీపాలు !

# ఎందు కిన్ని దీపాలు

ఎందు కిన్ని దీపాలు ?
ఎందు కిన్ని పూజలు ?
మనసు లోని మసిని తుడిచి
మనుప లేని కొలువులు ?

వెలిగించిన దీపాలకు
నిలకడ ఏ మాత్రము ?
అర్కాదుల కైన లేదు
అద్దు లేని రాజ్యము !

అఖిల తమస్సులకును నీ
అనురాగ మె మణి దీపము !
నీ కర్పణమైన బ్రతుకె
నిజమౌ నీరాజనము !

# నిను ప్రేమించుట నేరని

నిను ప్రేమించుట నేరని హృదయము
నను ప్రేమించు నట ! కృష్ణా !
బృందావని నెరుగని కన్నులు నా
అందము చూచు నట !

వానకు పోయే మంటి పెల్ల నా
మానస మీదు నట ! కృష్ణా !
వంశీ మానస మధువును గొనకే
వలపులు కురియు నట !

నీ గోధూళితో నిండని ఆత్మకు
రాగోదయము లట ! కృష్ణా !
పాల కడలిలో ఓలలాడకే
పరమా నంద మట !

# వేణు నాదమే రాధా

వేణు నాదమే రాధా
విభుతను సాధించెను,
చక్రధారయే లక్ష్మి
స్వాంతము విరియించెను !

బ్రహ్మత్వమె సరస్వతీ
ప్రాణ వీణ మ్రోయించెను,
పరమేశ్వరతే గిరిజా
పదములు కదిలించెను !

ఏ విలువయు లేని చోట
ఏ వెలుగును లేదు,
ఏ శక్తియు లేని చోట
ఏ ముక్తియు లేదు !

# పూజ కోసము పోయి నప్పుడు

పూజ కోసము పోయి నప్పుడు
పూలనే తీసుకొని పో!
పువ్వులే కావలసి నప్పుడు
పూల తోటకె పో,

పూల తోటకు పోయి నప్పుడు
పూలు మాత్రమె కోసుకో!
ముళ్లు, మోడులు, పురుగు పుట్రలు
కళ్లబడితే తప్పుకో!

నరక బాధల నడుమ నైనా
నాకమునె నిర్మించుకో!
స్వర్గ సుఖముల మునిగి యున్నా
స్వాంతమును గుర్తుంచుకో!

# ఎందుకే విషాదము

ఎందుకే విషాదము ?
ఏమిటి నీ నైరాశ్యము ?

పార్థుని రథమున కొరడా
పట్టి నంత మాత్రాన,
రాధా హృదిలో వేణువు
రాగములను మరచేనా ?

మధురాపురి మణి రాశుల
మధ్య వెలయు చున్నంత,
నీ జటలో కడిమి పూల
సెత్తావులు వదిలేనా ?

ద్వారకలో మేను మరచి
దైవమునై యున్న గాని
వ్రజ భూముల గోగోపి
పద మధూళి మానేనా?

నీ కనులను ముద్దిడి, నిను
నిద్దర పుచ్చక, ఏ నా
డైన నేను నిద్దర పో
యానా ? నీతో లేనా ?

# చెప్పకుండ పోయానని

చెప్పకుండ పోయా నని
చింత పడుదు వటే ?
రాకడ పోకడల కింత
రాద్ధాంతము చెల్లు నటే ?
చెప్పబోయి, చెప్పలేక,
ఒప్పు తప్పితినే యనుము –
మూడు నాళ్ళ ఎడ బాటుకు
ముచ్చెమటలు భావ్య మటే ?

ఇంతప్పటి నుండి నిన్ను
ఎడబాయని మల్లెలను
నా ఎడ బాటున తీసి
నలిపి పోయ న్యాయ మటే ?

దేహముకై దిగు లేలా ?
నీ హృదిలో నే లే నటె ?
అన వరతా నంద లక్ష్మి
పై నా యెద నువు లే వటె ?

# నాకు తెలియ దటే

నాకు తెలియ దటే ?
నీ కన్నుల ఎరుపు కథ ?

నా కన్నుల లోన నీవు
నీ కన్నులు చూచు కొని,
కాటుక ఎక్కడి దో నని
కాక పడుట భావ్య మటే ?

ఎల్ల రేయి నీ కోసము
ఎదురు చూచి, ఎదురు చూచి,
నా కన్నులు చీక టంటి
నల్ల నగుట చిత్ర మటే ?

అమృత కరుని ముఖము నిండ
అంటిన ఆ మసి ఎచటిదె ?
నీలోత్పలముల గాఢ స
మాలింగన తమి కాదే ?

నలుపు లోని ఎరుపే కద
నవ విభాత గాయత్రి ?
గాయత్రిని సేవించిన
సావిత్రికి కోప మటే ?

# ఎవరు మించి పోయిరి నిను

ఎవరు మించి పోయిరి నిను ?
ఎందుకే అసూయ ?
నవ్వ వేలనే ఎదలో
నవ రాగము విరియ !

రాగ సాగరమె నీకు
భోగ తల్పకము కా దటె ?
భోగి భూషణుడె నీకై
యోగ మూర్తి కా డటే

విరిసిన ఏ పువ్వైనా
మెరిసిన ఏ మబ్బైనా
ఉర్వికి రాలే దేసే !
ఉండే దొక నీ వేసే !

# నను చూచే చూపులే

నను చూచే చూపులే
నాకు మనోజ్ఞములు !
నను తలచే మనసులే
నా హృదీశ్వరములు !

నను పిలిచే స్వరములే
నా రాగ లక్ష్ములు !
నను వలచే తనువులే
నా వైశాఖులు !

నను కోరే దే దైనా
నాకు లోక మోహనము !
నాదే యైనది ప్రతిదీ
నా కేవల సుఖము !

# కోప మేలనే

కోప మేలనే -
పాప మేమి చేసితినే ?

మల్లెపూలె పుడుకు మన్న
మాట మరచిపోయి,
సన్నజాజులకును చేయి
చాచి నంత మాత్రాన ?

సరసిజ మటు నీ వదనము
విరిసి యున్న స్నేహముచే,
సరసి లోని పూల తోడ
సరస మాడు మాత్రాన ?

తీవబోణి వగుట వలన
తీవ లెల్ల నీ చెలులని
వేడిన ప్రతి తీవకు నే
నీడనైన మాత్రాన?

నీలో గల ఏ అందమొ
ఏ లవలినొ ప్రతిఫలింప,
మోహము తో నీవే యని
ముద్దు గొన్న మాత్రాన ?

# కోప మేలరా

కోప మేలరా ? నాపై
గోప కుమారా !
సెల వంకల నిన్ను జూచి
వల వంతలు పొంది నంత ? ॥ కో ॥

కన్నుల కాటుక పెదవికి
కాంతి తెచ్చె నన్నంత ?
మల్లెల గాటులతో జా
బిల్లి పైతి వన్నంత ? ॥ కో ॥

నల్ల మద్ది అడవులలో
నడి రేయినె ప్రొద్దు పొడిచి,
కుంకుమమును కన్నులలో
కొట్టు చున్న దన్నంత ? ॥ కో ॥

ప్రాణము వలె చూచు కొనే
ఫలము జేరి ప్రతి చిలుకా
పొడిచి రసము గ్రోల జూచి
వడిసెల చేబట్టి నంత ? ॥ కో ॥

# ఎంత జాణవురా

ఎంత జాణ వురా !
అంతు దొరక వేమిటిరా !

ధూర్తుడ వని ఎరుగక, నే
దూకితి నీ ప్రేమ జలధి !
జలధి శాయి వగుట ముందె
తెలియక పోయెను కదరా !

జగతు లెల్ల నగ్నము లై
జలక మాడు నట నీలో !
సత్యభామ తత్వముతో
సవతి పొగరు నెటు లోర్తుర ?

నేను రమను కాకుండా
నిను విష్ణుని చేయ గలనె ?
రాధ నేను కానేని
బాధ కదా మిగుల నీకు ?

చిరు వానకె గట్లు తెగే
చెరువు లెన్ని యున్న నేమి ?
కోటి నదుల పతి వైనను
కోర దగిన వాడవురా !

# నా మనసే నామాట వినదురా

నా మనసే నామాట వినదురా !
ఏమిటి చేతునురా ?
నెవ్వగతో నే నెండకు చన, అది
నీడకు లాగునురా !

ఒరులకు నీ వగుపించకుండ, నా
ఉల్లములో నిను దాచుకొంటి గద ?
కనులే లాలూచీ పడి జగతికి
నిను జిగేలు మని పించెను కదరా !

మాయలాడి వగు నీతో నా కిక
మాటలు లేవని పంతగించినను,
నా మన సది ఒక క్షణ మైనా నీ
నామ స్మరణము మానదు కదరా !

నాలో గల ప్రతి అణువును కదలి,
నా ఆజ్ఞ లనే కాదని, నీ వట
ఓ యనగా కో యనుచున్నదిరా !
నా యాత్మే నను మన్నించదురా !

# ఉంగరాల ముంగురులా

ఉంగరాల ముంగురులా ?
భృంగ వాహిను లవి !
సరసిజ వదన సదస్సున
సామాజక రసికత లవి !

దరహాస మయూఖలపై
చిరు మబ్బుల చాళు లవి !
ఆనంద కళాలక్ష్మికి
అగరు ధూపము లవి !

దిశ లకు కాటుక దిద్దే
దృ గ్విద్యా తూలిక లవి !
మధురములౌ మీనాక్షుల
మంగళా చరణము లవి !

# నీవన నెవరే, నేనన నెవరే

నీ వన నెవరే, నే నన నెవరే ?
నీవూ, నేనూ ఒక రేనే !
నామ భేదములు, రూప భేదములు
ప్రేమ జలధిలో అలలేనే !

నీవు తీగవా ? పూవును నేను
నీవు పూవువా ? తీగను నేను !
ఎంత తరచినా, ఎంత విరిసినా
ఇహమూ, పరమూ మన మేనే !

నీ దొక దారా ? నా దొక దారా ?
నీ నా దారులు ఒకటేనే !
చెరొక దిశకు పయనించిన గాని
చేరే దొక మధు వనమేనే !

# మాట లాడ గదే

మాట లాడ గదే !
మౌన దీక్ష వీడగదే !

నా లలాట ఫలకముపై
హేలాక్షర మణి మాలా !
నా కర పల్లవ తలమున
శ్రీకర రేఖా లీలా !

నా జీవిత గతి పొడవున
నా గతిలో పద పదమున
నవ వికసిత కల్పకమా !
నవ్య దీప తోరణమా !

వెడలిన నా దారి కొసను
విరిసిన ప్రత్యూష లక్ష్మి !
అలసిన నా గుండె నిండ
అమృతము నింపిన చాంద్రీ !

నా సమాధి వాటికలో
నవ జీవన మధు గీతీ !
మధుగీతికి దీప మిడి
మనిపిన రత్న జ్యోతీ !

# చేతిలోని గులాబీలు

చేతి లోని గులాబీలు
చిరు నవ్వులు చిలుకు చుండ
సరసి లోని కలువలకై
సరదా పడ వటే ?

జడ లోపలి మల్లెలు నిను
జగదీశ్వరినే చేయగ
ముద్దబంతి పూలు చూచి
మోజు పడ వటే ?

ఒక పూవును కోరుట వే
రొక దానిని విడుచు టటే ?
పువు లన్నిటికీ పతియౌ
శివుడే నీవు కాదటే ?

# ఆటే పూవు, పాటే తావి

ఆటే పూవు, పాటే తావి,
ఆట పాటలే తుమ్మెద !
ఆటే భావం, పాటే రాగం,
ఆట పాటలే సౌందర్యం !

ఆటే మెరుము, పాటే ఉరుము,
ఆట పాటలే తొలకరి !
ఆటే సేవ్యం, పాటే కావ్యం
ఆట పాటలే జీవితం !

ఆటే శివుడు, పాటే లక్ష్మి
ఆట పాటలే హైమవతి !
ఆటే నేను, పాటే నీవు
ఆట పాటలే మనం !

# నీవే ఎందుకు కారాదు

నీవే ఎందుకు కారాదు ?
నా జీవిత మధు కలశు లవన్నీ -

ఎవ రది, ఎవ రిది అనుకొనుచు
ఏవో భ్రాంతులలో పడుచు
రజ్జు సర్ప మాయా నిశీధిలో
రగులుట కంటే, రాగశాలిపై ॥ నీ ॥

చంద్ర నిశల విహరించిన మల్లె,
సంధ్య రుచులు పానించిన రోజా,
చైత్ర రథము నడిపించిన పికము,
సకల కళా మధు రస రుచు లన్నీ ॥ నీ ॥

జ్యోతి రీతి, ప్రభ వలె, వైశాఖీ
జ్యోత్స్న వలె, వరగాన లక్ష్మిగా
నాడు, నేడు, ఏనాడును నిత్యా
నంద ఝరివి – నా ఆత్మ సుందరివి ॥ నీ ॥

కా ననుకొంటే – ఏదియు కావు,
ఔ ననుకొంటే – అన్నియు నీవే !
ఆది అంతములు లేని నా హృదయ
అమృత శయ్యపై పరమానందము ॥ నీ ॥

# నవ్వ గదవె నా రాణీ

నవ్వ గదవె, నా రాణీ !
నాపై కోపము మాని !

చిరునవ్వులె పువ్వులుగా
స్నేహమే వసంతముగా
విరిసిన దానవు కావే !
విరసము నీ కెందులకే ?

నీ కోపము నా మీదికి
నీలి మబ్బులను తోలగ
ఉరుములతో, మెరుములతో
ఉల్లము గజ గజ లాడెనె !

కోపములకు తాపములకు
కోటి సమయములు లే వటె ?
ప్రేమామృత కలశిని నా
పెదవి కిడున దిం కెపుడే ?

నవ్వులు మాత్రమె నీకు
నైసర్గిక భూషణములు,
చిర చిరలను తొలగించి
విర విరలను తాల్చగదే !

# అందాలు అందుకో

అందాలు అందుకో
అందిన నిమిషమే !
అందుకొని దాచుకో
ఆ క్షణమే !

అందాలు గులాబీలు
అతి మార్దవ మధురాలు,
అందు కొన్నా, కొన కున్నా
అవనికి రాలు !

చిన్న చిన్న మొగ్గ లనీ
చిదుము కొన పెరచేవో ?
చిరు చిరు మోక్షాలే
చిదానంద రూపాలు !

అందాలు అందుకో !
అందుకొని దాచుకో !
నిండిన హృదయముతో
నింగినె యేలుకో !

# ఎంత మాయ లాడవురా

ఎంత మాయ లాడవురా !
ఈశ్వరుడవె యౌదువురా !

అంత లోనె ఏడ్పింతువు !
అంత లోనె నవ్వింతువు !
సంతోష విషాద బాష్ప
సాగరమున క్రీడింతువు !

వలచి వచ్చు ప్రాణాలతో
చెలగాటము లాడెదవు !
చచ్చినంత సుఖ మొసగి
స్వర్గమునే చూపెదవు !

బ్రతికిన నీ తొడ పైనే
బ్రతుక వలయు ననిపింతువు !
చచ్చిన నీ ఒడి లోనే
చావవలయు ననిపింతువు !

చల్లని శశివో, నిప్పులు
చల్లే రవివో నీవు ?
నా కడనా నీ మాయలు ?
నీ కళనే కాదటరా ?

# నిను వలచి వనలక్ష్మి

నిను వలచి వన లక్ష్మి
నన దేరెరా !
నన లెల్ల నిను జూచి
నగు మోము లయ్యెరా !

నీ రాక గను దాక
నీరవ నిశీథమే
ఉర్వియే నిను జేరి
ఉత్పల మ్మాయెరా !

మబ్బు ముసుగులు విడిచి
మమతలై, రమతలై
తారలే నీ చుట్టు
రే రాణు లైరిరా !

కాంక్ష లన్నియు విరిసి
కామ పూర్ణిమ కాగ,
గుండె లన్నియు పొంగి
గోలోక మంటెరా !

తను వెల్ల తాళమ్మై
మన సెల్ల రాగమ్మై
నిను పొంది వనలక్ష్మి
నీ లక్ష్మి అయ్యెరా !

# సంతృప్తియె లేదటరా

సంతృప్తియె లే దటరా ?
సర్వ నదీ హృదయేశ్వర !

ధారా పాతముగ మేటి
ధారా ధరములె కురిసి,
ధారుణినే ముంచి, నిన్ను
ఆరాధించిన గాని –

ఇరుగు పొరుగులను చించి,
ఇరు కెలంకులను త్రుంచి,
పొంగి, నింగి నంటి, వరద
గంగే నీదైన గాని –

వాన చినుకు మొదలు మహా
వాహిని వరకును సర్వము
నిను వలచే యున్న గాని
నిను పొందే యున్న గాని –

# ఇదే కుసుమ కాలం

ఇదే కుసుమ కాలం
ఇదే సుభగ శీలం,
మొన లెత్తిన రమత పైని
నన లెత్తిన ప్రాయముతో !

ఇదే మధూదయం
ఇదే సుధాలయం,
నలు పెరుగని తలపులతో
అల పెరుగని వలపులతో !

ఇదే తరుణ మాసం
ఇదే అరుణ హాసం
భోగమయ స్వర్గానికి
రాగ ప్రియ నిశ్రేణితో !

# ప్రేమింపుము అందరినీ

ప్రేమింపుము అందరినీ నీవు
ప్రేమింతునులే నిను నేను !
రాధే నీ యెదలో లేదని
రాలి పోవె బ్రహ్మాండము లన్నీ ?

సేవింపుము అందరినీ నీవు
సేవింతునులే నిను నేను !
రమయే నీ పదముల లేదని
రాత్రి గడచునే ప్రాణి కోటికి ?

పాలింపుము అందరినీ నీవు
పాలింతునులే నిను నేను !
సత్యయె నీ సరసన లేదని
జగతికి దీపము లేవీ ?

# ఎన్ని సారు లన్నానురా

ఎన్ని సారు లన్నానురా ?
హృదయేశ్వర ! నీవే నే నని -

ఆనందము కలిగిన మైకములో
అప్పు డప్పు డేదో అన్నా నేమో,
ఎంత లోతులో రత్నము లైనా
ఎగసి రావటర భూకంపనలో ?

పర సుఖాలు ఆత్మా రము కేనా ?
వాగీశ్వరియును పాలు కోరదా ?
క్షణము క్షణము నీవే నే నని నా
అణువు అణువు యెలుగెత్తి చాటురా !

నాలో ప్రతి జీవాణువు నిన్నే
మేళవించుకొని పాడుచున్నది -
సర్వాణు కంఠ సమ్మేళన ఒక
సారైనను ప్రకటము కాదటరా ?

త్వమే వాహ మని ఎంత జపించిన
తనివి లేదురా, జీవితేశ్వరా !
ఎన్ని ఎన్ని ఎన్ని సారులైనా
నీవే నే నని అనవలతునురా !

భీమన్న

# రాభీలు

మూడవ భాగం

## ఎచటి కేగు చుంటి నేను

ఎచటి కేగు చుంటి నేను
ఎందుకు కన్నీరు ?
కంట కుంకుమము పడెనను
కల్ల లెవరు నమ్మేరు ?

ఈ వియోగ మెన్నాళ్ళని
ఈ పెదవుల అదరు ?
సున్న మెక్కువైన దన్న
సూచన లెవ రడిగేరు ?

ఎంత తడవు చేతునో యని
ఎందు కంత కంగారు ?
ఉక్కపోత నభినయించు
ఊర్పుల నెవ రెరుగరు ?

# అంతరాళ మహార్ణవములో

అంతరాళ మహార్ణవములో
అహో భామ విహార నౌక
చండ వేగము తోడ చీకటి
కొండ కొమ్మును తాకెను !

కొండ కొమ్మును తాకి నౌక
గుండె పగిలి బుడుంగు మనగా,
నెత్రు మడుగుల నీత గొట్టుచు
నిశా రమ గర్జించెను !

నిశా రమ ఎక్కిన మహారథ
దిశా చక్రము కన్ను గానక
ప్రా క్కవాటమ్మునకు ఢీ కొని
భగ్గు భగ్గున మండెను !

స్వామి హృదయ స్వామ్యమునకై
చత్తు రీగతి అహర్నిశలు,
కోటి మంది ఉషస్సులకు అట
చోటు కలదని తెలియరు !

# ఉన్నదీ

ఉన్నదీ !
మనసున నా కొక కోరిక !

మహితమైన మరుమెట్టుకు
మానవతను నడపా లని,
మానవతకు లోకాలను
మలచా లని ఉన్నది !

చావు వెనుక బ్రతుకును ప్రతి
జీవికి చూపించా లని,
సూర్య రథము త్రిప్పి గతము
చూడా లని ఉన్నది !

అందరకును సరిసమముగ
ఆనందము పంచా లని,
పరమానందమె నేనై
విరియాలని ఉన్నది !

ఏ దుఃఖము లేని స్థితికి
ఎల్ల జగము చేర్చా లని,
ప్రజ్ఞాన బ్రహ్మనుగా
బ్రతకా లని ఉన్నది !

# పూలు పూయును తలపు తోటల

పూలు పూయును తలపు తోటల
ముళ్లు విరుగును బ్రతుకు బాటల
    కరకు సీదర డొంకలకు ఈ
    కనక చేలము లెందుకో!

మృగములను తిను కేసరికి మృగ
రాజ బిరుదము లెందుకో!
    వేడి నెత్తురు త్రావు కత్తికి
    వీర స్వర్గము లెందుకో!

లోక హితముగ వెలుగు దివ్వెకు
చీకటుల చెర లెందుకో!
    దివ్వె తన పొగ నడుమ తానే
    దీను రాలగు టెందుకో!

సృష్టి సృష్టికి నడుమ తోచక
స్రష్ట గీచిన పిచ్చి గీతలు
    ఆక లాక లటంచు సృష్టినె
    ఆహరించుట యెందుకో!

# భారత భూ లక్ష్మి

భారత భూ లక్ష్మి !
ప్రాణ ధర్మ ధన లక్ష్మీ !

అవని కెల్ల అన్న మిడే
అన్నపూర్ణ వమ్మా !
నీ పంచను ఇంత మంది
నిరుపేద లటమ్మా ?

ధర్మ మిలకు బోధించే
ధర్మ తల్లి వమ్మా !
ఇంత మంది అస్పృశ్యులు
ఎట్లు పుట్టి రమ్మా ?

రాముల భీములను గన్న
రాజ మాత వమ్మా !
దేశి విదేశీ దాస్యము
దేనికి ఫల మమ్మా ?

ఆత్మేశ్వర మూర్తి వైన
ఆది శక్తి వమ్మా !
స్వార్థ పరుల జట్టు వీడి
జనుల బ్రోవ వమ్మా !

# అది గదిగో కాహళి

అది గదిగో కాహళి !
ఆహవ జయ కాహళి !
ఖడ్గ ధారి క మ్మన్నది
కదన కుతూహలి !

తల్లి నేల ఎల్ల లపై
కల్లెము తెగె నన్నది,
కృష్ణ విజయ రథ జవమున
కృత హస్తులు లె మ్మన్నది !

పౌరుష మొకటే మనిషికి
ప్రాణ బిందు వన్నది,
తల్లిని కాపాడ లేని
తనువు లెందు కన్నది !

ఈశాన్యమొ, వాయవ్యమొ,
ఆకాశమొ, ఆర్ణవమో,
దుష్ట శక్తు లెట నున్నను
తుడిచిపెట్టి రమ్మన్నది !

# ఇంత బేలవా

ఇంత బేలవా !
అంత రంగ మెరుగవా ?

ప్రొద్దుగ నను దిద్దిన నీ
ముద్దు మోము వాడ నేల ?
కలువ తోడికోడలు నిను
గని నవ్వవె , కమలా !

మదనుని బాణమవు, శివుని
మతి త్రిప్పిన మొనగత్తెవు !
రమకు మందిరమవు, నలువ
రాణికి యోగాసనమవు !

నే నెచటికి పోవుచుంటి ?
నీ యెదనే పండు కొంటి ?
కానా నీలో చూపు ?
రానా మళ్ళీ రేపు ?

# పోటీ పడి నీ పదములు

పోటీ పడి నీ పదములు
పూజింతునురా !
అంద మైన దెల్ల నీకె
అర్పింతును రా !

మంచి మంచి పువ్వులలో
మధురమైన ఫలములలో
అనురాగము నింపి, నీకు
ఆరగింపు చేతును రా !

నా చెవులకు కమలములై
నీ చరణాబ్జములు వెలుగ
నిను శిరమున దాల్చి నేనె
ఇన చంద్రిక నౌదును రా !

వెన్నెలలో స్నానమాడి
నన్ను నేనె దోసిట గొని
హారతి పళ్లెమున నీకు
నీరాజన మౌదునురా !

నీవు ఎదుట నున్నప్పుడు
నీవే నా లోకముగా,
నీవు ఎదుట లేనప్పుడు
నేనే నీ లోకముగా !

# ఎవరి తల్లి ఎవరి కొను

ఎవరి తల్లి ఎవరి కొను ?
ఎద లోపల నిల్పుకో !
ధీరముగా నిల్చి, ధర్మ
వీరముతో కొల్చుకో !

విను వీధులె గెల్చి తిరుగు
విహగమ్మైన గాని
గూటిని కాపాడుకొనక
దాట గలదె హాని ?

పాంచాలీ ప్రణయ కలశి
పరమ శివుని పాశుపతము
అస్త్ర ధారికే గాక
అన్యుల కెటు లభియించు ?

చక్రధారి యైన వాడె
సారధి కాగలడు,
చేత విల్లు కలవాడే
గీత నందు కోగలడు !

# కల కల లాడే నింగిని

కల కల లాడే నింగిని
ఘనా ఘనము క్రమ్మెనే !
తెలి తామర కొంకులు అం
చులు పొర్లగ నిండెనే !

గట్ల పైని గల కాటుక
పిట్టలు బెదరి చెదరెనే !
తెలి దామర లంతట చెం
గలువలుగా మారెనే !

కట్టలు తెగిపోయి గుండె
కన్నీరై ప్రవహించెనె !
ధూమవేణి రాక్షస గొం
తుకె బొంగురు పోయెనే !

# ఉదయం నీ రూపం

ఉదయం నీ రూపం
ఉత్ఫుల్ల సరోజం
సాయంత్రం నీ రూపం
సంధ్యాగరు దీపం !

నా సన్నిధిలో నీవు
నవ వసంత వధువు !
నా పరోక్షమున నీవు !
నందన వన మధువు !

నీవు వచ్చు పథం
జీవిత పరమార్థం,
నీవు పోవు మార్గం
నిఖిల జగ జ్జయం !

# వెళ్లి రావోయి

వెళ్లి రావోయీ !
వేగమే రావోయి !

త్రోవ పొడవున మల్లె
పూవు లై వికసించి
నా వలపులే నిన్ను
సేవించు లే వోయి !

మనసు నిండా మంచి
మాటలై, పాటలై
నే చేయు పూజలే
నిను నడుపు లే వోయి !

విధు లెన్నొ కలుగు జీ
విత మందు, పగటి తో
రేయి ఉండుట నైజ
రీతియే లే వోయి !

రాత్రు లందును నీతొ
రాస లీలలు నెరప
నా కలలె తారలై
నన లెత్తు లే వోయి !

# దేశ మాత భూ మాత

దేశ మాత, భూ మాత
తేజ మొసగు గో మాత
అసలు మాత కంటె ముందు
ఆరాధ్యలు, జన సుతా !

గోమాతను పోషించగ
భూమాతను సేవించగ
దేశ మాత స్వాతంత్ర్యమె
దిక్కు కదర, సోదరా !

మాత ఋణము తీర్చుకొన
జాతిని రక్షింప వలె,
సకల ప్రజల సంక్షేమమె
జాతి రక్ష, ప్రియతమా !

ప్రజ లనగా ఎవ రోయీ ?
పైస లున్న పది మందా ?
హలముల, కలముల నడుమ
అన్నార్థులురా, వీరా !

# ప్రపంచ శాంతికి మార్గం

ప్రపంచ శాంతికి మార్గం – ఒక
పౌరుష జీవిత మే నోయ్ !
పిరికి గొర్రె లున్నంత కాలము
పెద్ద పులులదే రాజ్య మోయ్ !

కర్ర చేత లేనప్పుడు –
గొర్రె కూడ కరిచే నోయ్ !
పేద గుండెతో బెదిరితే
పిచ్చుకయును తల దన్ను నోయ్ !

కన్నున కన్నూ, కత్తిని కత్తీ
కలిపిన నాడే సంధి కుదురు నోయ్ !
సమ ఉజ్జీగా సరు లున్నపుడే
సత్యా హింసలు బ్రతుకు నోయ్ !

# ఇది బొమ్మల కొలువు కదె

ఇది బొమ్మల కొలువు కదే ?
ఇల నాకే మున్నదే ?
బొమ్మలతో ఆడు కొనే
బుడుత డటే మానవుడు ?

రంగు రంగులవి య్యైనా
రత్న శలాకలె అయినా
ప్రతిభ లేని ప్రతిములు నీ
ప్రతి నిధు లగుదు రటే ?

సీమ నుంచి వచ్చిన ఈ
చిలుకకు గురు పీఠ మటే ?
భూమి నుంచి త్రవ్విన ఈ
బొమికకు దేవళము లటే ?

మృత్యువు తిని ఉమిసిన ఈ
మృత్తికకు నివాళు లటే ?
పాంచ జన్య పరమాత్మకు
ప్రతినిధి సత్తగుల్లటే ?

ఏది నీ దయా వీక్షణ ?
ఏవి నీ దర స్మితములు ?
ఎంతటి కళ లైనను నీ
యంతటి వౌ నటే ?

# ఎందుకు నాకీ డెందము కలుగని

ఎందుకు నాకీ డెందము కలుగని
క్రోటను మొక్కల కోట ?
దయ చేయుము నీ దయ కల్గినచో
చా లొక గులాబి తోట !

క్షణ మాత్రములో సమసి పోవు పు
వ్వును కోరుచుంటి నని నవ్వకు మా !
ఉడు పతియును నీ జడ పువ్వే కద ?
నీర జాప్తుడే నిప్పు కద ?

పుట్టిన తదుపరి గిట్టని దేది,
రగిలి బూదిగా రాలని దేది ?
నాకై పూచి, నాకై వేచి,
నను రంజించే ననయే నాది !

శాశ్వతత్వముకు సరి హద్దేమి ?
పువ్వుకు క్షణమే పూర్ణ జీవితము,
వద్దు నాకు పైపై మెరుగులు
డెంద మున్న దొక అందమె చాలు !

# ఎవరు తండ్రీ

ఎవరు తండ్రీ ?
ఎవరు తండ్రీ ?

దేశ దాస్యము తుడిచి జాతికి
తేజ మొసగిన దెవరు తండ్రీ ?

మనిషి మనిషికి మధ్య లేచిన
మట్టి గోడలు కూల్చి వైచి
ఐక మత్యపు కోట గట్టిన
లోక బాంధవు డెవరు తండ్రీ ?

పతిత జనముల, పేద జగముల
గతులు మార్చిన దెవరు తండ్రీ,
జగతి కంతకు శాంతి, సత్యం
ప్రగతి చూపిన దెవరు తండ్రీ ?

అంద మనగా అమృతమే నని
అమృత మనగా త్యాగమే నని
మానవునికి కిరీట మొసగి
మాధవుని జేసిన మహాత్ముడు ?

# జయ జయ అంబేద్కరా

జయ జయ అంబేద్కరా
జయ భారత భాస్కర !

నవ భారత సంవిధాన
ధర్మ పథక నిర్మాతా !
భువి సమస్త పీడిత జన
దుఃఖశాంతి తథాగతా !

అస్పృశ్యత రూపుమాపి,
అగ్ర అంత్య భేద ముడిపి,
నిష్కల భారత జాతికి
నీడ యైన బోధి ప్రియ !

అంధకారమున పుట్టి,
అవనికి దీపము పెట్టి,
పంకమును మధించి మహికి
పరిమళ మొసగిన సూరీ !

రాళ్ళకు జీవము పోసి,
మోళ్ళను చిగురింప జేసి,
మట్టి నుండి మానవులను
మలిచిన కారణ జన్మా !

# తెలుసుకో

తెలుసుకో !
ఇలపై మనిషికి అర్థం – తెలుసుకో !

బ్రతుకుట ఒక్కటి జీవికి
ప్రథమ ధర్మ మని,
జీవ కోటిలో మనిషిది
చివరి కొమ్మ అనీ –

వేసి నప్పుడే ఆకలి
వేటాడును సింహమని,
అడ్డు వచ్చు మిత్రు నేని
హత్య చేయు మని షని –

తోకలు, కోరలు జీవికి
తోడు నీడ లని,
మనిషికి మెద డొక్కటే
మార్గ దర్శక మని –

మనిషిగ జీవించుటకు
మంచితనమె చాల దని
ఆత్మ బలము లేని బ్రతుకు
అంధకార మయ మని –

# ఏది హిందూ

ఏది హిందూ ? ఏది ముస్లిం ?
ఏది క్రైస్తవము ?
ఎల్ల మతముల సార మొకటే
హృదయమే మతము !

కృష్ణుడో, క్రైస్తో, మహమ్మదో
గీతయో, బైబిలో, ఖురానో
ప్రేమనే బోధించ లేదా ?
ద్వేషమును నిరసించె కాదా !

తూర్పు పడమర భేద మేలా ?
తోట కెల్ల వసంతు డొకడే !
కరము లెవ రెటు మోడ్చి పిలిచిన
ఖంగు మను గుడి గంట ఒకటే !

# మారాలి

మారాలి -
మనిషి మారాలి !

మనిషికి మనిషికి నడుమ
మంథరాలు తిరగాలి,
ద్వేషాగ్నులు చల్లారి
ప్రేమ సుధలు ఊరాలి !

తోడి వాని శ్రమ ఫలమును
దోచుకొనుట తొలగాలి,
పనీ, తీరికా, వేడుక
ప్రతి మనిషికి కలగాలి !

పొట్ట కూటికై మనిషి
పోరాటం ఆపాలి,
ప్రజ లందరి ఆనందమె
ప్రగతికి గురి కావాలి !

పేదవాని కుండలలో
వేద మధువు నిండాలి,
వేద మాత గుండెలలో
విశ్వ జనత పండాలి !

# కదలి పోతిమి దూర దూరాలకు

కదలి పోతిమి దూర దూరాలకు,
కర్తవ్యముల తీర తీరాలకు !

అటు నీవు, ఇటు నేను
అశ్రు నయనాలతో,
వెను దిరిగి, వెను దిరిగి
వీక్షించు కొనుచు –

కరడు కట్టిన–నీ
కన్నీరె నభముగా,
అలమ టించెడి–నా
అశ్రువులె జలధిగా –

కాలమే పక్వమై
కరుణమే విజయమై
మన గతుల కొస లొక్క
మధువులో ముడి పడగ –

నీవు నన్నెద దాల్చి,
నేను నిన్నెద దాల్చి,
బరువుగా, బాధగా
పరమేశు ఆజ్ఞగా –

# వేగం వేగం వేగం

వేగం వేగం వేగం –
వేగ మొకటె జీవిత భోగం !

రాగ భోగముల, రణ రంగముల,
రాజ మార్గముల, రోదసుల,
వివిధ ధర్మముల, విద్యల, వేడ్కల
వేగవంతమే ఫలవంతం !

కాలాహులె జాలీసులుగా, బొం
గరములు త్రిప్పేదే వేగం !
బొంగరాల తోరణాల రథములు
నింగిని నడిపేదే వేగం !

ఉగ్ర లలిత సమ విషమ విశేషో
దగ్ర రూప విశ్వాత్మయె వేగం !
వేగమె పరమానంద తరంగం !
వేగమె విజయ శ్రీ రంగం !

# మనసు కలచుకోకుమా

మనసు కలచు కోకుమా !
మరు నా డేమగునో యని -

మల్లె మొగ్గ వలె విరిసి
మాపటికే రాలునో ?
రే రాజుగ సుధ లొలుకుచు
రేపటి వర కుండునో ?

మధు మాస మనోజ్ఞముగా
మహినే స్వర్గము చేయునో ?
హారతిలో కప్పురమ్మై
ఆనంద బ్రహ్మ యౌనో ?

గోదావరి వరదలపై
గో లోకము నంటునో ?
ఉడు లోకము లెల్ల గెల్చి
పుడమి పైకి ఉరుకునో ?

అణు చరిత్రకే అందని
తృణ జలూక గతిని గొనునో ?
కృష్ణ గీత గ్రోలి, ప్రేమ
తృష్ణలో నిను నను తేల్చునో ?

# నీ మనసే

నీ మనసే –
నా జీవిత మధు మాసం !

చీకటిలో వెన్నెలగా,
వెన్నెలలో లే యెండగ,
లేయెండను పద్మినిగా
విరిసి నన్ను మురిపించే –

వేసవిలో మావులుగా,
మావులలో కోయిలగా,
కోయిలలో సంజీవిగ
విరిసి నన్ను మురిపించే –

కా రడవిని రహదారిగ,
దారి నిండ వీరముగా,
వీరములో విజయముగా
విరిసి నన్ను మురిపించే –

నా బ్రతుకున అడుగడుగున
నలినములను పూయించుచు,
నిరతానంద శ్రీగా
విరిసి నన్ను మురిపించే –

# బ్రతుకు నిండుగ లోక

బ్రతుకు నిండుగ లోక
భారాలు నింపు కొని
తెగియించి నా పడవ
తెరచాప విడిచినది !
కారు మబ్బుల దాడులో ? స్వామీ !
కమలినీ స్వాగతములో ?

రాగాలతో మనసు
మేఘాలపై నిల్పి
వేగాలు మూగిగా
ఓఘాలు పడి తరుము !
అనుకూల పవన మేనా ? స్వామీ !
ఆత్మలో దీపమేనా !

రంయి మని తిరుగు ఈ
రాకెట్ విమానాల
నీడలో నా జాడ
నేలపై ఎటు నిల్చు ?
రెక్కలను కట్టు కోనా ? స్వామీ !
రెక్కలకు మళ్లు కోనా ?

# ఎచటి కోయి బైలు దేరితివి

ఎచటి కోయి బైలు దేరితివి ?
ఏ జగాలు గెలువ గోరితివి ?

నీ మకుటము నిర్మల తా
రా మండల మండితము !
నీ పదాలు వన వికసిత
నీ లోత్పల పూజితాలు !

నీ అభ్యుదయము దైనం
దిన శుక్ల సుధా కరము !
నీ వదనము వైశాఖీ
జీవన మధు చుంబితము !

నీ యాక్షలు ఆనంద
స్థాయీ తాదాత్మ్యములు
నీ రాకలె శ్రీ లక్ష్మీ
నీరాజన భాగ్యములు !

నీ రూపము గగనాలయ
మేరు శిఖర సుందరము !
నీ కరుణము విశ్వోదయ
నిఖి లైశ్వర్యము !

# మాటే సౌహార్దం

మాటే సౌహార్దం !
మనసే సౌందర్యం !
మాటా మనసూ ఉంటే
మధురం జీవితం !

మాటే రాకుంటే
మైత్రి చాల దూరం !
మనసే లేకుంటే
మనుగడయే భారం !

మనిషిని మనిషిని కలిపే
మనసే ఉషస్సు –
మనసును మనసును కలిపే
మాటే శ్రేయస్సు !

మాట చెలిమి కలిగి
మనసు కలిమి వెలిగి
మనిషి మెలిగి నంత –
మధువే జగ మంత !

# ఇంత దూరమా

ఇంత దూరమా ?
మన ఇరువురికిని నడుమ -

ఆకాశ స్వామి వీవు
అవనీ కాంతను నేను,
నిత్యము నీ నీడలనే
నే వసించి యున్న గాని -

రత్న గిరులు పులకింప
రస ధునులే ప్రవహింప
గాఢముగా నీ కౌగిట
కరిగి పోవుచున్న గాని -

అంగ రాగములు చెదరి
హారాదులు చిక్కు పడి
నా మేనును మరచి నేనె
నీ మేనై యున్న గాని -

మేనులు కూడా పోయి
మానసములు ఒకటే అయి
అమృత రసాద్వైతములో
ఆత్మ మిగిలి యున్న గాని -

# ఎచ్చటనో నే చూచినవే

ఎచ్చటనో నే చూచినవే !
ఎచ్చటికో నను పిల్చినవే !

ఆ మెడ మెరవు
ఆ జడ ఒరవు
మెడ పై జడలో
విడిగే విరులు –

మెరిసే నడుము
విరిసే వెన్ను
విస్తరిలో ఆ
వెన్నెల విందులు –

కప్పురపు టనటి
కవల కంబముల
మక్కువ తీర్చే
మణి గోపురములు –

మువ్వల, తామర
పువ్వల నవ్వులు,
నవ్వుల నడుమ
నలిగే హంసలు –

# మరచి పోతినె

మరచి పోతినె, మానినీ!
గురుతులే దొక విషయ మేని -

బాట పొడవున మాట పెగలని
తీగ లేమో తెలుపు చున్నవి,
బాధతో చిర గాథ లేవో
మలుపు మలుపున నిలుపు చున్నవి ! ॥ మర ॥

గట్ల వెంబడి గడ్డి పువ్వులు
అడుగులకు మడుగు లిడు చున్నవి,
వెలిసి పోయిన వలపు లేవో
తలపు టంచులు తాకు చున్నవి ! ॥ మర ॥

కొమ్మ లందలి కువ కువలలో
సరసు లందలి విరవిరలలో
రస్య మానము రాగ మేదో ?
ధ్వన్య మానము ధర్మ మేదో ! ॥ మర ॥

పాట యేదో మీటి పోవును,
అందమేదో ఆపి పోవును,
గడిచి పోయిన దెల్ల కలగా
తుడిచి పోసిన నీ కవుంగిట ! ॥ మర ॥

# దూరములో ప్రతి పువ్వూ

దూరములో ప్రతి పువ్వూ
నీ రూపమె చూపు !
నీ వనుకొని చేరగనే
నిప్పులు చెరగు !

కొమ్మలలో ప్రతి పికమూ
గుస గుస లాడును నీతో !
దొరికితి వని చేరగనే
ధుమ ధుమ లాడు !

మేఘములో ప్రతి నెమలీ
మెరుపు కన్నె తానే యగు !
ఉన్నావని చేరగనే
ఉరుములు కురియు !

ప్రాయములో ప్రతి ప్రాణీ
నీ యునికినె తెలుపు !
మే లనుకొని చేరగనే
హేళన చేయు !

# చూడా లను కొన్నంతనె

చూడా లను కొన్నంతనె నిన్ను
చూడలేని నా కన్నుల కంటే –
కను తెరువగనే కాంతుని జూచే
కములములే ధన్యములు !

పాడా లను కొన్నంతనె నీకై
పాడలేని నా గొంతుక కంటే –
గొంతెత్తగనే మధువులు కురిసే
కోయిలలే మహితములు !

కావా లను కొన్నంతనె నీలో
కలువ లేని నా కాయము కంటే –
అను నిమిషము నీ అభిరతి పొందే
హంసలే దివ్యములు !

# జీవిత మన నేమిటే

జీవిత మన నేమిటే
జీవన సుందరీ ?
మధువు మాత్రమే నటే
మంగళ గౌరీ !

ముళ్లు లేని గులాబీ
మొగ్గ కలదటే ?
వెలుగు వెనుక మబ్బు లేని
తొలకరి కలదటే ?

భగ్న హృదయుల ఉవాచలు
భయము గొల్పు చున్న వటే ?
నిరాశాహతుల నీడలు
నిజము దాచు చున్న వటే ?

తన కలలే అలలుగా
తన లక్ష్యమె మోక్షముగా
పరువముతో ఉరక లిడే
చిరు వాగును చూడ వటే ?

సరసులతో ఆగి పోక
నెరదలలో ఇంకి పోక
శరధిని చేరుటె జీవన
పరమావధి కదే ?

# ఏది శాశ్వత మట

ఏది శాశ్వత మట ?
ఎందుకు మరి దుఃఖించుట ?
పంచదార పలుకే కద
పాలలో లయించుట ?

రాలి పోవునది పూవే,
సోలి పోవునది ప్రాణమె,
పగిలి పోవునది గుండెయె,
బండ కేమి తెగులట !

సౌదామిని జీవిత మొకక
క్షణ మైనను లోటేమి ?
ఎట్టెడారి మను గడవే
యేండ్లైనను ఫల మేమి ?

# వింతైనది లోక మని

వింతైనది లోక మని
చింత పడుదు వటే ?

గొంగళి పురుగును సీతా
కోక చిలుకగా మార్చే,
పారిజాత సుమమును ఒక
సారికె సేలకు రాల్చే -

నిప్పుల కుంపటిని పగటి
నెత్తి మీద మండించే,
శీతల మధు విధు కలశిని
చీకటి పా లొనరించే -

రాగ మృదుల హృదయులకు
త్యాగములను విధియించే
వ్యర్థాలస జీవులకే
వైభవములు కరుణించే -

# ఎవరు నిన్ను రక్షింతురు

ఎవరు నిన్ను రక్షింతురు
ఎందుకు భిక్షాటన ?
నీ కంటే ఘను లెవ్వరు ?
నీకు నీవె రక్షణ !

నీ ఆత్మకు నీ మనసు
నీ మనసుకు నీ బ్రతుకు
కంచు కోటలై యుంటే
కత్తులు నిను తాకునా ?

కోటలు కాపాడు కొనగ
కోరికలను తీర్చు కొనగ
అణు బాంబుల కాలములో
అశ్రు బలము చాలున ?

చేయి చాచి యాచించిన
స్వేచ్ఛ లభించున ?
భిక్ష మిడిన లవములతో
కుక్షి నిండున ?

# ఆర్యభూమి సూర్య భూమి

ఆర్యభూమి, సూర్యభూమి
వీర్య భూమి రా, మనది !
అంధకారమును గని, వెన
కడుగు వేయకురా !

సత్త్వ భూమి, చిత్త్వ భూమి
తత్త్వ భూమిరా మనది !
రాజస తామసముల గని
ఓజ చెడకురా !

యంత్ర భూమి, తంత్ర భూమి
మంత్ర భూమి రా మనది !
పరాణువులు పగులుట గని
భయము చెందకురా !

అన్న భూమి, వెన్న భూమి
కన్న భూమిరా మనది !
భవ్య భూమిరా ! మనది
దివ్య భూమి రా !

# ఏమిటి పాడేవో

ఏమిటి పాడేవో !
ఎవరికి పాడేవో ? జీవా –
ఈ నిద్రా ముద్రిత నిశీధిలో
ఎవరికి ఏమిటి బోధించేవో ?

మేనే మరచిన భువి కాదా ఇది ?
వీనే పోయిన దివి కాదా అది ?
ఈ ఆ తారల ఉరకలలో !
ఆ ఈ ఆకటి గురకలలో !

నీ జీవుని వేదనకు స్వర మిడి
నీకై నీవే పాడుకొందువో ?
నీ గొంతుకలో దేవుని వేదన
నిస్పృహతో నిట్టూర్పుట వినవో !

# ఎందుకో ఆ తహతహ

ఎందుకో ఆ తహ తహ ?
ఏమిటో నీ ఊహ ?
ఏ పూర్ణ సుధా పాత్రకో
ఈ అహ రహ యాత్ర ?

అరుణోదయ సౌందర్యం
అమృ తేందు సుధా హాసం
ఏ వెన్నెల రేయి కొరకో ?
ఏ వే వెలుగుల కొరకో ?

ఏది గమ్యమో తెలియదు,
ఏది ప్రాప్తమో తెలియదు,
అడు గడుకొక అనుభూతిని
అందుకొనక త్వర ఎందుకో ?

# తెరువరీ తెరువరీ

తెరువరీ ! తెరువరీ !
తెరు వెరిగి చన వోయి !

నీ వేగు దారిలో
ఏ విరులో వలచేను !
నీ వాగు ఊరిలో
ఏ వెతలో కలచేను !

నీ అడుగు జాడలో
ఏ అమృత మూరేనొ !
నీ గొడుగు నీడనే
ఏ చెడుగు దాగేనొ !

నీ తలపు టల మీద
ఏ వలపు విరిసేనొ !
నీ వలపు కల లోన
ఏ విషము కలిసేనొ !

నీ మనసు తమసులో
ఏ మెరుపొ మెరిసేను !
నీ బ్రతుకు పొలములో
ఏ రుతువొ కురిసేను !

# ఎచ్చుటివో ఎచ్చుటివో

ఎచ్చుటివో ! ఎచ్చుటివో !
ఈ శీతల మలయా నిలములు !

మలయానిలముల మృదు కరముల కీ
కల రుతములు ఎచ్చుటివో !
కోయిల కల రుతముల కీ కమ్మని
తోయజ గంధము లెచ్చుటివో !

అవనిని వీచే గంధములకు ఈ
అమృత రాగ రుచు లెచ్చుటివో !
రాగ రుచుల రమణీయ ఝరుల కీ
రమణీ స్పర్శన లెచ్చుటివో !

రుచిర మైన ప్రతి స్పర్శనలో ఈ
రూప దర్శనము లెచ్చుటివో !
ప్రతి రూప ప్రతిమా హృదయము కీ
ప్రణయ స్పందన లెచ్చుటివో !

# ఎంత చల్లనిదే

ఎంత చల్లనిదే !
ఎంత మెత్తనిదే నీ మనసు !

నా మనసును నీ దగ్గర ఉంచి
నీ మనసును నా తోడ తీసికొని
పైన పైన ఆ నిమిషమె నాకు
ప్రాణ సౌరభము వీచినదే !

బైలు దేరి నే వస్తూ నిను ఆ
పాద మస్తకము ముద్దాడిన ఆ
ప్రతి ముద్దును ఒక అమృత కలశ మై
బ్రతుకును మధురించినదే !

సుఖ మున్నది నా మనసుకు నీ కడ,
సుఖము లేదు నీ మనసుకు నా కడ,
నాతో తిరుగుచు నను సేవించుచు
నానా శ్రమలును పడుచుండి నదే !

ఈ అనంత అవిరామ యాత్రలో
ఈ ఆకటి చిచ్చుల లోకములో
నీ మనసే నా కూడ లేనిదో
ఏమై పోయే వాడినో కదే !

# నీ మీదకు మనసు పోయి

నీ మీదకు మనసు పోయి
నీ సన్నిధి కోరుదు !
కోరికలో మునిగి, విరహ
కుండములో వేగుదు !

మల్లె పూలు కనబడినా,
మంచి మాట విన బడినా,
మనసే నీపై విరిసి
మధు రసములు గ్రోలుదు !

ఏవో మెరిసే కనులు,
ఏవో విరిసే పెదవులు,
గుండె నాటి నప్పుడు నీ
గొంతుకతో పాడుదు !

నిన్ను విడిచి చను వేగం,
నిను చేరుటలో జాప్యం,
బ్రతుకున కద్దము చూపగ
భయము తోడ వణకుదు !

పట్టరాని సుఖ మైనా,
బాధైనా నను చేరగ
ఒంటరిగా పడలేక
జంటగ నిను కోరుదు !

# బ్రతుకు బాటలో పొడవున

బ్రతుకు బాటలో పొడవున
గతుకు లున్న వట రా ?
　　　గతుకు లెన్ని వెతలు పడిన
　　　అతక కున్నవట రా ?

గతుకులలో పడి బండి
కదల కున్నదట రా ?
　　　నిలుచుట కైనా చల్లని
　　　నీడలు లేవటరా ?

దొరికిన నీడల నెన్నో
దొసగు లున్న వట రా ?
　　　నోటిని తడి చేయ గల్గు
　　　ఊటయు లే దటరా ?

నీ కొక్కడికే కా దది,
లోకపు తీరే అదిరా !
　　　నిను నీవే చక్క బెట్టు
　　　కొని, ముందుకు పదరా !

# ఇంతటిదా

ఇంతటిదా !
నీ స్నేహ సహానుభూతి-

ఎంత వేడి వడపోసి
ఈ వెన్నెల కాసెదవో !
ఈ విరహ నిశీధి కూడ
ఇంత చల్లగా ఉన్నది !

నాలో నీ కోసము ప్రతి
నాడియు రగిలీ, పొగిలీ
బూది యగుచు నున్న గాని
వేదనయే లే కున్నది !

మోహాంధముగా నేను
ముళ్ళ మీద నడచి పోవ,
కారిన నెత్తురె కాని
గాయము కనపడ కున్నది !

నా విరహాగ్నులను కూడ
నీవే మై దాల్చుకొని
కాలి పోవుచునె, చందన
గంధ మలదుదువు నాకు !

# అక్కడ నీవే పువ్వును

అక్కడ నీ వే పువ్వును పుడికెదవో
ఇక్కడ నే నా తావిని గ్రోలుదును !
అక్కడ నీ వే మధువును క్రోలుదువో
ఇక్కడ నే నా మైకము పొందుదును !

అక్కడ నీ వే సుఖమును కోరుదువో
ఇక్కడ నే నా కృషినే చేయుదును !
అక్కడ నీ వే వనమున తిరుగుదువో
ఇక్కడ నే నా రమనే పొందుదును !

అక్కడ నీ వే పాటను పాడుదు వో !
ఇక్కడ నే నా ఆటను ఆడుదును !
అక్కడ నీ వే పూజలు చేయుదువో
ఇక్కడ నే నా ఫలమును పొందుదును !

# జొన్న కంకుల కొరకు

జొన్న కంకుల కొరకు
జోడు బాసిన పక్షి
ఆగ దొక కొమ్మ పై
ఊగ దొక తీగ పై
ఎంత దవ్వరుగునో ఎగిరి ! గూటి
కెన్నటికి చేరునో తిరిగి !

గూటిలో కుదురుగా
కూర్చున్న పక్షి
భ్రమపడదు పండైన
భయపడదు పిడుగైన,
ఎప్పటికి తీరునో దీక్ష ! గూటి
నెన్నటికి వీడునో స్వేచ్ఛ !

విహరించి విహరించి
విసిగి పోయిన పక్షి,
కూర్చుండి కూర్చుండి
క్రుంగి పోయిన పక్షి,
కలుసు కొను టున్నదో లేదో ! ఉభయ
కాంక్షలును తీరు తెరు వేదో !

# రావాలనుకొంటేనే

రావా లనుకొంటేనే
రండీ నా తోటకు !
అందాలకు పడి చచ్చే
కొందరికే ఈ తోట !

అందము తిని, ప్రేమ త్రాగి,
డెందాలను పవళించే
మత్తులకే, రాగ రసో
న్మత్తులకే ఈ తోట !

లోభములకు, లాభములకు
లోక వ్యవహారములకు
పనికిరాని దీ తోట !
ప్రణయ మాత్ర మీ తోట !

నిర్మల హృదయులకె కాని
నిలువ రాని దీ తోట !
అమృత భావుకులకె కాని
అగుపించని దీ తోట !

నగ్న రాగ రసములతో
భగ్న జీవితముల నతికి,
ఇల కొలికిన సుధను తిరిగి
ఎత్తునదే ఈ తోట !

# ఏమిటి వెతికేవో

ఏమిటి వెతికేవో ?
ఎవరవో నీవు, ఈ చీకటిలో -

నగయేదో పడిపోయినదా ?
నాణె మేదో చెయి జారినదా ?
ఏ విలువకు, ఏ వలువకు కూడా
తావు లేని ఈ చీకటిలో -

ఏ మాయని మణికై వెతికేవో,
ఏ ఆరని దివ్వెను కోరేవో ?
ఎల్ల కళలకును, కాంతులకును తన
ఎదె సమాధియౌ ఈ చీకటిలో -

నీకు నీవె కనిపించని చీకటి,
నిన్ను నీవె కౌగిట గొను చీకటి,
అలసిన జగతికె అసితోత్పల శ
య్యా మందిరమౌ ఈ చీకటిలో -

# కాటుక కరగిన దేలా

కాటుక కరగిన దేలా ? బాలా !
క ంఠము కలగిన దేలా ?
పూయలేదో నీ పూజా వాటిక ?
కాయలేదో నీ కాంక్షా లతిక ?

మల్లెలు కాయునె ? మరువము పూయునె ?
మామిడి పూవులు మాలకు తగునే ?
తోట నేది యెందుకొ తెలిసిన దొక
తోట మాలికే కాదటె ? బేలా !

అందని ఫలమును ఆత్మ కోరెనా ?
అందని దంటూ ఆత్మ కున్నదా ?
తాదాత్మ్యము లభియించిన మీదట
తనువుల తలపులె యేలా ?

# చినుకు చినికే మబ్బు

చినుకు చినికే మబ్బు
తునకకై ఆశించి,
పొంగి పారే సరస
గంగ మాటే మరచి
కేలు మోడుస్తావు చాల ! ఎవరి
మేలు కేడుస్తావె ? బేల !

తృటిపాటు వెలుగు వి
ద్యుద్దీపమును గోరి,
అస్తాచలము దాక
అరుణ కిరణుని తరిమి
కరము లందిస్తావు చాల ! ఎవరి
కరుణ నిందిస్తావె ? బేల !

పూర్వ గాథా లహరి
పుటలలో తలపెట్టి,
అడుగు దమ్ములు కొల్చు
హస్తమ్ములను నెట్టి
కంట తడి పెడతావు చాల ! ఎవరి
వెంట తడబడతావె ? బేల !

# ఎత్త వోయీా కేల

ఎత్తవోయీా కేల
ఈ బేల సుమ బాల !

ఏ గాలి వడి తూలి
ఈ నేల రాలినదొ,
ఏ కబరి ముడి సడలి
ఈ ధూళి జారినదొ ॥ ఎ ॥

సంస్కార వాసనలు
చల్లార లేదోయి,
సౌందర్య సంపదయు
సమసి పోలేదోయి ॥ ఎ ॥

ఏ కొంటె కన్నులో
ఏ తుంటె చేతులో
ఇటు కొసరి, అటు కసరి
ఎటు విసరి పోవునో ॥ ఎ ॥

వట్టి విరిగా లేదు
పత్ర కోరక మేమొ !
వల వంత బడియున్న
వనలక్ష్మి మన సేమొ ॥ ఎ ॥

# ఇంత ముద్దుగ పూచితివి నీవు

ఇంత ముద్దుగ పూచితివి నీవు !
ఎవరి ముద్దుల గుమ్మవే ?
ముద్దుకొక మొగ్గగా నిలు వెల్ల
మురిపెముల పూ గొమ్మవే !

అంటి అంటని గులాబీలు,
అదిమి గుచ్చిన ఎర్ర కల్వలు,
నెత్తురులు చిందు మందారాలు,
నెత్తావులను చిమ్ము జాజులు !

మోవిపై మురిసేవి, మూర్ధాన విరిసేవి,
బుగ్గలను మెరిసేవి, కన్నులను కరిగేవి
వివిధ విరుతములతో నీ నిండ
నవ వసంతము నింపినవి కదే !

ఆ పాద మస్తకము, అణు వణువు,
ఆత్మేశ్వరుని ముద్దులలో మున్గి,
కేవల వసంత వనివా నీవు ?
కైవల్య లక్ష్మి వేసే నీవు !

# ఎపు డైన బ్రతుకులో

ఎపు డైన, బ్రతుకులో
ఏ ప్రాయ మందైన,
అంద మేదైన నీ
డెందమును సోకనే ?
అదియే పరాదేవి
ఆశీస్సు నీకు !

ఎపు డైన బ్రతుకులో
ఏ అందమున నైన
రాగ లాలస నిన్ను
రస కలశి జేసెనే ?
అదియె జీవన దేవి
అనురక్తి నీకు !

ఎపు డైన బ్రతుకులో
ఏ రాగ రుచి కైన
తనువు నంకిత మిచ్చి
దాసోహ మంటివే !
అదియే అమృత దేవి
అనుభూతి నీకు !

# ఒంటరి తీగవా

ఒంటరి తీగవా ?
జంటకు చేరుదువా ?

ఈ చిరు వెన్నెలలో
ఈ చలి గాలులలో
ఏ చెలి నిను విడిచి
ఏ దెస బోయెనే !

పచ్చని గుండెలపై
వెచ్చని కౌగిలిలో
వలపులు రుచి మరిగిన
చెలు లెటు మరచెదరో ?

నీ చెలి నీ కొరకు
నా చెలి నా కొరకు
ఎట ఎట వెదుకుదురో !
ఎవు డిటు మరలుదురో !

కవ్వించును కలువలు !
నొవ్వించును వెన్నెల !
ఆసరా లేకుంటే
అసువులె పోవు నేమొ !

# ఎంత జాణవే కలువా

ఎంత జాణవే, కలువా !
ఇంతేనా నా విలువ ?

ప్రేమ కోస మని పిలిచితివి,
సేవ చేయు మని చెప్పితివి
నీ నీడను మనుచుండిన నాకు
నీడయు లేదని నవ్వితివి ॥ ఎం ॥

గాలి మేడపై గగన కుసుమమై
గుండె నిండుగా గుబాళించితివి
చిరు నవ్వులతో చెంత చేర్చుకొని
చరణ పంకమున త్రోసితివి ! ॥ ఎం ॥

అల్పమైన ప్రతి అల కల్లాడుచు
అడుగు దామరల పడియుండిన నా
వికల హృదయమే సింహాసనముగ
విశ్వ చాంద్రిపై విరిసితివి ! ॥ ఎం ॥

రాజస తామసములను చంపుకొని,
రాజరికమ్మును మానుకొని,
పరమ సత్వ పూర్ణుడనౌ నను నీ
ప్రగతికి దాసుని జేసుకొంటివి ! ॥ ఎం ॥

# మేఘమాలను మెరుపు కన్నెను

మేఘ మాలను, మెరుపు కన్నెను,
చంద్ర కాంతిని, ఇంద్ర పదవిని
ప్రేమ కోసము పిలిచి పిలిచీ
రాక కోసము రగిలి రగిలీ
ఎదురు చూతు వటోయీ ?
ఏడ్చు చుంటి వటోయీ ?

మేఘ మాలను పట్ట గలవా ?
మెరుపు కన్నెను ముట్ట గలవా ?
చంద్ర కాంతులు కాంత లగునా ?
ఇంద్ర పదవులు పెదవు లగునా ?
ఆశ వీడ దటోయీ ?
అందు కొందు వటోయీ ?

మిన్ను విడిచి, కన్ను మలిపి,
నిన్ను నీవే చూచుకొనుమా !
శత సహస్రానందములు నీ
స్వాంత మందె తరంగితములౌ !
భోగ తల్పుడ వోయి !
భువన కల్పుడ వోయి !

# వీరుడ వగుదువా

వీరుడ వౌదువా ?
శూరుడ వౌదువా ?
దేశ దేశముల వెలిగే
ధీరుడ వౌదువా ?

ఎవడో ఒక జీవుడు నిను
ఎదురించుచునే యుండు,
వెర పెరుగక నిల్చి గెల్చి
విక్రమించి మించనిచో ?

మృత్యువునకు భయపడుట
సత్యమునకు భయపడుటే,
శాంతి సత్యములకై నీ
సత్త్వము చూపించనిచో ?

ఊహల, చేతల నీ వొక
ఉద్యమమై బ్రతకనిచో ?
మహిమలు గల మహికే నీ
మహనీయత పంచనిచో ?

# మంచితనం కాదురా

మంచితనం కాదురా, మానవుడా !
మానవ లక్షణం మనోబలమురా !

పశుబలాలు ఢీ కొంటే
బాహు బలం చూపాలి,
మరతుపాకు లెదు రైతే
మహాణువులు విసరాలి ॥ మం ॥

కర్ర చూపి రమ్మంటే
కత్తి దూసి దూకాలి,
కరము చాచి ఎదు రొస్తే
కర చాలన చెయ్యాలి ॥ మం ॥

శాంతి సమయ మందు వే
దాంతి పై సుఖించాలి,
సమర కాల మందు
చండ కరుడ వవ్వాలి ॥ మం ॥

పిరికి వాని గుండెలలో
ప్రేమకు చోటు లేదురా,
శక్తి లేని జాతికి
ముక్తే లేదురా ॥ మం ॥

# సైనికులం మనం

సైనికులం – మనం !
సైనికులం అందరం !

జాతి ప్రాణ రక్షణ కై
సమర భూము లందు,
బంటుతనము పోషించగ
పంట భూము లందు ॥ సై ॥

రాజ్యరమా ప్రభుత కై
రక్త తర్పణం చేసే,
యువ వీరుల పుష్టికై
ఒడలు వంచి చెమ టోడ్చే ॥ సై ॥

దానవతను తెగటార్చి
మానవతను రక్షించే,
ముళ్ళ పొదలు తెగ నరికి
ముత్యాలను పండించే ॥ సై ॥

# ఎందు లోన నేను

ఎందు లోన నేను
ఎవరికి తీసిపోతిని ?

రణ రంగము లోన
రక్తము చిందించితిని,
కుసుమ వనము లోన
కోకిల నై పాడితిని ॥ ఎం ॥

శాంతి సమయమున
సాధువు నై మసలితిని,
విప్లవముల నడుమ
వీరుడ నై నిల్చితిని ! ॥ ఎం ॥

హృదయ మొసగి నేను
ప్రేమ లేఖ వ్రాసితిని,
కాఠిన్యము పైని
కత్తి దూసితిని ! ॥ ఎం ॥

దేశ మెల్ల తిరిగి
దిక్కు లంట విరిసి
విశ్వ మానవతకు
విందు చేసితిని ! ॥ ఎం ॥

# చూచితిని

చూచితిని !
సుందరమౌ నీ రూపము –

కన్యా – కుమారి నుంచి
కైలా – స శిఖరి దాక
ఆ పాద – మస్తకమూ
అమృత కలశి పైన నిన్ను ॥ చూ ॥

గంగ, సింధు, బ్రహ్మపుత్ర
గౌతమి, కృష్ణ, పినాకిని
నర్మద, కావేరి నీకు
నలుగు నీటి చెలు లగుట ॥ చూ ॥

నాద మాత నీ కోసం
వేద కచేరీలు కూర్ప,
ఉపనిష దంగనలు నీకు
నవ రుషులై భాసించుట ॥ చూ ॥

ముఖము వలెనె పాదములును
ముఖ్యములను నీతి తెలిపి
సర్వ జనులకును ఒకటే
సమ ధర్మము నెరపిన నిను ॥ చూ ॥

# బంతి పూల దండలు

బంతి పూల దండలు
మామిడి తోరణాలు !

ఏ ఇంట చూచినా
ఏ వీధి కేగినా
కపురపు దీపాలు
కమ్మని ధూపాలు !

ఏ మోము చూచినా
ఏ కంట కను గొన్నా
చల్లని వెన్నెలలు
సరసాలాపములు !

పండగ ఏ దైనా
గుండెకు ప్రతి బింబమె,
గుండె ఎవరి దైనా
పండగ కోసమే !

దసరా వేడుకలు,
సరదా సంక్రాంతులు,
విందులు, విలాసాలు
అందరి కులాసాలు !

# దీపావళీ

దీపావళీ !
దివ్య నవ్య దీపావళి !

నరుని గుండెలో విరిసిన
నవ జీవన వాంఛావళి !
చీకటిపై దండెత్తిన
జీవ శిఖా విశిఖావళి !

రంగుల తారా జువ్వలు
రకరకాల టపాసులు
మతాబులు, చిచ్చుబుడ్లు
మానవ గుణ గణావళీ !

పుర వీధుల మేడలకు
చిరు గుడిసెల గుమ్మాలకు
సమోత్సాహమును కూర్చే
సామ్య భారతి వయాళి !

# ఒకొక దీపం

ఒకొక దీపం,
ఒకొక దీపం !

నాద పాథోనిధి మథించి
వేద మొసగిన పరమ ఋషికి,
గీత సాక్షాత్కరించిన సం
గీత రస రత్నా కరునికి ॥ఒ॥

అజంతాలో అమృత మూర్తిగ
అవతరించిన తెలుగు శిల్పికి,
చతుర కావ్యకళా సరస్వతి
చరణ చారణ చక్రవర్తికి ॥ఒ॥

ఆత్మ దేశ విమోచనార్థం
అసువు లొడ్డిన అమర యోద్ధకు,
పేద సాదల సుఖము కోసం
చేదు మింగిన యువక శక్తికి ॥ఒ॥

సర్వ మానవ సమత కోరే
సాధు జనులకు, సంఘములకు,
సకల విశ్వ కళాలయములకు,
సంస్కృతీ కార్య క్రమాలకు ॥ఒ॥

# శ్రీశైల శంకరా

శ్రీశైల శంకరా !
కృష్ణ గంగా ధరా !
భ్రమరా మనోహరా !
ప్రజల శక్తీశ్వరా !

నల్లమల కొండలలో
మల్లి యెల గుండెలలో
కాంతి లింగా కార !
కరుణా సుధా సార !

కలిమి లేముల మించి
కుల మతాలను మించి
స్పర్శ సుఖ మందించు
సాయుజ్య సుందరా !

శిఖర దర్శనము నసె
శ్రీ లొసగు శంకరా !
శంకరుని అద్వైత
సాహితీ శశిధరా !

# వేంకటేశ్వరా

వేంకటేశ్వరా ! ఓ
వేంకటేశ్వరా !

కొండ లేడింటి పైని
కొల్వు తీర్చిన స్వామి !
కొండ దిగువను నాదు
గొంతు వినబడ దేమి ?

తృణము గైకొని కోటి
ధనము లిచ్చే ప్రభూ !
ఎదను గైకొని మోక్ష
పదవి నొసగు స్వయంభు !

ఏడు కొండలు నాలో
ఏడు స్వరములు కాగ,
నేనె ఒక వీణనై
నిన్ను పాడేను రా !

ఏ డేడు లోకాలు
ఎక్కి దిగ లేనురా !
నా గుండె గుడి లోనె
నా సేవ గైకొనర !

# శ్రీకాళ హస్తీశ్వరా

శ్రీ కాళ హస్తీశ్వరా ! నీ కృపా
శ్రీ నొసగి దీవించరా !

శ్రీ కాళ హస్తు లను
త్రి గుణమ్ములకు నీవ
ఈశ్వరా లయము పై
ఐశ్వర్య మీవటర ?

జ్ఞాన ప్రసూన హృద
యానంద మధుపాయి !
ప్రజ్ఞాన చేతనా
ప్రత్యూష మీ వోయి !

అమృత లింగేశ్వరా !
ఆనంద నర్తకా !
ప్రకృతి జీవన కళా
ప్రాణ ప్రవర్తకా !

నీ ప్రసాదమె అమృత
ని శ్రేయసము సదా,
నీ కరశ్రీ లక్ష్మి
నా కింత కొసరరా !

# మనసున మెదిలేవు

మనసున మెదిలేవు,
కనులకు కట్టేవు, నీవే -

పద్మా కరమును కను వేళ, ఏ
భ్రమర గీతలో విను వేళ,
రాకా చంద్రుని వనముల నుండి
రాగ మేదొ నను సోకే వేళ ॥మ॥

గులాబి తోటలు పూచే వేళ,
కోకిల పాటలు సాగే వేళ,
గుండె బరువుతో ఒంటరిగా ఈ
కొండలలో తిరుగాడే వేళ ॥మ॥

తెలి మబ్బులలో ఐరావతములు
దిక్కు లదరగా నడిచే వేళ,
విద్యు ల్లవలీ లతలు చక్కగా
విరిసి లాస్యములు చేసే వేళ ॥మ॥

అందము లేవో కను వేళ, ఆ
నంద మేదొ నను గొను వేళ,
అతిలోక సుఖా స్వాదన వేళ,
ఆవులింత వచ్చే వేళ ॥మ॥

# పొలము గట్టుల వెంట

పొలము గట్టుల వెంట
ప్రొద్దు పోకకు పోవ,
        వరి చేలు నీ చీర
        చెరగుగా మురిపించె !

విరహమున తోటలో
తిరుగుదా మని వెడల,
        పూలలో నీ రుచుల
        పోలికలు పులకించె !

నావలో గోదావ
రీ వరద పైకేగ,
        తరగ లెల్లను నీకు
        దర్పణములై లేచె !

కలతపడి నేను చూ
డ్కులు పైకి బరపగా,
        తారలే నీ కంఠ
        హారమ్ములై మిణికె !

విశ్వ మంతయు తిరిగి,
విరహ వహ్నులు పెరిగి,
        చిక్కి నిను తలపగా
        రెక్కలే మొలిచె !

# చందమామా చందమామా

చందమామా ! చందమామా !
అందమైన నా రాజా ! చందమామా !

నా హృదయము కలువ కొలను,
నా మనస్సు పాలవెల్లి,
తారలలో చిక్కుకొని
చేరగలవె నన్ను కూడ ?

శితి కంఠుని శిరము మీది
శీతాంశు మనోజ్ఞ మూర్తి !
నీ చల్లని కౌగిలిలో
దాచు కొనగ రావే యిక ?

దివిజ పయోనిధి లోపలి
దివ్యామృత కలశి వీవు !
ఒక్క గుక్క చాలు నాకు
ఉండి పోదు ఉల్ల మందె !

కలువలు ఎద నిండ విరిసి
కాముని పూర్ణిమ నైతిర !
వర పూర్ణిమ లెల్ల గ్రోలి
వైశాఖిని కానీరా !

# ఎంతకాల మాయెరా !

ఎంత కాల మాయెరా !
హృద యేశ్వర ! నిను చూచి –

గుమ్మములో బంతి పూలు
గుండె లోన నీ ఊహలు
ఉదయ రంగ వల్లులలో
ఊయల లూపించును రా !

అలవాటుగ రవి రోజూ
అస్తమించు, ఉదయించు !
వెదురు పొదల రొద లేవో
వెనుకటి కథలు స్మరించుర !

వీణ కదిలి పిలిచి పిలిచి
ప్రాణ మలసి నిదుర పోయె,
నిదుర లోన నిను కూడుటె
నిశ్రేయస మాయెనురా !

# వేదాంతపు వీధి చివర

వేదాంతపు వీధి చివర
వేడెక్కిన మైలు రాయి
విరిగి ముక్కలైన గాని
తిరిగి రావు నీ వెంతకు
వేచి యుండ జాల నిట,
లేచి వత్తు నీ బాట !

చు ట్టయినను మెట్ట దారి
సుఖ మనుకొని ఏండ్లయ్యెను,
విజనము లై పని తీరిన
విను వీధులు పూండ్లయ్యెను !
ఎంత కాల మీ అంచున
ఎదురు చూతు నీ చింతన ?

తీరని ఆశల నిండా
తిమిర మలముకొను చున్నది,
న న్నేదో రా యనుకొని
వెన్నెలయును చనుచున్నది !
బ్రతుక లేను నిను బాసి,
పైన మగుదు నీ కేసి !

# రావయ్యా ఒకసారి

రావయ్యా ఒకసారి ! నా
బ్రతుకే నీ కోసము జడదారి !

ఆబాల్యముగా పెంచుకొన్న నా
ఆశా వనముల స్వప్న వల్లికలు
పూసిన కాసిన పూలూ పండ్లూ
పూజ కొరకు నిను పిలిచే నయ్యా !

ఇవిగో పండ్లు, ఇవిగో పూలు,
ఇవిగో మధువులు, మధుర రసాలు,
నా బ్రతుకునె నీ పాద పీఠమున
నై వేద్యముగా ఉంచితి నయ్యా !

కన్నీటితో నీ కాళ్లు కడిగి, నా
కున్న దెల్ల వడ్డించితి నయ్యా !
ఆత్మ కమల కమలా మనోహరా !
ఆస్వాదింతువు, రావయ్యా !

# అందింది నీ లేఖ

అందింది నీ లేఖ అందింది !
అందింది, అమృతమ్ము చిందింది !

సాయాహ్న సమయాన
సాగ రోత్తీరాన
రాగ వీచికల పై
వ్రాసి పంపిన లేఖ –

దే హావరణ దాటి,
దే శావరణ గీటి,
ఉభ యాత్మ లోక విశ్వ
విభుత మీటిన లేఖ –

శృంగార జలధిలో
సౌందర్య మణు లేరి
పరమాత్మ సూత్రాన
సరము లల్లిన లేఖ –

ఊహాలో నను కూడి
ఉపనిషత్తగు నిన్ను
పసుపు కుంకుమ పెట్టి
పట్టి తెచ్చిన లేఖ –

# దీను రాలవు కాకుమా

దీను రాలవు కాకుమా !
దిక్కు లే దనుకోకుమా !
జీవు లెనుబది నాల్గు లక్షలు
శివుని సంతానమె సుమా !

ఎవరు తల్లీ ? ఎవరు తండ్రి ?
ఎవరు భార్య ? ఎవరు భర్త ?
ఎవరు నిను శాసించు ప్రభువు ?
ఎల్లరును శివుడే సుమా !

నిన్ను బోలిన జీవులే ఈ
నిఖిల జగములు, చూడుమా !
శివుని కైనను మనసు లేనిచో
శిరము వంచగ బోకుమా !

# రాధకా ఈ బాధ

రాధకా ! ఈ బాధ ?
రాధికా నాథా !

ఒంటరి తనమే బృందావనియా ?
కంట నీరే యమునా ధునియా ?
నిత్య నిరీక్షణమే ప్రేపల్లెయ ?
నీకు కాని దొక మనుగడయా ?

కంటక కరుడై ఓషధీశుడే
కాయము నలయించేడు !
మలయానిలుడే కాళీయుని వలె
మానస ముడికించేడు !

గొంతుకలో ఈ గుర గుర యేమి ?
గుండెలలో ఈ గుబు లేమి ?
తృణ మాత్రపు ఈ బ్రతుకున కింతటి
పెను తుపాను లేమీ ?

నీ పద పూజా ఫలమును కాదో ?
నాపై ఎందుకు దయ రాదో ?
ఎందుకురా ఈ అగ్ని పరీక్షలు ?
అందుకోర అమృతాక్షతలు !

# ఉంగరమా ఉంగరమా

ఉంగరమా ! ఉంగరమా !
శృంగార కళా మందిరమా !

అరుణోదయ రుచి అగు పించె,
ఆశా మేఖల దీపించె,
పుష్యరాగ మణి మోహన వగు నిను
పుంస్కోకిలములు కీర్తించె !

రవి మండిత రాశి చక్రమై నీ
రాక నన్ను మేల్కొలిపె !
ఇరుల కురులు ముడుచు కొని నా యెడద
హేమాంబుజమై విరిసె !

ప్రణయ ప్రతినిధి వౌ నీలో నా
ప్రాణమ్ములు ఈ నాటికి నిలిచె !
ధరణిజకే ప్రాణ దూతి వౌ నీ
చరితము ధైర్యము గొలిపె !

తదియ నాటి నెల వంక వోలె సుం
దరమై నీ వదనము మెరిసె !
ప్రియ పూర్ణాగము నోత్సాహము నను
శ్రీ రమనే యొనరించె !

# మ్రోయించరా కృష్ణా

మ్రోయించరా ! కృష్ణా !
మ్రోయించరా ! మురళి !

పగ లేగ ఏవో ఏవో
పనుల లోన, శ్రమల లోన,
అలసిన ప్రాణాలు ఏదో
అను రక్తి కోరురా !

అంధకారము నీ రూపము గొని
అల్లుకొన్నదిరా, మా చుట్టూ !
ప్రక్క నీ వున్నట్టే లేరా !
పా టొకటి చాలురా !

పింఛమును ఇంద్ర ధను స్సనుకొని,
పెను మేఘముగా నిను తలచి
మా కోర్కెల హంసలు చాలా
మ్లానములై పడియున్నవిరా !

గోవులురా మా హృదయాలు,
పోవునురా పరి పరి విధముల !
నీ త్రోవకు మళ్ళించు కోర !
నిన్ను చేర్చుకోరా !

# కోపమా

కోపమా ?
అంతటి తాపమా ?

దారి తెన్నులు లేని జీవన
భారములు శిరసా వహించి
ఒంటరిగ నే పోయినా నని ?
జంట నిను గొనిపోవ లే దని ?

వెలుగులను పట్టుకొన, చీకటి
వలలు విసిరి శ్రమించు వేళల
పరమ సుఖమయి పైన నిన్ను
సజ్జ నుంచుకొనంగ లే దని ?

దూరములలో, ఏవొ ఏవో
తీరములలో తిరిగి, తిరిగి !
ముళ్ళ డొంకల విరిగి నా నని ?
మొగ్గగా నిను విరియ లే దని ?

భూత కోటికి వెలుగు పంచుచు
బూదినై మహి రాలు నప్పుడు
పూను కొని న న్నుద్ధరించగ
భువికి నిను రప్పించ లే దని ?

# ఎన్నో ఎన్నో బొమ్మలు

ఎన్నో ఎన్నో బొమ్మలు !
ఈ జగ మంతా బొమ్మలు !

నిన్నే చూచిన కన్నులతో
బొమ్మల నేమిటి చూచువాడ నని
నిన్నే చూడగ వచ్చితి మరల !
అన్నీ నీ తొలి బొమ్మలు !

నిన్నే కొల్చిన చేతులతో
బొమ్మల నేమిటి కొల్చువాడ నని
నిన్నే కొల్వగ వచ్చితి మరల !
అన్నీ నీ సిరి బొమ్మలు !

నిన్నే పాడిన హృదయముతో
బొమ్మల నేమిటి పాడువాడ నని
నిన్నే పాడగ వచ్చితి మరల !
అన్నీ నీ మలి బొమ్మలు !

భీమన్న

# రాభీలు

నాలుగవ భాగం

## కళాధరుడ వీవు

కళా ధరుడ వీవు – నీ
కళనుర నేను,
ఇలా వరుడ వీవు – నీ
ఇలనుర నేను !

ఉమా విభుడ వీవు – నీ
ఉమనుర నేను,
రమా ప్రియుడ వీవు – నీ
రమనుర నేను !

గుణాకరుడ వీవు – నీ
గుణమును నేను,
రసాద్వైత మీవు – నీ
రసమును నేను !

# రావే ఈ తోటకు

రావే ఈ తోటకు !
రస హృదయీ ! రాగమయీ !

రమ్యవుగా, నవరస పా
రమ్యవుగా, మధు మానస
గమ్యవుగా, నా మానస
కమలా లయగా లేచి -

రాధాదులు విరహముతో
రగిలిన బృందా వనియా ?
ఆత్మ లోనె వికసించిన
ఆనంద రసాలిని ఇది !

నీవు నే ననెడి భావమె
నెలవు సుమీ ఎడబాటుకు !
నీ లోనే గల నాతో
నాలో విహరింతు గాని !

అలరు తేనియలలో నీ
అడు గడుగున పంక ముగునొ ?
ప్రాణ పంకజము నాది -
పాదము లిడి, రమ కావే !

# నీ యానం

నీ యానం !
నీ గానం !

ఎంత ముందు కేగుదువో
అంత సుందరం !
ఎంత పైకి పోవుదువో
అంత మోహనం !

ఎంత వేగమును గొందువొ
అంత ముందు కేగుదువు !
ఎంత రాగమును గందువొ
అంత పైకి పోవుదువు !

నీ యానమె పురోగతి !
నీ గానమె ఆత్మోన్నతి !
సమకోణపు ఈ భుజాల
సంయోగమె సరస్వతి !

# ఏ మున్నది ఏ మున్నది

ఏ మున్నది ? ఏ మున్నది ?
ఈంత రాక ఏ మున్నది ?
ఈ జీవన వాహినిలో ?
ఈ మహా ప్రవాహములో ?

వరద పొంగి మిన్నంటిన
వర్షా విలయోద్ధతిలో ?
గాలి తుపానులు రేగిన
గాఢాంధ నిశీధములో ?

పెంచుకొన్న సుమలతలతో
వంచలె విరిగే వడిలో ?
దాచుకొన్న రత్నాలతో
ధాత్రియె మునిగే సుడిలో ?

# పరిస్థితుల ముళ్ల పొదల

పరిస్థితుల ముళ్ల పొదల నుండి
బైటపడుట తెలియ కున్నది,
నమ్ముకొన్న తురంగమే నను
నట్టడవిని త్రోసి పోయినది !

వెలుగు లోన నీకు నీడ కల దని
కలువ తానె ఇరుల మునిగినది,
ప్రియుని చేతి వెదురు కర్ర చూచి
పికము గొంతు చించుకొన్నది !

ముళ్ల పొదల కైన గాని, ప్రియా !
పూలు పూయు టొకటె లక్ష్యమయా !
బైట పడే ఇచ్ఛ లేక కాదు,
పరిస్థితుల పట్టు సడల లేదు !

# చేయాలనుకొన్న పని

చేయా లనుకొన్న పని
చేసెయ్ ధైర్యముగా,
చేసిన పని ఒక్కటే
భాసించును సృష్టిగా !

పనికి లేదు మంచి చెడు,
పనియే పరమేశ్వరి !
భావ రూప భారతిని
భౌతిక రముగా గొని –

కల రాత్రిది గతం !
కల పగటిది మతం !
కలను పట్టి, కలము పట్టి
కదిలినదే మధువ్రతం !

# నా అనుభవ మంతా

నా – అనుభవ మంతా ఇదిగో !
నా – ఆత్మ మధువు ఇదిగో !

మనిషి మనిషిగా బ్రతకా లంటే
మానవంతుడై మెలగాలి,
ప్రాణం కోసం బ్రతికే వాడు
పరమ నీచు డని తలపాలి !

ఇరుగు పొరుగులతో సహకరించుటే
ఈశ్వరత్వ మని తెలియాలి,
డబ్బు కొరకు గడ్డిని తిను వానిని
గాడిదతో జమ కట్టాలి !

ప్రేయసి ప్రియుల ప్రేమ సమస్తం
సృష్టి ధర్మ మని ఎరగాలి,
గడప దాటి లోకము గను వానినె
కర్మ సాక్షిగ గణించాలి !

రంగు, జాతి, దేశం ఏదైనా
రాగ స్వరూప మొకటే మనిషికి,
భావ కర్మ రుచి భేదము లెంచక
ప్రతి మనిషిని ప్రేమించాలి !

# ఎన్నెన్నో దేశాలు తిరిగి

ఎన్నెన్నో దేశాలు తిరిగి
ఎన్నో పోరాటాలు జరిపి
విద్వేషాలను గెల్చాను,
విజయ లక్ష్మితో వచ్చాను !

ఎక్కడ ఏ దేశాని కైనా
ఎప్పుడు ఏ యుద్ధాని కైనా
లక్ష్య మేమిటో చూశాను,
కుక్షి లోతులను కొలిచాను !

ఆనందానికి అన్నం కావలె,
అన్నానికి అధికారం కావలె,
కోటి విద్యలును కూటి కోస మను
మాటకు చేతులు మోడ్చాను !

చదువు చెప్పి, పని చూపి, అందరికి
సౌఖ్య ద్వారము తెరచుట ఒకటే
ముఖ్యం ఇపు డని చాటాను,
ముక్తికి సూత్రం కట్టాను !

# పువ్వులు లేవని

పువ్వులు లే వని – తల
దువ్వ కొనుట మానుదుమా ?
పికము పాడ దనీ – వన
విహారములు మానెదమా ?

పదవులు రాలే దని
చదువులు మానుదుమా ?
ఘనపాఠికి నచ్చ దని
కవిత మానుదుమా ?

మంచము లే దని – నిదు
రించుటె మానుకొందుమా ?
అధిక మయ్యె ధర లని
ఆహారమె మానెదమా ?

పొట్టికి అంద దనీ
మట్టికి దక్కదనీ
అందము వీడుదుమా ?
అభి రుచి మానుదుమా ?

# ఏమిటే ఈ వింత

ఏమిటే - ఈ వింత !
ఎవరు తెచ్చిపెట్టిరి మన కీ చింత ?

మునిమాపుల గల పువ్వులు
ప్రొద్దుటి కేమై పోయెనె ?
చీకటి మసిపాత దులిపి
చిమ్మి పారబోసె నటే ?

సుప్రశాంత మైన చైత్ర
సుప్రభాత మేమైనదె ?
చిటిక లోన మబ్బు క్రమ్మి
పుటికెనె ముంచినది కదే !

దేశ దేశములు తిరిగి
దివ్యరత్నములు గడించి
అనుకోని వియోగాగ్నికి
ఆహు తీయవలసె కదే !

ప్రణయము లేదా ? మనకు
ప్రాజ్ఞత లేదా ?
ఏ అసూయ మన నడుమ
ఈ అగ్ని రగిల్చిన దో !

# తిరిగి చూచి తిరిగి చూచి

తిరిగి చూచి, తిరిగి చూచి, తిరిగి చూచి
తెరువు మరుగుపడు దాకా తిరిగి చూచి –
మరి నే నగుపించక ఎంత దిగులు పడితివో,
మలుపు వద్ద ఎంత సేపు నిలిచి కరిగి పోతివో !

ముందుకె అడుగులు పడుతున్న గానీ,
డెందము నా కడనే ఉండి పోగా –
సాగలేక సాగే మనసున ఎంత కుమిలితివో,
ఆగని కన్నీటి కానకట్ట లెన్ని కట్టితివో !

ఎంత దూరమో నడక,
అంతు లేనిదో తెరువు –
నీ వెక్క డున్న గాని నీ తోడిదె నా ఆత్మ,
నే నిక్కడే ఉంటి మూట లేక మూగ వోయి !

# అనుకోలేదు మనం

అనుకో లేదు మనం !
ప్రణయ మింత ప్రళయము కాగల దని –

అనురాగమునకు అశ్రు బిందువులె
ఆణి ముత్యముల హారము లవు నని,
ఆత్మైక్యమునకు విప్రయోగమే
హంసతూలికా తల్ప మగు నని –

ఎవరో నీవు ఎవరో నేను
ఎరుగని లోకము ఎదుట నున్న దని,
కలిసిన కొసలను కత్తిరించి, మన
చెలిమికె కాష్ఠం కానున్న దని –

కలిసిన క్షణమే కడపటి క్షణమై
కాల సర్పమై కాటు వేయు నని,
నీవూ నేనూ ఒకటే అయినా
నీకూ నాకూ ఇంత దూర మని –

అందుబాటులో కల తనువులకును
అంతు లేని ఎడబాటు కల్గు నని,
మనసులు కలిసీ, మనువులు కలియగ
మహిత మైన తప మవసరమే అని –

# శాశ్వతమా ఈ తనువు

శాశ్వతమా ఈ తనువు ? మరి
సత్యము నెందుకు ఖైదు చేతువు ?

అందు బాటులో జీవించేము !
ఆత్మలు ఒకటై క్రీడించేము !
తాదాత్మ్యము సాధించి కూడ, మన
తనువులు వేరై దుఃఖించేము !

క్షణికము జీవిత మంటావు, ఆ
క్షణ మైనా జీవించ నీయవు !
ఆత్మే శివుడని అంటావు, ఆ
ఆత్మకె కాష్ఠము పేర్చేవు !

దేహికి దేహమె దేవాలయము,
దీప ముండగనె చేర నిమ్ము నిను !
ఏ క్షణ మేదో తెలియని బ్రతు కిది,
ఎందు కిందు సిద్ధాంత జిగీష ?

# ఈ వసంత సమయములో

ఈ వసంత సమయములో
ఈ విహార వాటికలో
వస్తా వని కూర్చుంటి !
వచ్చా వనె అనుకొంటి !

ఏ అలికిడి వినబడినా
నీ అడుగులె అనుకొంటి
ఏ పువ్వులు కనబడినా
నీ నవ్వులె అనుకొంటి

నా కనులును, చెవులును నను
నవ్వు లాట పట్టించగ
తొలి వెన్నెలె నీ జటలో
కలువ తావి అనుకొంటిని !

తావులలో నీ అందపు
తావులు నను పైకొనగా,
వచ్చితివిలె నీ వనుకొని
పచ్చికపై వాలితిని !

# ఎంత బాధ పడుదువో

ఎంత బాధ పడుదువో !
ఎదురు చూచి, ఎదురు చూచి !

చిర విరహాగ్నులు రగిలి,
చింతా చితిపై మండి,
ఆశా పరిధుల మీదికి
ఆలోకనములు పరపుచు !

సాయుజ్యము మాటె మరచి,
సాన్నిధ్యమునకు వెలియై,
సాలోక్యము కైనను నో
చక పోతినె అనుకొనుచు !

తనువును అగ్నికి వదిలి,
మనసు నైన తనువ గోరి,
శ్రవణాంజలి గొని, ప్రియ భా
షణ మైనను లభియించక !

ప్రణయమునకు ప్రతిఫలముగ
ప్రాణములను తినివేసే
అదయ నైన నా కోసము !
అబల నైన నా కోసము !

# బందీనై పడి యుంటి

బందీనై పడి యుంటి !
బ్రతుకు తీరు తీయములకు నోచక –

శారద చంద్రుని అమృత కరములలో
జగము జగము ఓలలాడు చుండ,
ఏదో తెలియని ఈ చీకటిలో !
ఎందుకొ తెలియని ఈ పహరాలో –

పద్మ వనములో భ్రమర గీతలను
ప్రాణేశ్వరునికి పాడి వినుచుచు,
విహరించే అలి రమ నౌ నేను
విధి కసులకు కారపు హేతువునై –

సుమనస్విత నశియించినదో, అది
కమలమె యైనను కారాగృహమే !
తీరని పేరాసకు బానిసనై,
తెలిసిన సత్యమునకె దూరమునై –

కుముద మధువుతో, కౌముదితో, నా
కోస మెంతగా వెదకు చుంటివో !
ఎంత కుమిలెదవొ నే నగుపడక,
ఏడ్తువొ నా గొంతుక వినపడక –

# ఏమి చేతును ర

ఏమి చేతును ర ?
ఏ ముందిర నా చేత ?

స్వేచ్ఛ కలుగు నా హృదయము
చేరి నిన్ను సేవించగ,
స్వేచ్ఛ లేని దేహమునకు
శృంఖలయే చెలి ఆయెర !

నశ్వరము కదా దేహము ?
శాశ్వత మొక ఆత్మె కదా ?
మణిని వీడి మట్టిని దా
చుకొనే ఈ లోకములో ?

తీరని కోరికల వెంట
తిరుగు చున్నదిర మనసు !
తనను తాను వంచించుక
తగులబడే నీతి నడుమ !

నచ్చిన తోటల నాడి
మెచ్చిన పాటలు పాడి
మింటికి చను విహగము నా
కంటె ధన్యతము కదరా !

# మనసు వరకె కదా

మనసు వరకె కదా
మనకు లభించిన స్వేచ్ఛ ?

మాధవ సఖిగా వెలసి
మధు మోహినిగా విరిసి
రస రాజ్యము లేలు మనసు !
రాగ రమా మణి మనసు !

మేఘ రంజని వలె మహికి
మృదు జీవన ఝరి మనసు !
దీపిక మటులే జగతికి
దీపలక్ష్మి మనసు !

చీకటి లేనిది మనసు !
లోకమె లేనిది మనసు !
దేహములో బందీయై
దీన మైన మనసు !

అడ్డు లేని దీపము వలె
అవని నెల్ల ప్రసరించుచు,
పంజరమున చిలుక వలె
పల వించే మనసు !

# ఏమై పోయెదవో

ఏమై పోయెదవో
ఈ విరహాగ్నులలో !

వెన్నెల మండి పోయె,
విశ్వమే బూది అయ్యె,
చందన లత నేనే
సగముకు నుసి యైతిని !

పూ విలుతుని శరముకు
పూసిన విషమును అయి
నీ గుండెకు నేనే
నిర్దయ నైతిని కద !

నీవు సనాతనుడవు,
నీ వున్నది ఎడారి,
నీ చుట్టును నే నొక
నీడయు కాకుంటిని !

బ్రతుకే బ్రద్దలయి,
మనసే మండిపోయి,
పొగిలే బూడిద ఇది !
పూర్ణిమ కాదు కాదు !

# ఈ అనాది సమాధిలో

ఈ అనాది సమాధిలో
ఎవరు పూడ్చినారో నన్ను
ఈ సమాధి బ్రతుకు మీద
ఎంత పోసినారో మన్ను !
        కాంచలేను, కాంచలేను జగము !
        కదలలేను ఏ కొంచెము !

ఈ అనంత కాల రమను
ఎవరు చేసినారో వధువు !
ఈ రమా కళా హృదిలో
ఎంత పోసినారో మధువు !
        విడువలేను, విడువలేను రసము !
        వినగలేను లవ లేశము !

ఈ సమాధి హృదయములో
ఎవరు చూచినారో నన్ను !
ఈ హృదయ సరోజములో
ఎవరు నిల్పినారో నిన్ను !
        లేవలేను, లేవలేను క్షణము
        కావలేను నీ ప్రాణము !

# తెల్లవారు నటే

తెల్ల వారు నటే ? ఈ
తీరని కోర్కెల రేయి -

పుష్యమీ నిశీథములో
పూర్ణ చైత్ర చంద్రు గోరి
నిరశన వ్రతము చేసే
నీ వెర్రికి ? నా వెర్రికి ?

సాయం సంధ్యా ముకుళిత
సారసమే యైన గాని
నీ వున్నది జైలె కదా ?
నే నున్నది బెలె కదా ?

స్వచ్ఛందపు విరహాగ్నుల
స్వర్ణము వలె బై ట పడి,
నిర్బంధ వియోగానికి
నివరి గింజ వైతి వటే ?

ప్రణయములో పొంగించి,
ప్రళయములో కృంగించి,
రక్షకుడగు పరమాత్మే
భక్షకుడై నోరు తెరువ -

## ఈ తుపాను గాలులలో

ఈ తుపాను గాలులలో
ఎంత కలగి పోయావో !
ఎద పగిలీ, మధు వొలికి
ఎంత బాధ పడినావో !

విశ్వ మోహనముగ విరిసి
వెలయనున్న రాగ లతవు !
పరమ రాగ సుధను భువికి
పంచనున్న మోహినివి !

దేవతలే నిను గొలువగ
దిగి వచ్చిన మాధు రిమా !
నీవు కొలుచుకొను గౌరి
నిను మరువదులే, ప్రియతమ !

# భరించ రాని దైనదా

భరించ రాని దైనదా
ప్రభూ ! నా వియోగము ?
ఏమి చేయుదును నేను ?
ఎటు చేరుదు నిన్ను ?

కమలాకర కమలినీ
కారాగృహ వాసిని నే !
నీ కన్నీటికి కన్నె
నీరధినై పోనా ?

మల్లెపూల శయ్యగ నా
మనసును పరిచితి కాదా ?
మేను వాల్చ వేలా ? నా
మేనే కైలాసమా ?

కంటికి కునుకే లేదు,
కాంతికి ఉనికే లేదు !
రాభీ రాజేశ్వర ! ఈ
రవితో మన కెందుకురా ?

# అద్దరి నీవు ఇద్దరి నేను

అద్దరి నీవు, ఇద్దరి నేను !
ఇద్దరి నడుమ విరహ నిశీధి !
క్షణమైనా ఇది గడిచేనా ?
అణువైనా తరిగేనా ?

పూర్ణ తేజమున నిత్య నూత్నముగ
పొడిచే ప్రొద్దువు నీవు !
రోజుకు రోజు ఓజము తరిగి
క్రుంకే శశి కళ నేను !

నేను పూర్తిగా కరగిపోవకే
నీతో చేరగ లేనా ?
నీకు దూరమై ఎంత వెల్గినా
నిష్కృతి లభియించేనా ?

ఎందుకు నాకీ కీర్తి చంద్రికలు ?
ఎందుకు తీయని బిరుదములు ?
నీకు కానిచో ఈ నా బ్రతు కొక
చీకటి కోణమె కాదా ?

# తపము చేతు వటే

తపము చేతు వటే ?
తనువు మరిచి, నా కోసము -

గత భవమున ఏధర్మము
గతి మాలినదే యనుము,
ఈ భవమున ఈ వయసున
ఇంత హింస ధర్మమటే ?

సుర వన సుకుమార లతలె
చూచి మెచ్చు నీ వపువు
విరహాగ్నికి తోడు, తపో
విరళాగ్ని సహించు నటే ?

పరమ తపో వహ్ని నుండి
భస్మ రేఖపై పోయి
అమృత రాగ రస రమపై
అవతరించి వత్తువటే ?

# ఇక వినిపించవటే

ఇక వినిపించ వటే ?
ఈ నా బ్రతు కిక చెవిటిదే నటే ?

ఏదో గాలికి తీగ తెగిన దని
ఏదో విసురుకు శ్రుతి చెడిన దని
పలుకే మానుట పాడియౌ నటే ?
వలపే మరచుట వంత కాదటే ?

కొత్త తీగలను కూర్చుకో వటే ?
కొత్త రాగములు పాడుకో వటే ?
పెదవు లెండి దోసిలి పట్టిన ఈ
పిచ్చివాడి కిక బిచ్చ మిడవటే ?

భ్రమర గీతలకు నోచ నటే ? నా
బ్రతుకు తోట ఇక పూయ దటే ?
గాన రసము సేవించిన ఫలితము
గాఢాంధ తమో దుఃఖమే నటే ?

నీ తనుశోషలు శమిధలు కాగా
నీ దీనేక్షలు వహ్నులు కాగా
నా పాటలె వాయువులై రేగి
నన్నే భస్మము చేయ సాగనే !

# ప్రోయించకురా మురళి

ప్రోయించకురా మురళి !
మురళీ మోహన ! మోహన రవళి -

మెదప లేని నా పెదవుల కోసం,
కదప లేని నా పదముల కోసం,
ఆసలు తీరే ఆశ లేని నా
కోసం, రేయినె ఏడ్పించకురా !

దేవ దేవుడవు, దివ్యుడ వీవు,
దిక్కు లేని ఒక దీనను నేను !
మురళి నిండ ప్రణయాగ్నులు నింపి
చురుకు చురుకు నను కాల్చబోకురా !

వేణువుపై నీ ప్రేళ్ల కొసలు నా
ప్రాణముపై బుసగొట్టి లేచెరా !
పారిపోయి నిను చేరలేనురా !
ప్రార్థన వినరా ! పంతము విడరా !

ప్రేమను గోరి పొగిలే బ్రతుకుకు
పిలుపొకటే చాలునురా !
పిలు పందిన నా మన సెపుడో నీ
ప్రేమను గలిసెనురా !

# నను విడదీతు రటే

నను విడదీతు రటే ?
నా హృదయేశుని పదముల నుండి -

వేణు మాధవుని వంశీ విరుతము
వీనుల విందుగ విననీయ రటే ?
కాంచన చేలుని కామిత రూపము
కనుల పండువుగ కననీయ రటే ?

ఎన్ని జన్మముల పూర్వ పుణ్యమో
వెన్న దొంగ నా విభు డయ్యె !
పెదవులతో తన పదములు కొలిచే
అదను పదను దూరము చేతు రటే ?

కన్నులలో కన్నులతో నాథుని
కమ్మని పాటల మురిపించి
మధువును సేలకు తేనీయ రటే ?
మనసులు మధురము కానీయ రటే ?

# ఎందుకే మేఘమా

ఎందుకే మేఘమా అంత కన్నీరు ?
ఎవ్వరే శోకాన నిను ముంచినారు ?

కన్నీరు మున్నీరు
కలిసి వెల్లువ కాగ
గుండె చెరువై ఇలయె
గండి పడి పోయెనే !

ఏ లతకు సతి వార్త
ఆలస్య మైనదో ?
నీ జీవన ఖ్యాతి
నీటి మూటైనదో?

తొలకరించక ఎట్టి
కలలు శిల లయ్యెనో ?
నోటి కడ గింజలే
నీటి పాలయ్యెనో ?

ప్రేమగా ఒక్క రా
భీ నైన వినిపించు
స్వేచ్ఛయే లేని నా
చెలి జూచి వచ్చితివొ !

# పిచ్చి వాడ నైతిని

పిచ్చి వాడ నైతిని !
ప్రేమ కామినై, నీకై -

జాబిలి నీ మోమనుకొని
జేబు రుమాలున ఒత్తితి !
అమృతము చిందుట కనుగొని
అమరులనే పిల్చితి !

అప్సరసలు వేన వేలు
అంజలి గొని క్యూ దీరగ
నీ నూగా రనుకొని చని
నిర్ఝర సరసున బడితిని !

అమృత సరస్సున మునిగి,
ఉక్కిరి బిక్కిరిగ తేలి,
స్వర్ణాబ్జము లనుకొని నీ
చరణ పద్మములు గొంటి !

చరణముపై చరణముగా
సంధ్యా నృత్యము సాగగ
పల్లవిలో కూర్చుని నీ
వల్లకినై మ్రోసితిని !

# ఎరుగుదువా

ఎరుగుదువా ?
ఎరిగియె ఇంత యేడ్తువా ?

మంచికి రోజులు కా వని,
మనసే అక్కర లే దని,
మహియే పిచ్చాస్పత్రిగ
మారి పోవుచున్న దని ?

నిజమును చెప్పే వారు,
నీతిని మప్పే వారు,
ప్రజా తంత్ర లోకములో
బ్రతుకుచున్న దెచ్చటనో ?

మెదడు వెల్గిన వారికి,
హృదయము కల్గిన వారికి,
రాజకీయ లలాటమున
రాసి పెట్టినది యేమో ?

మన వంటి ప్రణయ జీవులు
మధుర రసో పాసకులై
అమృతము సృష్టించుకొనే
ఆనందాశ్రమ మేదో ?

# మరచి పో

మరచి పో !
నన్ను మరచి పో !
నన్ను మరచిపోకుండగ
నిన్ను నీవు తెలియ లేవు !

చూడకు !
తిరిగి చూడకు !
తిరిగి తిరిగి చూచుకొనుట
తెరువు తప్పుటయే అగును !

తలపకు !
గతము తలపకు !
గతము లోన చిక్కు కొన్న
బ్రతుకున కే ప్రగతి లేదు !

# శోకమయము లోకము

శోక మయము లోకము !
చూచుకొనుచు అడు గిడుము !

ఎంత పూల తోటైనా
ఎంత మేటి పాటైనా
సోలి పోవు గుణ మున్నది,
శ్రుతి తప్పె తెరు వున్నది !

ఎంత పాటి పొలమైనా
ఎంత విలువ పంటైనా
బీడు పెట్టు చవు డున్నది,
పాడు చేయు తెగు లున్నది !

ఎంత గొప్ప వెలుగైనా
ఎంత ఘాటు వలపైనా
ఆరి పోవు తల పున్నది,
అంతరించు మలు పున్నది !

శోకం గుండా నీవు
సుఖం కేసి నడవాలి !
చీకటి కొస నుంచి నీవు
వేకువనే చూడాలి !

# చీమలు - చీమలు

చీమలు - చీమలు !
ఎన్నో చీమలు !

తెల్లని చీమలు
నల్లని చీమలు
పచ్చని చీమలు
పలు రంగుల చీమలు !

ఒక్కొక రంగుకు
ఒక్కొక పుట్ట -
ప్రతి ఒక పుట్టకు
ప్రధానం తన పొట్ట !

బియ్యపు గింజలకై
కయ్యానికి సిద్ధం !
చక్కెర పలుకులకై
జగ దేక యుద్ధం !

మనుజుని బూటు క్రింద
మహా చీమల సహస్రం,
నాలుగు చినుకులకే
నానా బీభత్సం !

# అంతు దొరకని

అంతు దొరకని, అంత మెరుగని
అంధకారము నేను –
ఎన్ని తారలు వలచినా, నా
వెన్ను బల మింతేను !

శోభ విరియని, సుఖము తెలియని
శూన్య మాసము నేను –
ఎన్ని మధువులు పిలిచినా, నా
వెన్ను బల మింతేను !

స్వేచ్ఛ పొందని, శిక్ష కందని
చిక్కు ప్రశ్నను నేను –
ఎన్ని విద్యలు కొలిచినా, నా
వెన్ను బల మింతేను !

# మరచి పోదువా

మరచి పోదువా ?
నా ఉనికే, నా మనికే -

కంటి పాపపై నీవు
కన్నీటితో పోషించి,
విరియగనే తీగ కొసలు
విరిచి పోదువా ?

కలలు కనే కనుల మీద
వలలు విసిరి, వలపు కొసరి,
మత్తు వదలి చూచు తరికె
మాయ మౌదువా ?

రాభీలకు మలచి నన్ను
రాగ లయకు తీర్చి కూర్చి,
తారను చేరే కొలదీ
దూర మౌదువా ?

# ఏమైతిని ఎటు పోతినిరా

'ఏమైతిని ఎటు పోతినిరా ? నీ
ఎదలోనే లే నటరా ?
కమలము మొగిచి, కారయె అయినా,
కమలే నీ రమ కదరా ?

శోకించకు, నీ శోకములో నా
లోకమె విలయావిల మౌరా !
అజరామర సుందరిని నేనురా !
అరుదెంతుసురా ! ఆశ విడకురా !

నీవే కృష్ణుడ వౌదువు కదరా ?
నిర్వేదము నీకును కలదటరా ?
అరుణ రేఖ లగుపించెను తూర్పున,
మురళీ ధర ! ఇక నిద్ర పోకురా !

# మధుపాయీ ఓ మధుపాయీ

మధుపాయీ ! ఓ మధుపాయీ
మధువే పరమార్థ మటోయీ ?

పువ్వును విడిచి, పువ్వును చేరి,
మనసు దీరగా మధువులు గ్రోలి,
కమలిని ఒడిలో కన్ను మూయుటే
జన్మకు సాఫల్య మటోయీ ?

రంగులు చూచే రంజిల్లుదువో ?
రస రాహస్యము లెరుగుదువో ?
కేవల పరమానంద తారలో
కించిత్ రుచులకు తావు లటోయీ ?

పాత రోతయ్యె, కొత్త వింతయ్యె,
పాల పుంతలో పరుగు లటోయీ ?
ఎందు వ్రాలినా, అందు నీకు నా
డెందమె అరవిందము కదటోయీ ?

గీతను పాడిన గోస్వామియె నీ
గీతికి హృదయ స్వామి కదోయీ ?
నా హృదయ రసాద్వైత మూర్తిపై
నా ఆర్తిని తొలగించ గదోయీ !

# ఎవరిని తలతువు

ఎవరిని తలతువు ? ఎవరిని వలతువు ?
ఎవరిని కొలుతువె ? మనసా !
సగమైతివి ఏ స్వామి కోసమో !
సాహసి వౌదువె ! మనసా !

మనసులు తెలియని, మమతలు విరియని,
మాయలోక మిది ! మనసా !
మనిషిని లేపి, మార్గము చూపి,
మలచగల వటే ? మనసా !

పులియే తండ్రా ? శిలయే తల్లా ?
కలయే దైవము ? మనసా !
పులికి పుత్రులై, శిలకు శిల్పివై,
లలిత వౌదువే ? మనసా !

రస రాగములను వ్యసనము లనుకొని
ఒసిలెను లోకము, మనసా !
ఆత్మను నిలిపి, అగ్నిని చిలికి,
అమృతము కావే ! మనసా !

# ఎక్కడికే మీ రెక్కడికే

ఎక్కడికే ? మీ రెక్కడికే ?
ఇందరు తారలు అభిసారికలై ?

లోకము కళ్ళలో కారము చల్లి,
చీకటి సంద్రములో ముంచి,
రత్న రాశులై తేలితిరే ! ఏ
రాజోద్యానము చేరుదురే ?

కన్నూ కన్నూ కనిపించని ఈ
కారు చీకటి అమావసలో
ఎందు వెదికినా, ఎంత నడిచినా
హృదయ రాజు లభియించునటే ?

ఒకరికి తెలియక ఒకరు పైనమై,
రక రకాల దారుల వెంట –
ఏ రాజునకై పోవుదురో, అది
నా రాజేశ్వరు కళయే కాదే ?

ఎరుగుదు రటె నా రాజేశ్వరుని ?
ఏ చీకటులును లేని ఈశుని ?
ఎట కావలసిన అటనె దొరకు నా
హృదయేశుని చూతురే ? వత్తురే ?

---

# పాడవే పాడవే

పాడవే, పాడవే
ప్రాణ కోకిలమా !
పాడవే, నా హృదయ
పద్మ మందిరమా !

పగ బట్టి రే యెల్ల
పొగ మంచు కురిసెనే !
మధు మాస రమతకై
మామిడులు పిలిచెనే !

పాడనే, నా బ్రతుకు
పల్లవితమై విరియ !
నా నిండ ప్రతి పాట
నాదామృతము కురియ !

హిమ బాధలను బాపి,
సుమ గాథలను లేపి,
నీ లోని కళ లెల్ల
నా లోన వికసింప !

ప్రారబ్ధ మను బ్రతుకు
కారా గృహము నుండి
నా రమను విడిపించి
నాకు దయచేయవే !

# మబ్బు కొండల దుబ్బులం దొక

మబ్బు కొండల దుబ్బులం దొక
మెరుపు తీగను పెరికి తెచ్చితి,
హృదయ మందునె నాటు కొంటిని
ప్రేమ సుధ పోసి !

ఎదిగి ఎదిగీ ఎడద నిండీ,
విరిసి విరిసీ విన్ను నిండీ,
విశ్వ మంతయు నింపినది తన
విమల సౌరభము !

మత్తుగా పైనుండి వీణా
మండలమె దిగివచ్చె నప్పుడు,
స్వర్ణదీ జల తరంగములే
ప్రక్క వాద్యములై !

చిలుక రెక్కల చీర గట్టి,
పూల మొగ్గల మొనల నిల్చి,
నాట్య రమ య్యై ఆడ సాగెను
నా రసాల వని !

# గుర్తింతు వటే నన్ను

గుర్తింతు వటే నన్ను ?
కోటి జన్మముల తదుపరి నైనా ?

బ్రతికి యున్న రోజులలో నీ పద
పద్మ హృదయున్నై వికసించితి నని ?
నిను పాడుటలో మైమరచితి నని ?
నీ కౌగిటిలో కను మూసితి నని ?

తనులత పోయిన క్షణమున నే నొక
తమసి కడలిలో లయమ్మై పోయి,
వెలుగు కెరటమ్మై విరిసి, లోకముల
వలపు లన్నిటికి విభుడనైతి నని ?

నాటి నుండియును జీవి జీవితా
నందము లకు రూపములు దిద్దుచు,
వివిధోషస్సుల రాగ రుచులపై
విశ్వ విహారము చేయుచుంటి నని ?

ఏది నీకు సుఖమో, సుందరమో,
ఏది నీకు ఆనంద మధురమో,
అది యెల్లను – ప్రియమ్మై నీ చుట్టూ
అమృత మైన దెల్లను – నేనే నని ?

# నీ వదనాకాశములో

నీ వదనాకాశములో
నీలి మబ్బు లెందుకే ?

దుఃఖ మయము జీవిత మని
దుర్బోధలు చేసి రటే ?
విషాదాంతమే బ్రతు కని
విషము నూరి పోసి రటే ?

మనుజ జన్మె పాప మని
మనసు పాడు చేసి రటే ?
కిల కిల నవ్వుటె తగ దని
గిల్లి ఏడిపించి రటే ?

రజని లోని కణ మొక్కటి
రవిని చూపు మన్న దటే ?
మనిషి లోని అణు వొక్కటి
మనషే లే డన్నదటే ?

కురిసేటప్పుడు మేఘము
కురిసి మెరిసి పోవ దటే ?
విరిసే నాడు వసంతము
విరిసి మురిసి పోడ దటే ?

# అల్లరి చేసేవా రు న్నారని

అల్లరి చేసే వారు న్నారనీ
ఆత్మ బలము చంపుకొందు వటే ?
గ్రుచ్చుకొనే ముళ్ళెన్నో కల వనీ
గులాబీని విడుచుకొందు వటే ?

మెచ్చుకొనే రసజ్ఞులే లే రనీ
కచ్ఛపినే పారవైతు వటే ?
అంధకార మలము కొన్న దనీ
అమృత కరునె నిషేధింతు వటే ?

ప్రేమించే వసంతమే రాదనీ
హేమంతము నాశ్రయింతు వటే
పగటి కలలు భగ్నమైన వనీ
ప్రణయ నిశలు వదులుకొందు వటే ?

# మానవ గుణ గీత

మానవ గుణ గీత
మాధవునికె ఎదు రీత !

సత్యమును అసత్య మనీ
అసత్యమును సత్య మనీ,
నమ్మకయే నమ్మి, ప్రజను
నమ్మించే ఆత్మ ఘాత ॥ మా ॥

రుక్మిణి ఆత్మేశ్వరి,
సత్యయే హృదయేశ్వరి,
ఎవరి జోలి లేని రాధ
ఏకేశ్వరి అయిన కత ॥ మా ॥

ఈ తీరం దూర మవగ
ఆ తీరం దగ్గ రగును,
ఎరిగి కూడ ప్రియతములను
తరిమేసే కృతఘ్నత ॥ మా ॥

# వచ్చి వేసితిరా

వచ్చి వేసితి రా !
నీ కౌగిటి వెచ్చనకై -

ఫలములకై ఆశించి,
విలయములో చిక్కుకొని,
పరమేశుడు కరుణించి,
పంజరమును భేదించి !

అందము కోరినందుకు,
డెంద మమ్ముకో నందుకు
జీవితమునె బంధించిన
శృంఖలలను త్రెంచుకొని !

ప్రణయ వసంతుడ వని నిను
పాడుటె నా నేరముగా -
నా తోటయె నను ద్రోసిన
శీతాగ్నుల నీదుకొని !

నీవు కృష్ణుడవె అయినా,
నేను రాధనే అయినా,
కర్మకు దోసిలి బట్టి,
కడ వరకును భరియించి !

# బైటు వర్షం

బైటు వర్షం, హోరు గాలి,
బంధించవే గవాక్షం !
పడకలు తడిసీ, ప్రక్కలు వణికీ,
బ్రహ్మాండమె ముడుచుక పోయినదే !

చైత్రీ సుందరి తెరచిన కిటికీ
శ్రావణి మూయుట చిత్ర మటే ?
తేనె చినుకులా ? వర్ష ధార లివి !
భూ నభాలు పగిలే పిడుగులే !

కనులు మూసుకొని,చెవులు కప్పుకొని,
గది కావల లోకమె లే దనుకొని,
నీ వెవరో, నే నెవరో తెలియని
నిశిలో ముసుగిడి నిద్రపోదమే !

# జిగేలు మని నీ హాసం

జిగేలు మని నీ హాసం
జగాలు నిండెనే !
జగాలెల్ల నను గని ఈ
మగా డెవ రనెనే !

అంత వరకు నను గూర్చిన
ఆలోచన లేని మనిషి
ఇంత అంద మెక్కడి దని
వింతగ చూచెనే !

అడవిని వెన్నెల గాసి,
జడులకు గానము చేసి,
వాడిన నా జీవ లతకు
వసంత మయ్యెనే !

తనను తానె గుర్తించని
తామస లోకము నేడు
నన్ను గూడ గుర్తించి
నమస్కరించెనే !

# పోదామా

పోదామా ?
పూర్ణ కళా హృదయులమై ?

మానవులకు చొర రాని
మధుర విశ్వముల లోకి ?
ఇద్దరమే ఒంటరిగా
ముద్దులతో అద్దరికి -

మోడులైన మనుగడలకు
మొగ్గలమై వికసించుచు,
వాడిన యెదలకు తొలకరి
వానలమై విలసిల్లుచు !

ప్రాణ రసాలిని శాఖల
ప్రణయ గీతములు పాడి,
అలసి, ఒకరిలో ఒకరము
ఆనందముగా కరగుచు !

అనురాగములో తనువులు
హారతి కర్పూరమె యై
ఆత్మ లొకటిగా విరిసీ
అవని నిండ సురభించుచు !

# నీ లాంబర హేలాంబరి

నీ లాంబర హేలాంబరి !
బాలేందు కళా కబరీ !
వెళదామా గోదావరి
అలల పైకి వాహ్యాళి ?

నిన్ను కూడి గౌతమిపై
వెన్నెలలో విహరించగ,
గంగా కర పరి లాలిత
కామేశ్వరు నౌదు కదే !

విశ్వ గాన రమవు నీవు,
విశ్వ నర్తకుడ నేను !
నీ గీతికి నా గజ్జెలు
నిత్య శ్రుతులై సాగ !

ఆర్ద్ర హృదయముకు వెనుక,
ఆశ్లేషమునకు ముందు,
ఆనందములో పొంగి
ఆది మిధునమే కాగా !

# తగు సమయ మిదేనే

తగు సమయ మిదేనే !
ధరణిని రస భరణి చేయ !

అదిగో జాబిలి విరిసెను,
నదిపై వెన్నెల కురిసెను,
కలువ పూల పడవలపై
కదలినారు తారాదులు !

ఉల్లములో ప్రియుని మూర్తి
ఊయెల లూగుచు నుండ,
ఆనందము పట్టలేని
అలల గుండెలను వినవే ?

అలలకు ముద్దులు, చంద్రుని
కళలకు సుద్దులును నేర్పి,
ఆ యీ సుధలను తెచ్చి
అవనీ వ్యథలను బాపగ !

పైని మిణుకు తారలకు
లోన కునుకు మీనులకు
అందరికీ సుధా బ్రహ్మ
అమృత రసములను పంచే !

# గోదావరీ గోదావరీ

గోదావరీ ! గోదావరీ !
గోదావరీ ! పూర్ణ గోదావరీ !

రవి చంద్ర తారాది
రత్న భూషిత కబరి !
రత్నా కరార్చిత చ
రణ పద్మ మంజరీ !

త్ర్యంబక తలో దరీ !
త్ర్యంబక మహో ఝరీ !
కుట్మలిత భద్రగిరి !
కోటి లింగేశ్వరీ !

సప్త ఋషులకు తప
శ్శక్తి నొసగిన గౌరి !
భక్త జన మందారి !
పరమ ముక్తీశ్వరీ !

శాల్యన్న ఫల పుష్ప
స్వాదు మధు మాధురీ !
సంతతత వసంతాంధ్ర
సౌభాగ్య శాంకరీ !

# పాడవే సఖీ

పాడవే, సఖీ !
నన్నే ఒక పాట జేసి –

గోదావరి అలల మీద
గోలోకము లాడగా,
కోన సీమ గుండెయె ఒక
వీణా మండలము కాగ !

శ్రీశుని చరణాబ్జ మధువు,
శ్రీకంఠుని శిరసీ సుధ,
గౌతమి కంటే భువిలో
శ్రీ తత్వము మరి లేదని ?

ఆ యనాది కోన నుంచి
ఈ అనంత తీరాలకు
ప్రేమ తంత్రులను కూర్చి,
కామ వర్ధనికి చేర్చి !

వివిధ రూపములు తాల్చి,
వివిధ రుచుల నను దనుపుచు,
సర్వ విశ్వమును నీవై!
సర్వేశుడ నేను కాగ !

# గువ్వల గుస గుసలా

గువ్వల గుస గుసలా ?
పిచికల కిచకిచలా ?
చిలకల గోరింకల
పికముల పక పకలా ? ॥ గు ॥

గోదావరి తీరం
వేదాలకు పారం
మునిగణ ఘోషణలో !
జనగణ భూషణలో ! ॥ గు ॥

బుక్కులె బుక్షాలై
రోదసి సభ వీడి
కోమల కోన సీమ
కొమ్మల జేరెనవో ! ॥ గు ॥

మహి గల ఎల్ల రుచులు
మధు రసములు గ్రోలి
కాలము గడుపుకొనే
కవితా గానములో ! ॥ గు ॥

# పాటలా

పాటలా ?
ఇవి పాటలా ?
ప్రణయ రంజితము లౌ నా
ప్రాణ వాయువులు గాక ?

ప్రతి శబ్దము వసంతముగ,
ప్రతి వర్ణము మధు కణముగ,
ప్రతి రాగము సుఖ జీవన
పరమముగా విరిసిన వివి ?

దుఃఖితులకు ఓదార్పులు,
దుర్బలులకు అభయములు,
విరహ తప్తులకు చందన
తరు లతా నికుంజము లివి ?

ప్రతి ఇంటికి దీపములై,
ప్రతి గుండెకు రూపములై,
జీవిత పరమార్థములై,
శ్రీ నిలయము లైన ఇవి ?

చీకటులను తొలగించే
జీవిత మధుమాసము లివి ?
జీవికి సఫలత కూర్చే
సిద్ధామృత రస నిధు లివి !

# కలలు దేనికే

కలలు దేనికే ? నీ
అలలు దేనికే ? కడలీ !

ఈ వసంత రాగములో
ఈ విశాఖ తీరములో
ప్రణయేశుని గుండెలపై
పవ్వళించి యున్న నాకు ?

తరగల దరి, తడి ఇసకలొ,
తారలతో ఆడుకొనుచు
ఆత్మ విభుని వదన కలశి
అధర సుధను నింపు నాకు ?

చంద్రవంక వింట శుక్ర
సాయకము విజృంభించగ,
ఫాల్గునాంతమై, వసంత
భాగ్యోదయ మైన నాకు ?

పాల కడలి తరగలలో
పరమ పురుషు కౌగిలిలో
పరవశనై, పరమమునై,
పరిపూర్ణనె యైన నాకు ?

# ప్రతి యింట నీ పూజ

ప్రతి యింట నీ పూజ చేయించనా ?
ప్రతి నోట నీ పాట పాడించనా ?
ప్రతి ప్రొద్దు నీ ముందు
పద్మాంగనల చేత
వేల రవి దీపాలు
వెలిగించనా ?

ప్రతి కోర్కెలో నిన్ను పూయించనా ?
ప్రతి గుండెలో నిన్ను పండించనా ?
ప్రతి నుదుట నీ పాద
పారాణి శోభించ,
ఈరేడు లోకాలు
ఏలించనా ?

ప్రతి తలపు నీకేసి తరలించనా ?
ప్రతి మధువు నీలోకి మరలించనా ?
ప్రతి సుఖమునకు నన్ను
శ్రుతి చేసుకొని, నిన్ను
రాభీ రమగ నిల్పి
రాగ మొలికించనా ?

# నాతో ఉన్నది నీవు కదా

నాతో ఉన్నది నీవు కదా ?
నాలో ఉన్నది నీవె కదా ?

వేగు జుక్కతో విరిసిన వేళ,
అరుణ సంధ్యలో ఉరికిన వేళ,
లలిత పవన సంలాలిత వికసిత
నలి నాళులతో అలరిన వేళ ?

విధుల, ధర్మముల వేగిన వేళ,
బెంగల, బాధల క్రుంగిన వేళ,
చండ భానుతో సవాలు చేసి
బ్రతుకు బరువుతో బడలిన వేళ ?

చిమ్మ చీకటులు క్రమ్మిన వేళ,
వెన్నెల వలపులు పిలిచిన వేళ,
అవని నెల్ల రాగాంబుధి ముంచి
కోయిల గూటికి పోయిన వేళ ?

నీ విరహములో మరిగిన వేళ,
నీ కౌగిటిలో కరిగిన వేళ,
వేళా వేళల అధిగమించి ని
ర్వేళా స్థితిలో ఉండిన వేళ ?

# ఎటు చూచినా ఆనందాలే

ఎటు చూచినా ఆనందాలే !
ఈ నా బ్రతుకంతా అందాలే !

ఏవో పువ్వులు, ఏవో ఫలములు,
ఏవో పాటలు, ఏవో ఆటలు,
ఏవో చల్లని వెన్నెలలే ! నా
జీవిత మంతా క్రొన్ననలే !

మనసే పికమై గానము చేయ,
మమతలె మామిడులై చిగురింప,
పెదవులు కలిసి మధువులు గ్రోలే
ప్రేమ వసంత నిరంతర గతిలో !

ఋతు లహరిని కలహంస వోలె నా
యెద అందములనె స్వీకరించగా,
లోప రహిత సౌందర్యముతో నీ
రూపమె నిత్య వసంతము నాకు !

ప్రేమకు మనుజుని మలచిన శిల్పా
రాము మైన నా కవితా సృష్టికి !
హైమవతీశుని గొల్చి నరునికే
ప్రేమను మలచిన నా హృదయానికి !

# రసాద్వైతులం

రసాద్వైతులం – మనం,
రసా స్వాదకులం – మనం !

చీకటిలో వెన్నెల వలె
స్నేహ చందనం – మనం,
పరమాత్మకు జీవాత్మకు
ప్రణయ బంధనం – మనం ॥ ర ॥

చదు వక్కర లేదు, ఏ
పదవితో పని లేదు,
త్రిశుద్ధిగా ఒక్కటైన
త్రిగుణైక నిరంజనులం ॥ ర ॥

పని రూపం పర బ్రహ్మ,
పని చేయుటె సృజన !
పనితనమున నిత్య కళా
పరవశులం – మనం ॥ ర ॥

మబ్బు కరిగి కురిసి నటు
మధువు పెరిగి విరిసి నటు
శూన్యములో సుమ లతలం,
సుమ వనిలో శుక రథులం ॥ ర ॥

# ఆడరా

ఆడరా –
అగజా మనోహరా !

అభినయమున నీవు
ఆమని వైనావు,
నీ కన్నుల కదలికలే
లోకాలకు బ్రతుకులురా ! ॥ ఆ ॥

లాస్యముతో నృత్యముతో
లలితవై, శారదవై –
రస భావ కళా కాంతుల
ప్రాణ భూతమై – నిరతం ॥ ఆ ॥

ఎంత కాల మాడెదవో
అంత కాలమే సృష్టి,
అమృత జీవ సూత్రధారి !
ఆగకురా ! అలయకురా ॥ ఆ ॥

సరసాత్మను పోషిస్తూ
విరసాత్మను తొలగిస్తూ
ఎల్ల మానవులు నొకటై
ఏకాత్మను సాధించగ ॥ ఆ ॥

# శ్రీ చైతన్య పయోజా

శ్రీ చైతన్య పయోజా !
చేకొనవే నా పూజ !

స్వర్ణ చిత్ర సౌగంధిక శోభా !
సప్తలోక జీవన పూర్ణా భా !
శత సహస్ర తారావర దీప్తా !
ప్రతీత లలిత కళా ప్రాప్తా !

శంఖ చక్ర కమలాకర లాలిత
సమ్మద రక్తోత్పల ముకుళా !
శ్యామల సుఖదా వక్షోంకిత హే
మాంబుజ పరాగ పటలా !

వర వసంత గంధవహ పరిష్కృత
పరివర్ధిత మధుప ప్రకరా !
త్రికూటాగ్ర శీతాతప వికసిత
త్రివర్ణాబ్జ రుచిరా !

యోగా యోగా ! భోగా భోగా !
ఉగ్ర లలిత లలితోగ్ర జీవదా !
అమ ఉమ రమ త్రిపుటీ ప్రభాసినీ !
ఆనంద రసాద్వైత విలసనీ !

# కళా ప్రపూర్ణుడవు నీవె

కళా ప్రపూర్ణుడవు నీవె కదరా,
సకల కళా పూర్ణధరా !

బాల కళకు పూర్ణత్వమ ?
బాల కళిక శత పత్రము ?
బాలేందు శేఖరా !
నీ లీల అనంతమురా ! ॥ క ॥

మువ్వే మంజీరమా ?
ముద్రే జగ దిలి వృత్తమ ?
నృత్య కళా హృదీశ్వరా !
నీ కరుణ అపారమురా ! ॥ క ॥

పేద కింత ఐశ్వర్యమ ?
ప్రేమ ఇంత అక్షరమా ?
నిఖిల కళా పూర్ణధరా !
నీ ప్రతి కళ నీవేరా ! ॥ క ॥

# శారదా

శారదా !
సకల కళా విశారదా !

ఎందు కమ్మ నా కింతటి
ఎత్తైన పీఠం ?
ఆత్మ లోన చోటిస్తివి,
అంతె చాలదా నాకు ? ॥ శా ॥

కళా ప్రపూర్ణత్వం నీ
కళ్యాణి రాగమే !
స్వరమె తెలియని నేను ఈ
శ్వర కేళికి రాజు నటే ? ॥ శా ॥

సరే లెమ్ము, వాణీ ! నీ
సరదాయే కానీ !
నాలోనే ఉండి, నను
నడుపుకొనుట మరువకుమీ! ॥ శా ॥

# మానవుడే

మానవుడే !
మహాత్ముడే !

మానవుడే మహాత్ముడు,
మహాత్ముడే మానవుడు,
మానవుడే గతి తప్పిన,
మహికి ఇంక గతి ఎవడే ?

సృష్టిలోన మానవుడే
శివుడంతటి వాడు,
శక్తిలోన మానవుడే
సర్వేశ్వరుడు !

అవరుద్ధుడు మానవుడే
అనిరుద్ధుడు మానవుడే,
ఉభయుల సహజీవత్వమె
ఉర్విగత దైవత్వము !

స్వార్థానికి స్వస్తి చెప్పి,
సర్వ సమత్వము మెప్పి,
శ్రామికునికి, ప్రేమికునికి
సముడై వర్తించు వాడె –

# దీపం

దీపం!
నీవు దీపం !

అన్ని వైపుల పదనుతో
అంధకారమును నరికి,
అందాలను డెందాలను
అవని నిండ పండించే –

నిశితమ్మైన కాంతితో
నిత్య నూతన రుచులతో
ప్రకృతి రహస్యాంతఃపుర
ప్రభను నాకు చూపించే –

నీకు ముందు, నీకు వెనుక
నీ దీపము నే నైనా –
నీవు వెలిగినంత సేపు
నీవె నాకు దీపం !

# నమస్కారం నమస్కారం

నమస్కారం, నమస్కారం ,
నమస్కారం, ఈశ్వరీ !
నమస్కారం పరమ విద్యా
నంద లహరి ! శివంకరీ !

నమస్కారం రస రమా మధు
నాట్య తారా మందిర !
నమస్కారం అక్షరాక్షర
కమల నట దిందిందిర !

నమస్కారం వేద సాహితి !
నమస్కారం నాద భారతి !
నమస్కారం శ్రీ సరస్వతి !
నమస్కారం భగవతి !

భీమన్న

# రాభీలు

# రాగోదయం గేయాల అనుబంధం

## గది గది కొక సుందర

గది గది కొక సుందర దీపం
అవి కలిసినదే నీ రూపం
త న్మంగళ మహా కళారాధనలో
పొంగిన దిది నా హృదయం !

కొస కొస కొక సురభిళ సూనం
అవి కూడినదే నీ స్థానం
త న్మధురానంద మరంద ధారలో
తనిసిన దిది నా హృదయం !

ఎద ఎద కొక సురుచిర భావం
అవి పొదిగినదే నీ జీవం
త న్మోహన మహిత పురోగమనంలో
మ్రోగిన దిది నా హృదయం !

# గొంతెత్తి నీ గీత వినిపింతునా

గొంతెత్తి నీ గీత వినిపింతునా ?
గంతేసి నీ చరిత వెలయింతునా ?

సామ సోమ పయోధి సార మైనావు,
వాణి వీణా వీధి వాద మైనావు,
మధుర నాద బ్రహ్మ మధువు త్యాగ బ్రహ్మ
విశ్వ వదన విధాన వేణువే నీవు ! ॥ గొం ॥

ఋక్కు ప్రేమాపాంగ దృక్కు వైనావు,
భారతీ హృదయార్ద్ర భావ మై నావు,
శర దిందు హాసమై, సౌందర్య లహరివై,
కరుణ రుద్ధ గళాన కావ్య మైనావు ! ॥ గొం ॥

ప్రణయ కేళీ సరః ప్రతి బింబ మీవు,
వర సరస్వతి చేతి చిరు కుంచె వీవు,
ఇందీవ రాక్షిగా, హిమవంతు సంతుగా
చిత్రమై, శిల్పమై, సృష్టి యైనావు ! ॥ గొం ॥

చైతన్య వీచికా స్పందనము వీవు,
బ్రాహ్మీ పదాస్థాన భంగిమవు నీవు,
నటరాజు పడకవై, నవరాస కేళివై,
నవరసమ్ముల కీవు నాభి వైనావు ? ॥ గొం ॥

# నీ వాలు చూపులో

నీ వాలు చూపులో
ఏ వాలు కలుగునో,
ఒక నిరంకుశు నన్ను
ఒక నియంతను నన్ను
చూపు లోనే పట్టి ఆపివేశావు !
ఊపి వేశావు !!

నీ మోని తేనెలో
ఏ మొలక లున్నవో,
ఒక నిరామయు నన్ను
ఒక నిరంజను నన్ను
కొదమ ముద్దుల ముంచి పదును చేశావు !
అదును జూశావు !!

నీ కల్కి పల్కులో
ఏ కల్ప మున్నదో,
ఒక అపారము నన్ను
ఒక అనంతము నన్ను
చేతిలో చేదగా చేదుకున్నావు !
చేర్చు కున్నావు !!

# ఏ సఖుని ఊహాలో

ఏ సఖుని ఊహాలో
ఈ కుసుమ వల్లికకు
గిలిగింత కలిగించె !
పులకింత లొలికించె !

ఏ సఖుని చూపులో
ఈ సుమాంకురమునకు
కను దోయి తెరిపించె !
నును సిగ్గు మొలిపించె !

ఏ సఖుని చిరునవ్వో
ఈ పుష్ప కన్యకకు
వలపు రేకెత్తించె !
వలవంత పుట్టించె !

ఏ సఖుని కరములో
ఈ సూన సుందరికి
సంభ్రమమ్మును గూర్చె !
స్వాధీనత సడల్చె !

ఏ సఖుని పెదవులో
ఈ ప్రసవ కామినికి
అమృత జీవన మిచ్చె !
ఆత్మలో తావిచ్చె !

# విరియ బూచిన

విరియ బూచిన గులాబీ తోట వీవు,
నే నొక్క చిరు తేటి కైన చాలుదునె ?
అనుభవించగ నిన్ను - అవకాశ మేది ?

విరగ బండిన పెద్ద వరిచేను నీవు,
పీల గింజల నేరు పిచ్చుకను నేను,
ఆశయే గాని, నా కవకాశ మేది ?

ప్రతి కళా, ప్రతి హేల, ప్రతి రుచీ, ప్రతి రోచి,
నిన్ను నిన్నెల్ల నా నిండు కౌగిట బట్టి
అనుభవించగ చాల - అభిలాష గలదు.

ఎన్ని అరుణోదయా లెన్ని తరుణోదయా
లెన్ని కల్పాంతరా లేగునో, ఓ చెలీ !
పూర్తిగా ఒకసారి పొందుటకు నిన్ను !

సృష్టి సృష్టియె నా పరిష్వంగమున వచ్చి,
కోటి ఆమను లొక్క కోరకములో విచ్చి,
మోవి కందిన నాడు - నీ వందినట్లు !.

సూర్యు నొక మాత్రగా చుట్టి, వెన్నెల విడెము
సేవించి, విశ్వమే నీవుగా నిలువగా -
నిస్సీమలో మనము డస్సిపోవాలి !

# నీవు రాక చనగలనా

నీవు రాక చనగలనా ?
నీవు లేక మనగలనా ?

కష్టానికి, కష్టానికి
కత గూరుస్తావు,
కతకూ, కతకూ బ్రతుకున
జత జేరుస్తావు ॥ నీ ॥

చెమ్మట బొట్టొక దానికి
చేతన మిస్తావు,
కన్నీటికి, మున్నీటికి
కాలువ త్రవ్వేవు ॥ నీ ॥

లోకం విసిరే రాళ్ళకు
పాకం పడతావు,
సంఘం ముసిరే మంటల
స్నానం పెడతావు ॥ నీ ॥

బాధలతో, బాధ్యతలతొ
భారమైన జీవ యాత్ర
ఒంటరిగా – జంట లేక –
ఒక్కడినే – ఎక్కడికో – ॥ నీ ॥

# కుప్ప నూరుపులలో

కుప్ప నూరుపులలో
కోటప్ప పొలి పదము
ఊడుపుల చేలలో
ఉయ్యాల తొలి పదము
ఒక్కటే పదమోయి !
ఒక్కటే ముదమోయి !

చలి మంటలో బ్రతుకు
చాలించు కారాకు,
మొలక మొగ్గను దాగి
పులకించు మారాకు,
ఒక్కటే ఆకోయి !
ఒక్కటే మ్రా కోయి !

నీ తల్లి పూజలో
నివృతి నొందిన పువ్వు,
నీ కాంత మోజులో
లోక మేలిన పువ్వు,
ఒక్కటే పూవోయి !
ఒక్కటే తావోయి !

# వన్నెలను చూపింప

వన్నెలను చూపింప
వచ్చు ప్రత్యూషాభ,
వెన్నెలను శయనింప
వెడలు సాయంశోభ,
ఒక్కడే రవివోయి !
ఒక్కడే కవివోయి !

ఉగ్ర వారిధి గుండె
ఉద్రిక్త భంగాలకు,
మధురమౌ నీ గుండె
శిథిలమౌ కెరటాలకు
ఒక్కటేనోయ్ మూలం !
ఒక్కటేనోయ్ తీరం !

కాలాని కొక రీతి,
కథ కొక్క రీతిగా,
అవతరించే రుచుల
అనుసరించే పుటల
ఒక్కటే మధువోయి !
ఒక్కటే చదువోయి !

# ఈ యెడారి నే గొడారి

ఈ యెడారి నే గొడారి
ఇడిన పాదరక్షలో – ?
ఈ నల్లని గిరి వాగులు,
ఈ చల్లని తరి నీడలు,
అడు గిడనా – వెడలిపోన
వడ గాడుపు బ్రతుకు లోన ?

ఈ నిదాఘు నే హ్యాతాఘు
ఏర్పరచిన చలివేంద్రలో ?
ఈ తారక, ఈ చంద్రుడు,
ఈ ప్రభాకరుడు, ఈ ప్రభ,
ఆగుదునా – సాగిపోన
అలసిన నా యాత్ర లోన ?

ఈ యడంగు నే సరంగు
ఈ నౌకకు లంగ రిడెనో !
పయన మౌనో ఏ పగటికి ?
పారిపోవునో రేయికి ?
తరలుదునా – తగ్గిపోన
తరుగు లేని తిమిరాన ?

# ఆ వేసవి సాయం వేళ

ఆ వేసవి సాయం వేళ,
ఆ విరిసిన మామిడి నీడ,
బోటీ ! నీ చెప్పిన గోడు
పాటైనది నా కీనాడు !

ఆ కథనే కోకిల పాడు,
ఆ కరుణే పూవుల నోడు,
ఈ కమ్మని తావుల లోన
ఆ కన్నీరున్నది, చాన !

ఆ చెరువున నిండిన నీరు
మా చేలో నెదిగిన నారు,
నీ తొలకరి మెరుపుల ప్రాయం
నా తృష్ణకు తోడిన తోయం !

నిను పుడికిన గోరుల మొనలు
నను పొడిచిన శూలపు కొనలు,
నీ సడలిన కబరీ బంధం
నే వదలిన గీతా గ్రంథం !

తడి యారని కన్నుల కావ్యం
సడ లించెను నా కర్తవ్యం,
నిను దాచిన సంధ్యా రాగం
నను దోచిన కాలపు భోగం !

# పయనించు సెలయేటి

పయనించు సెలయేటి - పాదములు కడిగి,
శయనించు కోనేటి - సంపదల నడిగి,
ఆ యంద, మీ చంద మందు కోవే, చెలీ !
నీ జాడ లీ నీడ నిలిపి పోవే, చెలీ !

పరిమళించే బాట - పరుగెత్తి పోనేల ?
వలపు గొలిపే తోట - వడి నడిచి పోనేల ?
ఈ పూవు, లా తావు లేరుకోవే, చెలీ !
నీ జాడ లీ నీడ నిలిపి పోవే, చెలీ !

జరిగిపోయే రోజు - మరలి రా గల్గునా ?
కరిగిపోయే మోజు - తిరిగి రేకెత్తునా ?
ఆ వేగ, మీ రాగ మాగికోవే, చెలీ !
నీ జాడ లీ నీడ నిలిపి పోవే, చెలీ !

అందముగ పోదాము, - తొంద రేలా మనకు ?
రంగులను చూదాము - బెంగలేలా బ్రతుకు ?
ఆ తత్త్వ, మీ సత్త్వ మాదుకోవే, చెలీ !
నీ జాడ లీ నీడ నిలిపి పోవే, చెలీ !

పిలుచు తలపున కెల్ల పలికి -
పలుకు వలపుల నెల్ల పిలిచి -
ఆ భోగ, మీ త్యాగ మందుకోవే, చెలీ !
నీ జాడ లీ నీడ నిలిపి పోవే, చెలీ !

# ఇచటనే పగులునో

ఇచటనే పగులునో – అచటనే పిగులునో,
ఎట నేమి తగులునో – ఇట నేమి మిగులునో !
ఏ నిమిష మా నిమిషమే, ప్రియతమా !
ఏ నాటి దా నాటిదే !

మారు చిను కెదొ రాలి – బూరటిల్లిన బుడగ
నడవ గానోవునా ? కడలి బోగల్గునా ?
కళ్ల మేసే యడంగు, ప్రియతమా !
పల్ల మేసే సరంగు !

మబ్బు నురుగున లేచి – సప్త రంగులు మోసి,
రమణీయమై, ఏల – రవి తేరుకై గోల ?
బొప్పాయి పూల మీద, ప్రియతమా !
గొప్పలకు పోవ నిమ్ము !

కాగితపు పడవపై – కాశీకి పోవునో !
గాలి పటమున దేలి – కై లాస మేగునో !
స్వప్నాలు కాంచనిమ్మా ! ప్రియతమా !
సంతృప్తి పొందనిమ్మా !

బుడగతో భువి జూడు – భువి తోడ రవి జూడు,
అతి మితమ్ములు తప్ప – అనుభూతు లొక టేసె !
ఆ పైనమే – వైనమే, ప్రియతమా
ఆ పరుగులే – మరుగులే !

# కలకాలము తపించి

కలకాలము తపించి - కలలోని నిను గాంచి,
కదలి నిను చేరగా - కదలకున్నావుగా!
నను కదిపినావే ! నిను కదుప నీవే!

మధుర భావ సమాధి- శిధిలమైన నిశీధి,
వలపించి ఈ మ్రోడు - పలికించితివి నేడు
పలికి నిను పిలువగా - పలుక కున్నావుగా !

స్వప్న జీవిగ నన్ను - చాటు చేయకు కన్ను
కలచూపు లేనిదే - కలరూపు కలుగదే,
కల లేనిదే చెలీ! ఇల లేదె ఓ చెలీ.

కలలు గాంచెడి వాడు - కాలానికే రేడు,
నేటి కలయే రేపు - నిజ రూపమున లేపు!
నిన్న నీ వెవ్వరే ? చిన్ని నా యరవిరీ!

కల కరిగితే - నీవు - కల- నీవు కరిగితే
కల - నిజాలకు మధ్య, కలను నే నొకడే నె
కరుణింతువా నన్ను ? కరిగింతునా నిన్ను?

కలకు గొనిపోయి నిను - మెలకువకె రానీను
అటుకేసి పయనమై-అవ్యక్త మధురమై,
నిను బోలు రాగాల - నిర్మింతము జగాల?

# ఎవ్వారోహో ఈ ప్రభ

ఎవ్వారోహో, ఈ ప్రభ!
ఏ మహో, ఈ సుప్రభ!
నిదుర పోయిన నన్ను లేపిన ఉదయ తారక ఈ ప్రభ!
సోలి వాలిన నాకు తీయని జోల పాడిన ఈ ప్రభ!

తెల్ల వారని కాళ రాత్రికి
ఎర్ర దామర వలపుగా,
చల్లబడని ప్రచండ శక్తికి
నల్ల గలువల పిలుపుగా ॥ ఎవ్వ ॥

మోయ జాలని చీకు చింతల
మూలిగే నా గుండె నుండి
బరువు దించిన కరుణయో!
కరుణ పంచిన తరుణయో! ॥ ఎవ్వ ॥

తీరుబడిగా పువ్వు పువ్వుకు
తిరుగు సీతా కోక చిలుకకు
వన్నె దిద్దిన వాణియో!
కన్ను దిద్దిన కాళియో! ॥ ఎవ్వ ॥

సాటియే కార్తీక రాకా
కోటి కోటీర ప్రభ!
పోటియే మధుమాస వాటీ
పూర్ణ చైతన్య ప్రభ! ॥ ఎవ్వ ॥

# వ్రాయుచుంటివి నన్ను చూచే

వ్రాయు చుంటివి నన్ను చూచే,
గీయు చుంటివో చిత్ర మేదో ?
నలుపు తెలుపుల నడుమ నెర్రని
నా యెడందను పట్ట గలవా ?

చిమ్మ చీకటి మోము చూచే
చెక్కు తున్నా వే జగత్తో !
రాల్చవు కదా భావ తారల ?
చీల్చవు కదా హృదయ భానుని ?

కారు మబ్బుల కన్ను చూచే
కలుపు చుంటివి రంగు లేవో !
వలపు వాగుల నీద గలవో ?
తలపు తీగల పూాయ గలవో ?

# కృష్ణా ! కృష్ణా !

కృష్ణా ! కృష్ణా !
ముజ్జగాలు మోహించగ
మురళిని వాయించరా !

శంఖమేల ? చక్రమేల ?
సారథ్యము లేలరా ?
అస్త్ర శస్త్ర జాల మెల్ల
యమున బారవైచి రార !

ఎందుకు మధురా నగరి ?
ఎందుకు ద్వారకా పురి ?
బృందావని వీడి నీవు
పొందిన సుఖ మే మున్నది ?

పక్షపాత మేలా ? నీ
పక్ష మేది గోపాలా ?
మురళి కన్న, రాధ కన్న
కురు క్షేత్రమే మేలా ?

ప్రాపంచిక చింతలతో
ప్రాలు మాల నేలరా ?
గో లోకము నీ కోసము
గోల చేయు చున్నదిరా !

# తీవగా నిను వలచి

తీవగా నిను వలచి – పూవునై యున్నాను,
తావి దూతిక బంపి – దారి కెదు రున్నాను,
ఈ కెలన రావా ?
నా కేసి చూడవా ?

తోపు లోపల దాగి – తోట మాలిని దాటి,
చిగు రాకు నీడలో – చేరి నిలుచున్నాను,
ఈ దారి రావా ?
నీ దాస నెరుగవా ?

వలి గాలి రాపిడుల – నలిగిపోవుచు నుంటి,
మిసమిసల కొసలలో – మస కేదొ కనుచుంటి,
ప్రేమించి రావా ?
ప్రేయసిని చేయవా ?

భూ సారములు తీసి – ఆసారములు మోసి,
కష్టించి, తుదకు నీ – ఇష్టమై విరిసాను !
నను కోరి రావా ?
నా పేరె పిలువవా ?

సంప్రదాయ సువర్ణ – సంస్కృతీ మధుపర్ణ,
పూర్ణ హృదయము నేల – దీర్ణ మొనరింతువో ?
నా స్వామి, రావా ?
నన్ను పాలింపవా ?

# వేగు జుక్క కన్నులతో

వేగు జుక్క కన్నులతో
వెదకి వెదకి చూచెదవే !
అవకాశపు మెదడు కరిగి,
ఆలోచన పరిధి విరిగి,
చెల్లా చెదరై పోతిని
చెల్వా, నీ వాకిటిలో !

క్రొందామర కన్నులతో
గ్రుచ్చి గ్రుచ్చి చూచెదవే !
అనురాగపు గుండె పొర్లి
అనుభూతికి గండె దొర్లి,
కురిసితివే పన్నీరై
తరుణీ, నీ గుమ్మములో !

చిలిపి చేప కన్నులతో
చిలికి చిలికి చూచెదవే !
ఆశాంబుధి అడుగు పగిలి,
ఆకాంక్షకు అవధి తగిలి
పారాణిగ వ్రాలితినే,
పడతీ, నీ యడుగులపై !

# లలిత లలిత పల్లవ లవ

లలిత లలిత పల్లవ లవ
ఫలకముపై తేనె రాచి,
అంచిత కుసుమాంకూరపు
కుంచియతో బొమ్మ గీచి
తెచ్చినదే నవమాసం !
ఇచ్చినదే బహుమానం !

సుందరతర సుపరీమళ
సుమవనినే వీణ జేసి,
కలకంఠ కుహూ కలకల
కంఠములో పాట వ్రాసి
తెచ్చినదే నవమాసం !
ఇచ్చినదే బహుమానం !

ఈ చిత్రము నీ రూపమె !
ఈ గేయము నీ నామమె !
నా దానినె నా కిచ్చిన
నవమాసం బహు జాణ !
మెచ్చితినే నీ హాసం,
వచ్చితినే నీ కోసం !

# ఈ పుష్కల కైరవ లీలా

ఈ పుష్కల కైరవ లీ
లా పుష్కరిణీ తటమున
నడిచి, నడిచి, గెంతి, గెంతి,
పడుచు పడుచు పరువు లెత్తి,
ముచ్చటగా సాగి పోన ?
వచ్చిన చోటికె రానా ?

ఈ ప్రతీర వృక్ష లతా
సుప్రభాత గాన లహరి
మునిగి తేలి, మునిగి తేలి
మోహోవధి వీధి వాలి,
ప్రణయార్ద్రం ముంచి తేన ?
పాడినదే పాడుకోన !

ఆ మానస మధ్యం గత
హేమాంబుజ ధామములో
చూచి, చూచి, చూచి, కేలు
సాచి, చాచి, చాచి, లేచి,
ఉరికి నిన్ను కలుసుకోన ?
ఒడ్డు పైనె నిలిచిపోన ?

# రస స్వరూపా రావోయీ

రస స్వరూపా రావోయీ !
వసంత మింటికి తేవోయీ !

అందముతో నింపుము నా కన్నులు,
డెందముతో నింపుము నీ తెన్నులు,
మంద మందముగ నవ దిందిందిర
మందిరాలు నీ కొసగుదు నోయి !

స్పందించదు నా హృదయ విపంచి,
స్పర్శింపుమ నను దయ యుంచి,
బాగు పరచి నీవే మ్రోయించి,
తీగల రాగము లూరించి –

చీకటి ప్రమిదెను కరుణ వోసి, నా
చింతా హేమంతము వెలిగింపుము,
మ్రోడులు చిగురించుము నీ చేత !
బీడులు ఫలియించును నీ మ్రోత !

అమృత హృదయ మొక అంచు వంచి, నా
ఆశా లత పూయించ గదోయీ !
పూచిన జీవన పుష్ప మెల్ల నీ
పూజనె నిల్పుదునోయీ ! !

# భయమా ఓ ప్రణయ శీల

భయమా, ఓ ప్రణయ శీల !
బ్రతుకు జూచి భయమా ?

మలయ సమీరుని కౌగిట
పులకింపగ భయమా ?
కలువ రేని కర తలాన
కరిగి పోవ భయమా ?

చిగురాకుల కిటికీలలో
చిరు నవ్వులు కనిపించె ?
తొలి మబ్బుల గాలి తెరల
తొలగింపులు వినిపించె !

ఆషాఢము, మార్గశిరము
అధిగమించి కాలమునే,
మన కోసము వేచి యున్న
మధు మాసము జూచి భయమా ?

అంతులేని ఆనందము
ఆహ్వానించినది మనల,
అంది నంత వరకు పోయి
అనుభవించు కొరకె రేయి !

# పక్షి గూటిలో నున్నంత సేపే

పక్షి గూటిలో నున్నంత సేపే
పక్షికి గూడు, గూటికి పక్షి,
గూడు దాటి పోవ,
జాడ తీయ గలవ ?

ఆశలు తీరని అంతరంగమున,
ఆశే యెరుగని అంతరాళమున,
అడుగు నిలుప గలవా ?
ఆనవాళ్లు కనగలవా ?

ఏ వసంత సహకార లతాంతమొ !
ఏ లతాంత మధుసార నిశాంతమొ !
తెలుసుక పోగలవా ?
పిలుచుక రాగలవా ?

జడి వానలో, ఏ వడి తుపానులో,
నడి యెడారులో, నవ నీరధులో,
మ్రొక్కులు వినగలవా ?
దిక్కువు కాగలవా ?

మూర్ఛనమో ఏ ఇంద్ర ధనుస్సున,
మోహనమో ఏ చంద్ర వయస్సున,
అదను కాయ గలవా ?
హృదయ మీయ గలవా ?

# వెదకి వెదకి వేసారి

వెదకి వెదకి వేసారి
వెఱ్ఱి నైతి నీ దారి !

ప్రాణముతో బేర మాడి,
ప్రణయ సారములను తోడి,
పెంచు కొన్న రాగ లతిక
పిలుచు, వలచు నను కోరిక ॥ వె ॥

కన్నె పూల పూజతో, ప్ర - సన్ను రాల పైన నీవు
ఏ తీవను వెలతువో యని - ఏ కొమ్మను పిలతువోయని ॥ వె ॥

చేప రాణి చూపులలో - చెంగల్వల బెంగలలో,
నవ్యాపగ నవ్వులలో - నాగ కన్య నడకలలో ॥ వె ॥

నవ్వు నీదె య్యైన చోట - నడక నీది కాకపోవు,
ఏవు నీదె య్యైన చోట - చూపు నీది కాక పోవు ! ॥ వె ॥

నీవె యనుచు వెంట బడిన పూవు లెన్నొ మూతి ముడిచె !
నిన్నె యనుచు అంటుకొన్న - వన్నె లెన్నొ చిన్న వోయె ॥ వె ॥

ఒక రూపున నొక రుచిగా - ఒక రుచిలో ఒక రూపుగ
కనిపించే ప్రభును నిన్ను - కాంచెద నే సభనో యని ॥ వె ॥

ఇట నొక రుచి, అట నొక కళ - ఏర్చి నిన్ను కూర్చుకోన ?
తీయని నా అభిరుచినే - తీర్చి నిన్ను చేర్చుకోన ? ॥ వె ॥

# గోదావరి గుండియతో

గోదావరి గుండియతో,
కోన సీమ కోరికతో,
ఉవ్వెత్తుగ పొంగినాను,
ఉర్వరపై వంగినాను
నీ కోసం !

రత్నగర్భ రాగములో,
రత్నాకర భోగములో,
రవి బింబం పిండినాను,
రస పాకం వండినాను
నీ కోసం !

ద్యో మండల మయిరేణిగ,
జ్యోతిషమే కంకణముగ,
స్వర్గమునే దింపినాను,
స్వర్ణాక్షత లంపినాను
నీ కోసం !

# చివరి కొమ్మను పూచినావే

చివరి కొమ్మను పూచినావే,
చేతి కందక నిల్చినావే,
రాగ మేదో రేపి నన్నీ – తీగ నీడకు తెచ్చినావే !
తెచ్చినావే – వచ్చినానే !

సోగ కన్నుల శిల్పితనమో,
మూగ నవ్వుల మించుదనమో ;
చూచి సంతోషింపు మని, నీ – శోభలన్నీ చూపినావే !
చూపినావే – చూచినానే !

శోభలన్నీ చూచినానే,
లోభినై యాచించినానే,
హృదయ పాత్రము పట్టుకొని, నీ – పదము లెంతో పాడినానే
పాడినానే – వేడినానే !

తావి తరగో, తేనె బొట్టో,
నా విదాహము తీర్చలేవే,
నీవు, నీవు సమస్తమును నా – జీవ నాంజలి వ్రాల వలెనే !
వ్రాల వలెనే – గ్రోల వలెనే !

నీవు పూర్తిగ మెచ్చు దాకా,
నీకు నీపై వచ్చుదాకా,
ఇందె నే నిలు గట్టుకొని, నీ – అందియలనే కొల్తు లేవే !
కొల్తు లేవే – నిల్తు లేవే !

# లేదామె ఓ చెలీ

లేదామె, ఓ చెలీ !
పోదామె, నా చెలీ !

పూల తోటల లోన - పూవులై పూదాము
ముగుద మోముల నుంచి - ముద్దు లొలికిందాము,
చిరు సిగ్గు తలపులో - విరి లేత వలపుగా,
ఎరుపుగా, లోకాల - మెరుపుగా పూదాము - ॥ లే ॥

ప్రాణ వాయువులలో - పరిమళాము లవుదాము
జీవ నౌకల జేరి - త్రోవ చూపిందాము,
ప్రేమార్ద్ర హృదయ వా - రధి లోతు లోతునా
రత్న శయ్యలు పరచి - రాగ మొలికిందాము - ॥ లే ॥

రాగ మాలిక లంత - రాశాన పయనింప
ప్రతి గుండె గుమ్మాన - పారాణి పెడదాము,
మణి తార మంజీర - ఘణ ఘణా రవముతో
ఆశా పరిధి చుట్టు - ఆడుకొందాము - ॥ లే ॥

ఒంటిగా వికసించి - జంటగా లేదాము
కొంటెగా విహరించి - మింట నొక టవుదాము,
నెల వంక ఉయ్యాల - వలపు కౌగిళ్ళలో
మైమరపుగా మనము - మాయమై పోదాము ॥ లే ॥

# ఏమిటి కృషి చేసేను

ఏమిటి కృషి చేసేను ?
ఏమిటి సాధించేను ?

పైకి తేలి పాలించే
పరిమళముల తేనె లేదు,
క్రింద రాలి రేకెత్తే
గింజలలో తావి లేదు ॥ ఏ ॥

కోమల గానము చేసే
కోకిల కందము లేదు,
సుందర మైన గులాబికి
శోభించే వాయి లేదు ॥ ఏ ॥

నృత్యము చేసే శంపకు
నిలకడ లేసే లేదు,
లోకము మోసే కొంపకు
ఆకలి పోసే పోదు ॥ ఏ ॥

# అమృతమే పొంగినా

అమృతమే పొంగినా,
అగ్ని కుమ్మిల్లినా,
ఈ స్వల్ప హృదయమే
ఈ యల్ప జీవితమె
క్షీర సాగర మోయి !
శివుని కంఠ మ్మోయి !

రాగమే విరిసినా,
రక్తమే కురిసినా,
ఈ గుండె గుమ్మమే
ఈ బ్రతుకు మజిలీయె
కల్పకోద్యాన మోయ్ !
కాళింగ యుద్ధ మోయ్ !

పక పకా నవ్వినా,
వెకి వెక్కి యేడ్చినా,
ఈ కృషీ జీవమే
ఈ రసీ భావమే
ప్రణయ ప్రభాతమోయ్ !
ప్రళయ జీమూత మోయ్ !

# అడవిని గాసిన వెన్నెల గాకే

అడవిని గాసిన వెన్నెల గాకే !
అమృత పాత్రను పారపంచకే !
ఏల దోటలో, సెలయేటి తరగలలో
పిలిచే పిలుపులు పెడచెవి నిడకే !
హృదయమా !
కదులుమా !

ఆకాశమునకు నిచ్చెన గైకొని
ఆశాంతములకు పరుగిడవే !
ఉడుకాంతలో, పాతాళ గంగలో
ఒసగే స్వాగతములు కాదనకే !
హృదయమా !
ఎదుగుమా !

అభ్యుదయమ్మును ఆదర్శముతో
హంపీ క్షేత్రము కానీకే !
సుప్తావని కిటికీలు మూయకే !
[illegible]ని శిబిరాలు పాయకే !
హృదయమా !
పాదలుమా !

# తీయని రేయి రేయి

తీయని రేయి రేయి – తెలియని నిదుర పోయి,
తీరని పగలు పగలు – తెమలని పనుల మునిగి,
తెరచితి నోయి కన్ను !
మరచితి నోయి నిన్ను !

కరగని బాధలతో – చెరగని గాధలల్లి,
ఆరని దాహముతో – ఆకలి వీధి కెక్కి
పట్టిన దోయి పంబ
పల్కినదోయి అంబ !

అన్నమె కేలు సాచి – అసువులు దినుట గాంచి,
మిత్రుడె నిప్పు కొరకు – మిణుగురు బట్టు టరసి
ఏడ్చినదోయి మిన్ను,
మోడ్చిన దోయి కన్ను ?

చెలియలి కట్ట ముంచి – శేషుని కోర వంచి
కోరిక పెరిగి, పెరిగి – గుండియ తరిగి, తరిగి,
ఎత్తిన భిక్ష లోనె
నెత్తురు గ్రక్కె నోయి !

నింగిని చేట చేసి – నిప్పులు చెరగు వారె ?
నేలను తోట చేసి – ని న్నిటు పిలుచుకోరె ?
మిన్నున కన్ను గ్రుచ్చి
మేల్కొని యుంటి నోయి !

# ఈ వసంత నవ లతాంత

ఈ వసంత నవ లతాంత
జీవన సద నాంగణాన
ఒక్క వలపు, ఒక్క పిలుపు,
ఒక్క పొలుపు, నెచ్చలీ !

ఈ విలోల నవోద్వేల
జీవ నదీ సైకతాన
ఒక్క పిలుపు, ఒక్క పొలుపు,
ఒక్క కొలుపు నెచ్చలీ !

ఈ విశాల నవ శాద్వల
జీవ కళా క్షేత్రాన -
ఒక్క పొలుపు, ఒక్క కొలుపు,
ఒక్క మలుపు, నెచ్చలీ !

# ఊఁగవే ఊఁయలా

ఊఁగవే ఊఁయెలా !
ఊఁపవే ఊఁహాల !

ముద్దు, మురిపెము అట్ల
తద్దిగా నేతెంచె,
నోము పంటలు దంచి
నొసట తిలకము నుంచి - ॥ ఊఁ ॥

మ్రోకు గట్టిన నింగి
మ్రాకు జవ జవ లాడ,
గోట మీటిన భూమి
పీట రవ రవ లాడ - ॥ ఊఁ ॥

తూగు టూయెల ద్రొక్కి, తూర్పు పడమర లెక్కి,
గిరగిరా తిమిరాలు గిరి చేరి బరి మూర -
ఆమనుల పసిమిలో, మామిడుల మిసిమిలో
వెలుగు నీడల దన్ని, విన్ను వీపున మోసి ॥ ఊఁ ॥

జూకాల జిలుగులో లోకాలు వెలుగగా,
పుష్ప కాలము లనక, పుష్య మాసము లనక -
జీవ నాడులు పొంగి జిల్లు మని చిందగా,
హృదయ వీణా తంత్రు లుద్రిక్త మందగా ! ॥ ఊఁ ॥

# ఎండమావులకు ఏత మెత్తి

ఎండమావులకు ఏత మెత్తి, భువి
గుండెలు కరిగించ గలవా ?
తెలి మబ్బుల వేసట పొదుగున మధు
కలశము నింపుక రాగలవా ?
అయితే, రావే యీ నేల,
అందుకోవె యీ మాల !

పువ్వుల నవ్వులు నీవేనా ? ఆ
నవ్వుల మవ్వము నిజమేనా ?
ఎట నే గంగో, ఎపుడే పొంగో,
ఎద గోడలు పదిలము లేనా ?
అయితే, రావే యీ బాట,
అందుకోవె యీ పాట !

ఉప్పెన పొంగే ఉగ్రోదధిలో
ఉట్టెను కట్టం గలవా ?
మలమల మండే మార్తాండునిలో
మంచము వేయం గలవా ?
అయితే, ఆగవె యీ శాల,
అందుకోవె యీ హేల !

# ఈ వంక రావె వయస్యా

ఈ వంక రావే, వయస్యా !
ఈ లంక లేదే సమస్య !

ఇది సాధు భూలక్ష్మి
ఇది స్వాదు వనలక్ష్మి,
నిష్కళంక ప్రేమ
నిత్యాహ సీమ ! ॥ ఈ ॥

పూర్ణ చంద్రుని పజ్జ
పూరి పచ్చని సెజ్జ
నిండు కౌగిటి లోన
నిదుర పోదువు గాని ॥ ఈ ॥

కొండ తేనెలు తెచ్చి
గోదావరిని జొచ్చి
ఆటలో, పాటలో
ఐక్యమై పోదాము ॥ ఈ ॥

నిన్నతో పని లేదు – నేడు ప్రశ్నే కాదు,
తాపాల కిరవైన – రే పన్న దిట రాదు
కడుపు నిండిన మీద – కలలెల్ల కళలేసె,
ఇష్టమే మృష్టాన్న – మిచ్ఛయే రస మిందు ॥ ఈ ॥

# కాల మెరుగని బాల భానుని

కాల మెరుగని బాల భానుని
మేలు కొల్పిన రాగ రేఖ,
మాట సేరని తాము రాకున
పాట పేనిన ప్రేమ లేఖ

కలలు కరగని ఉషా సుందరి
కన్ను తెరచిన చిత్రలేఖ,
మొయిలు గుండియ రాచి, కాలపు
ముసుగు తీసిన రస మయూఖ –

శాఖ లిన్ని సరాగలై, నీ
లేఖినిని సేవించునే !
నీవు వ్రాసిన లేఖలే నా
జీవనము నడిపించునే !

# ఆ తమ్మి మొగ్గలో

ఆ తమ్మి మొగ్గలో – నా తలపులే కలవు
ఆ వేణు రవములో – నా వలపులే కలవు
తెచ్చుకొని వస్తాను, సకియా – నేను
వచ్చువర కాగవే, సకియా !

ఆ కడలి కంఠాన – నా కలము మరిచాను
ఆ పైరు గాలిపై – నా పాట పరిచాను
పరుగులో వస్తానె, సకియా – తలుపు
తెరచియే యుంచుమా, సకియా !

తడవు చేసెద నేమొ – దారి తప్పుదు నేమొ
వెఱ్ఱిగా యే నీడ – వెంట బడి పోదునో
మరచి పోవవు గదా, సకియా – నన్ను
మన్నించు కొందువా, సకియా ?

కల వోలె, బ్రతుకు వి – ల్వలు లేకనే తేలి,
ఎద మాత్రమై నిన్ను – వెదకుకొని వచ్చాను
సురుచినై నీ ముందు, సకియా – కనుమూసి
తెరచిన ట్లుందునే, సకియా !

# అలా చూస్తా వెవరి కోసం

అలా చూస్తా వెవరి కోసం ?
అనుసరిస్తా వెవరి హాసం ?
అధర మందని అలల లోకి ?
కథల కందని కలల లోకి ? ॥ అ ॥

కొమ్మ కొమ్మా, కొండ కొండా,
గోళ గోళం, నాళ నాళం,
వెదుకుతున్నా వే యుహాస్సో !
కదుపుతున్నా వే రహస్సో ! ॥ అ ॥

సుందరము లీ పరిసరాలే
చూపులో బంధించినావే !
కదల నీవో కాల చక్రం ?
వదలి రావో హృదయ చిత్రం ? ॥ అ ॥

తరుణ భావ తరంగ ధారలు
తాకి గలగల రాలు తారలె
చలువ రాలై, కలువ పూలై
నిలిచి నీ పాదములు కొలువ - ॥ అ ॥

# సాయంతనపు వేళ

సాయంతనపు వేళ
సరసి చెంతను నిలువ,
నను జూచి చిరునవ్వు
నవ్వె నోయీ, కలువ !

గోరుముడిలో గుచ్చు
కొన్న కావి తురాయి,
ఓరగా నను జూచి
జారి పోయిన దోయి !

పుంస్కోకిలము సొను
భూతి చూపెను, కాని
రేరాణి నను వెక్కి
రించె కడు దయ వీడి !

నిద్ర పట్టక దీప
కథ నింత నే తెరువ,
నను జూచి దీపమా
రిన దోయి, ప్రియతమా !

తెరువు నిటు మలిపి, నా
పరువు నిట నిలుపుమా !
భరియింపలే నింక
భగ్న మనె పూ సెజ్జ !

# హృదయం కరిగే

హృదయం కరిగే
వదనం విరిసే
సుద్దోక టైతే నేమీ ?
ముద్దోక టైతే నేమీ ?

హృదయం నిండా పృధు రవి తేజం
వదనం నిండా ఉద యాకాశం
నించిన దొక క్షణ మైతే నేమీ ?
వంచిన దొక కణ మైతే నేమీ ?

హృదయం బృందగ, వదనం రాధగ
పువ్వుల చైత్రం, నవ్వుల నృత్యం
గజ్జెలు గంటిన నేమీ ?
కజ్జల మంటిన నేమీ ?

హృదయ సరసిజం – వదన పరిమళం
రద నోచ్చలితం – రస మంజూషం
రక్తం చిందిన నేమీ ?
వ్యక్తం చిందిన నేమీ ?

# గడ్డి పూలు ఉవ్వెత్తుగ

గడ్డి పూలు ఉవ్వెత్తుగ - ఒడ్డు చేరి తల లూచె !
ఒడ్డు ఒడ్డె కడు మత్తుగ - ఒరిగి నిన్ను తల మోచె !
రంగులతో, తొలి ప్రాయపు
పొంగులతో నీవు రాగ !

తరియించిన గోరింకలు - తపియించిన పికిలింకలు,
గొడ్ల కాడ బిడ్డలతో - ఎడ్ల దోలె నీ రథమున !
గలగల మని శివ మోహన
గంగవుగా నీవు రాగ !

మిలమిల ముత్యాల గొడుగు - మేదినికె పయోద మయ్యె !
మెరుపు వెండి వీవనలే - ఉరుకు మబ్బు కొంగ లయ్యె !
రాణివిగా, కృషి కంతకు
ప్రాణముగా నీవు రాగ !

ఘుళుఘు ళ్ళన నీ యడుగులు - ఝుళుఝు ళ్ళను నా యొడలు
పొలము పొలమె పులకరించి - మొలక లెత్తెను తొలకరించి !
సుందరమై, జీవకళా
మందిరమై నీవు రాగ !

కాలు కడిగి నీ వాకిట - కేలు కడిగి మా లోగిట,
మూన తిరిగి దుబ్బు గట్టి - ముద్దు లొలికె వరి పొలములు !
దీవనవై, కల్యాణపు
దేవతవై నీవు రాగ !

# లేవే లేవే లేవే

లేవే ! లేవే ! లేవే !
లేవే ! తుమ్మెద లేవే ! ॥ లే ॥

అరుణోదయ మరుదెంచినదే!
అరవిందము వికసించినదే !
అంధకార కారా కవాటముల
బందుల ముడి సడలినదే ! ॥ లే ॥

వాసంతిక పూ బిందెల నిండా
ఆన వాలు నింపినదే !
మోవికి చేర్చే దేవునికై మా
భూలోకము కబు రంపినదే ! ॥ లే ॥

ఆవులించి, మానవు డాకలితో
ఆకాశమునకు కేలు సాచెనే !
కెందామర మందిరపు గడపలో
ఇందిర దయతో తొంగి చూచెనే ! ॥ లే ॥

తొలి మాసము కను విచ్చినదే !
తొలకరి నవ్వులు గ్రుచ్చినదే !
జనపదాలు, వన పథాలలో వి
శ్రాంతి లేని కృషి పిల్చినదే ! ॥ లే ॥

❋ ❋ ❋

Complete works of Boyi Bhimanna - Vol-1 Lyrics Part-1

